RNI.NO.APTEL/2023/87943

ప్రజాముద్ర

PRAJA MUDRA Telugu Monthly

VISAKHAPATNAM | VOLUME : 4 | ISSUE : 1 | JULY - 2026 | EDITOR: NAGIREDDY SIVAJI | PAGES : 16 | PRICE : 10/-

విశాఖపట్నం | సంపుటి: 4 | సంచిక: 1 | జూలై -2026 | ఎడిటర్ : నగిరెడ్డి శివాజీ | పేజీలు : 16 | వెల : 10/-

హోంమంత్రి అనిత 'ఎక్స్' ఖాతా హ్యాక్..

అనకాపల్లి: సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్'లో హోం మంత్రి వంగలపూడి అనితకు చెందిన అకౌంట్ హ్యాక్‌పై అధికారులు అలర్ట్ జారీ చేశారు. హోం మంత్రి 'ఎక్స్' ఖాతా నుంచి అనధికారిక పోస్టులు జరుగుతున్నట్లు గుర్తించారు. ప్రస్తుతం వస్తున్న పోస్టులు అధికారిక సందేశాలుగా పరిగణించవద్దని ప్రజలు, మీడియా, ఫాలోవర్లను విజ్ఞప్తి చేసింది. అకౌంట్ హ్యాక్ అవ్వడంపై ఇప్పటికే ఫిర్యాదు చేశామని.. హ్యాక్ చేసిన వారిని గుర్తించేందుకు, అకౌంట్ రికవరీకి ప్రయత్నాలు చేస్తున్నట్లు వెల్లడించారు.

తల్లిదండ్రులతోపాటు ఉపాధ్యాయులూ బాధ్యత తీసుకుంటే

బిడ్డలకు ఉజ్వల భవిష్యత్తు

- రెండేళ్లలో ప్రైవేట్ పాఠశాలల నుంచి 1.10 లక్షల మంది చేరారు - రంపచోడవరంలో 'మెగా పీటీఎం'లో సీఎం చంద్రబాబు - లోకేశ్‌తో కలిసి తల్లిదండ్రులతో మాటామంతీ



పోలవరం: విద్యావ్యవస్థలో మార్పు మొదలైందని, దాన్ని కొనసాగిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. రెండేళ్లలో 1.10 లక్షల మంది ప్రైవేట్ బడుల నుంచి ప్రభుత్వ పాఠశాలలకు రావడం మన సత్తా, సమర్థతకు నిదర్శనమన్నారు. తల్లిదండ్రులతోపాటు ఉపాధ్యాయులూ బాధ్యత తీసుకుంటే బిడ్డలకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఆకాంక్షించారు. వీరందరినీ సమన్వయం చేసేందుకు తల్లిదండ్రులు– ఉపాధ్యాయుల సమావేశం ఉత్తమ వేదిక అని చెప్పారు. లోకేశ్ ఏరికోరి విద్యాశాఖను తీసుకున్నారని.. రెండేళ్ల తరువాత పరిస్థితులు చూసి పూర్తి సంతృప్తిగా ఉందని చంద్రబాబు అన్నారు. పోలవరం జిల్లా రంపచోడవరం ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు ఎల్.శ్రీనివాసరావు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన 'తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం' (మెగా పీటీఎం 4.0)లో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవితో కలిసి సీఎం ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కొత్త జిల్లా పోలవరానికి తొలిసారి వచ్చిన తాను ఉపాధ్యాయుడినయ్యానన్నారు. ఎంతమంది పిల్లలుంటే అందరికీ 'తల్లికి వందనం' డబ్బులు పడ్డాయా? లేదా? గట్టిగా చప్పట్లు కొట్టి చెప్పాలని సీఎం కోరగా.. హాజరైనవారంతా కరతాళధ్వనులతో స్పందన తెలియజేశారు. గిరిజన ప్రాంతాల్లో 5,11,000 మంది విద్యార్థులకు సంబంధించిన 3.91 లక్షల మంది తల్లుల ఖాతాల్లో రూ.664 కోట్లు జమ చేశామని చెప్పారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ నిర్వహించలేదు. మేం పారదర్శకంగా డీఎస్సీ నిర్వహించి 15,941 నియామకాలు చేస్తే బురదజల్లే ప్రయత్నం చేశారు. గతంలో గిరిజన ప్రాంతంలో అనేక ఖాళీలుంటే ఇప్పుడంతా తాజా డీఎస్సీలో నియమితులైన ఉపాధ్యాయులున్నారు. మొన్నటి వరకు ఏజెన్సీలో గంజాయి సాగు ఉంది. కూటమి ప్రభుత్వం వచ్చాక దానిని నిర్మూలించి ఉద్యాన పంటలు పండిస్తున్నాం. డ్రగ్స్ తీసుకుంటే జీవితాలు నాశనమవుతాయి. గిరిజన ప్రాంతంలో స్థానికులకే ఉద్యోగ అవకాశాలు కల్పించాలని 2000వ సంవత్సరంలో జీవో 3 తీసుకొచ్చాం. 2020లో దానిని సుప్రీంకోర్టు రద్దు చేసింది. గిరిజనులకు న్యాయం చేసేందుకు చర్చిస్తున్నా. రాబోయే 25 ఏళ్లలో ప్రపంచాన్ని శాసించే శక్తిమంతమైన జాతిగా తయారు చేసే బాధ్యత తీసుకుంటా. పోలవరం జిల్లాను నంబర్ 1గా తీర్చిదిద్దుతాం. ఈ నియోజకవర్గంలో బయటివాళ్లొచ్చి రాజకీయం చేస్తున్నారు. వారు దళిత డ్రైవర్‌ను చంపి, కారులో తీసుకువెళ్లి డోర్‌డెలివరీ చేసిన ఘనులు. పాఠశాలల అభివృద్ధికి దాతలు సహకరించాలని సీఎం పిలుపునిచ్చారు. విద్యాశాఖ రూపొందించిన 'బడి కోసం డోనర్ వెబ్' పోర్టల్, 'డ్రగ్స్ వద్దు బ్రో' హ్యాండ్‌బుక్'ను ఆవిష్కరించారు. నెల్లూరు ఉన్నత పాఠశాలలో చదువుకున్న పారిశ్రామికవేత్త పూర్ణచంద్రరావు ఆ పాఠశాలకు రూ.4 కోట్ల చెక్కు, రంపచోడవరంలో మీసేవ నిర్వహిస్తున్న ఉదయ్‌కుమార్ రూ.లక్ష ముఖ్యమంత్రికి అందజేయగా అభినందించారు. అనంతరం చిన్నారులతో సీఎం, మంత్రి లోకేశ్ కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. తర్వాత ఐ.పోలవరంలో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు.

పేపర్ లీక్ చేస్తే పదేళ్ల జైలు, రూ.10కోట్ల జరిమానా?


- బిల్లుకు క్యాబినెట్ ఆమోదం



దెస్క్: పేపర్ లీకులకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఇందుకు సంబంధించిన చట్టాన్ని సవరించేందుకు ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సమావేశంలో నిర్ణయించినట్లు సంబంధిత వర్గాల సమాచారం. ముఖ్యంగా ప్రశ్నపత్రాల లీక్‌ల ఘటనలో దోషులకు పదేళ్ల వరకు జైలు శిక్ష, రూ.10 కోట్ల వరకు జరిమానా విధించేలా ముసాయిదా బిల్లును రూపొందించినట్లు తెలుస్తోంది. ఈ బిల్లును క్యాబినెట్ ఆమోదించింది. అయితే, దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. 2024 నాటి ప్రవేశ పరీక్షల (అక్రమ పద్ధతుల నివారణ) చట్టానికి కేంద్రం కీలక సవరణలు చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ చట్టం కింద ప్రశ్నపత్రాల లీకేజీకి పాల్పడిన వ్యక్తిగత కేసుల్లో దోషులకు 3-5 ఏళ్ల జైలు శిక్ష, రూ.10లక్షల వరకు జరిమానాను విధిస్తున్నారు. అదే వ్యవస్థీకృత నేరాల్లో అయితే 5-10 ఏళ్ల జైలు శిక్ష, రూ.కోటి వరకు జరిమానా ఉంది. ఈ శిక్షలు, జరిమానాలను భారీగా పెంచుతూ చట్టాన్ని సవరిస్తున్నారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలపై జరిగిన క్యాబినెట్ భేటీలో చర్చలు జరిపారు. అనంతరం ఈ ముసాయిదా బిల్లును క్యాబినెట్ ఆమోదించింది. ఇక, పేపర్ లీకులపై విచారణకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేస్తామని మోదీ వెల్లడించిన సంగతి తెలిసిందే. ఇప్పటికే దిల్లీ న్యాయస్థానంలో తొలి ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటవ్వగా.. మరో నాలుగింటిని త్వరలోనే ఏర్పాటు చేయనున్నారు. ఈ న్యాయస్థానాల పరిధిలో.. లీకులకు సంబంధించిన కేసుల విచారణను మూడు నెలల్లో పూర్తిచేసి దోషులకు శిక్ష విధించేలా బిల్లులో ప్రతిపాదనలు చేసినట్లు సమాచారం. వచ్చే వారం ఈ బిల్లును లోక్‌సభ ముందుకు తీసుకొచ్చే అవకాశం ఉంది. నీట్ పేపర్ లీక్‌ను వ్యతిరేకిస్తూ కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన ఆందోళన ఉద్ధృతమైన నేపథ్యంలో కేంద్రం ఈ చర్యలకు ఉపక్రమించింది. లీకేజీ ఘటనలకు పాల్పడే వారిని కఠినంగా శిక్షిస్తామని స్వయంగా ప్రధాని మోదీ గురువారం అర్ధరాత్రి ప్రత్యేక వీడియో విడుదల చేశారు. ఈ బిల్లును వీలైనంత త్వరగా ఆమోదించేందుకు ప్రయత్నిస్తామని ప్రధాని తెలిపారు.

కుంకీ ఏనుగులకు స్వాగతం

- కుంకీలతో మనిషి-ఏనుగు సంఘర్షణల నివారణ - ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్



మంగళగిరి: ప్రజల భద్రత, రైతుల పంటల రక్షణ, వన్యప్రాణుల సంరక్షణ లక్ష్యాల సాధనకు కూటమి ప్రభుత్వం శాస్త్రీయ, మానవీయ విధానాల ద్వారా చర్యలు చేపడుతోందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు. అందులో భాగంగానే పార్వతీపురం మన్యం జిల్లాలో మనిషి-ఏనుగు సంఘర్షణల నివారణకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. ఇందుకోసం పలమనేరు సమీపంలోని ముసలమడుగు శిబిరం నుంచి పార్వతీపురం మన్యంలోని గుచ్చిమి శిబిరానికి శిక్షణ పొందిన జయంత్, అభిమన్యు కుంకీ ఏనుగులను తరలిస్తున్నట్లు చెప్పారు. మంగళగిరిలోని జనసేన కేంద్ర కార్యాలయం వద్ద ఆయన గజరాజులపై పూలు చల్లి స్వాగతం పలికి, వాటికి ఆహారం అందజేశారు. అనంతరం గుచ్చిమి శిబిరానికి బయలుదేరిన కుంకీల రెండో అంచె ప్రయాణాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రయాణంలో కుంకీల భద్రతకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు పవన్‌కల్యాణ్ దిశానిర్దేశం చేశారు. జయంత్, అభిమన్యుల సేవలు పార్వతీపురం పరిసర ప్రాంతాల్లో మనిషి-ఏనుగు సంఘర్షణల నియంత్రణకు ఎంతో ఉపయోగపడతాయని స్పష్టం చేశారు. ఒడిశా సరిహద్దు ప్రాంతాల నుంచి ఏనుగుల గుంపులు తరచూ పార్వతీపురం మన్యం జిల్లాలోకి ప్రవేశిస్తూ పంటలు, ఆస్తులకు నష్టం కలిగిస్తున్న నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఈ చర్యలు చేపడుతోంది. అందులో భాగంగానే ఈ కుంకీ ఏనుగులను గుచ్చిమి శిబిరానికి తరలిస్తోంది. గతంలో పలమనేరు, చిత్తూరు ప్రాంతాల్లో నిర్వహించిన పలు కీలక ఆపరేషన్లలో ఈ రెండు కుంకీలు కీలకపాత్ర పోషించాయి. అడవి ఏనుగుల గుంపులను సురక్షితంగా అటవీ ప్రాంతాలకు మళ్లించడంలో ఇవి చురుకుగా వ్యవహరించాయని అధికారులు చెబుతున్నారు.

విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో మరో ప్రమాదం

- కాంట్రాక్ట్ కార్మికుడు మృతి



విశాఖపట్నం: స్టీల్‌ప్లాంట్ కోకోవేన్ విభాగంలో ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో అనంత్ అనే కాంట్రాక్ట్ కార్మికుడు మృతి చెందారు. ఐరన్ పడటంతో తీవ్ర గాయాలతో మృతిచెందారు. స్టీల్ ప్లాంట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గత జూన్ నెలలో విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో 10 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. తాజాగా విశాఖ స్టీల్ ప్లాంట్‌లో జరిగిన ప్రమాదంలో ఒక కార్మికుడు మృతిచెందడంతో మరోసారి భద్రతా ప్రమాణాలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే, విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ప్రమాదాలు జరగడం ఇదే మొదటిసారి కాదు. కొన్ని దశాబ్దాలుగా ప్లాంట్‌లో ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. వివిధ విభాగాల్లో జరిగిన ప్రమాదాల్లో పలు కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపాయి. ప్రధానంగా గ్యాస్ లీకేజ్, పేలుళ్లు, ద్రవ లోహం లీకేజ్ వంటి ఘటనలు జరుగుతూనే ఉండటంతో విశాఖ స్టీల్ ప్లాంట్‌లో కార్మికుల భద్రత ప్రశ్నార్థకరంగా మారింది.

విశాఖ విద్యార్థులు ప్రపంచస్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందాలి

- జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ - అడవివరం జడ్పీ హైస్కూళ్లో ఘనంగా మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ - విద్యార్థుల్లో స్ఫూర్తి నింపి.. వారితో సహఫంక్తి భోజనం చేసిన జిల్లా కలెక్టర్



విశాఖపట్నం: విశాఖపట్నం పేరు ప్రపంచవ్యాప్తంగా వినిపిస్తోందని, ఇక్కడి విద్యార్థులు భవిష్యత్తులో ప్రపంచస్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందేలా తీర్చిదిద్దడమే లక్ష్యమని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ అన్నారు. విద్యార్థులు భవిష్యత్తులో మూలవిరాట్‌లుగా ఎదగాలని ఆకాంక్షించారు. అందరి సహకారంతో విశాఖ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు. అడవివరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన మెగా పేరెంట్స్ టీచర్స్ 4.0 కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఏర్పాటు చేసిన వివిధ ప్రాజెక్టుల స్టాళ్లను సందర్శించి వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు రూపొందించిన డ్రోన్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అసలైన డ్రోన్‌ను పాఠశాలకు తీసుకువచ్చి విద్యార్థులకు ప్రత్యక్షంగా చూపించాలని అధికారులను ఆదేశించారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో ప్రత్యేకంగా సమావేశమైన కలెక్టర్ హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి బోధనా పద్ధతులు, అభ్యసన సాధనాలపై వివరాలు తెలుసుకున్నారు. పాఠశాల 88 శాతం ఫలితాలు సాధించడం అభినందనీయమని కలెక్టర్ అన్నారు. గత ఏడాది 453గా ఉన్న విద్యార్థుల సంఖ్య ఈ ఏడాది 490కి పెరగడం శుభ పరిణామమన్నారు. విద్యారంగంలో ప్రభుత్వం చేపడుతున్న ప్రధాన సంస్కరణల్లో మెగా పీటీఎం 4.0 ఒక భాగమన్నారు. ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఏమాత్రం తీసిపోరనే నమ్మకాన్ని పెంపొందించడమే కార్యక్రమం ఉద్దేశమన్నారు. విద్యార్థులు అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు.


విద్యార్థుల అభివృద్ధికి తల్లిదండ్రులు ప్రత్యేక బాధ్యత తీసుకోవాలి



అనకాపల్లి (రావికమతం): విద్యార్థులు అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ ఆదేశాల మేరకు రావికమతం మండలం, మరుపాక ఏపీ మోడల్ స్కూల్ నందు నిర్వహించిన మెగా పేరెంట్స్ టీచర్స్ 4.0 కార్యక్రమంలో చోడవరం శాసనసభ్యులు ఖూచీ రాజుతో కలసి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మెగా పీటీఎం విద్యారంగంలో చేపడుతున్న ప్రధాన సంస్కరణల్లో ఒక భాగమన్నారు. తల్లిదండ్రులు వారానికి ఒకసారైనా పాఠశాలకు వచ్చి పిల్లల చదువు, ప్రగతిని పరిశీలించాలని సూచించారు. ఆడపిల్లలను ఉన్నత చదువులు చదివించాలని, వారు అనుకున్న లక్ష్యాలను సాధించేలా ప్రోత్సహించాలని కోరారు."తమ జీవితంలో నెరవేరని కలలను పిల్లల ద్వారా నెరవేర్చుకోవాలనే తపన ప్రతి తల్లిలో ఉంటుందని, పిల్లలు ఉన్నత స్థాయికి ఎదగడమే తల్లిదండ్రులకు నిజమైన సంతోషం" అన్నారు. పిల్లల పెంపకం మరియు వారి భవిష్యత్తును తీర్చిదిద్దడంలో తల్లులతో పాటు తండ్రుల శ్రమ, పాత్ర కూడా ఎంతో కీలకమైనవని ప్రత్యేకంగా అభినందించారు. తన సొంత విద్యాభ్యాసం మరియు ఉన్నత స్థితికి చేరుకున్న ప్రయాణాన్ని విద్యార్థులతో పంచుకుంటూ, సరైన చదువు, క్రమశిక్షణ ద్వారా ఏ లక్ష్యాన్నైనా సాధించవచ్చని స్పష్టం చేశారు. సాధారణంగా పిల్లలను నీట్‌గా తయారు చేసి పాఠశాలకు పంపడం, వారి హోంవర్క్ చూడటం తల్లులు బాధ్యతగా తీసుకుంటే, సమాజాన్ని ధైర్యంగా ఎదుర్కొనే ఆత్మవిశ్వాసాన్ని నింపడంలో తండ్రి పాత్ర ఎంతో కీలకమైనదని స్పష్టం చేశారు. సమాజంలో ప్రతీ ఆడపిల్లను తమ సొంత ఇంట్లోని కూతురు, సోదరి లేదా తల్లిగా భావించినప్పుడే సమాజం సురక్షితంగా ఉంటుందని పేర్కొన్నారు. మగపిల్లలకు చిన్ననాటి నుంచే మహిళల పట్ల గౌరవం, మర్యాద మరియు నైతిక విలువలు నేర్పించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని సూచించారు. కులం, మతం, లింగం, ధనిక-పేద వ్యత్యాసాలు వంటి విభజన శక్తులను పక్కనబెట్టి, ప్రతీ ఒక్కరూ "మానవత్వమే మన మతం" అనే భావనను అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు.

నీట్ లీకేజీ ఘోర పాపం

-విద్యార్థుల భవితతో ఆటాడితే సహించం: మోదీ



దిల్లీ: నీట్ ప్రశ్నపత్రం లీకేజీ ఘోర పాపమని ప్రధాని నరేంద్రమోదీ వ్యాఖ్యానించారు. ఇకపై ఎవరూ యువత భవితవ్యంతో ఆడుకోకుండా చేసేందుకు దీనిలో భాగస్వాములైనవారిపై కఠిన చర్యలు తీసుకున్నామని చెప్పారు. దేశ రాజధాని కేంద్రంగా విద్యార్థులు పెద్దఎత్తున ఉద్యమిస్తున్న వేళ ఎన్డీయే ఎంపీల సమావేశంలో మోదీ తొలిసారి ఈ అంశంపై బహిరంగంగా స్పందించారు. పార్లమెంటు భవన గ్రంథాలయంలో 'మంగళ్ మిలన్' పేరుతో దీనిని నిర్వహించారు. "ఇది పార్టీ రాజకీయాలు చేసే అంశం కాదు.. దేశ ప్రయోజనాలతో ముడిపడింది. ఇలాంటివి పునరావృతం కాకుండా చూడటానికి పార్టీలకు అతీతంగా కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేయాలి. ప్రజలతో ఎన్డీయే ఎంపీలంతా ప్రేమపూర్వకంగా అనుసంధానం కావాలి. యువత విశ్వాసాన్ని పొందగలగాలి" అని ప్రధాని చెప్పారు.

నీట్ పరీక్ష పత్రం లీకేజీ, వివిధ దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు (ఎఫ్‌టీఏలు), దేశ ఆర్థిక పురోగతి తదితర అంశాలపై ప్రధాని మాట్లాడినట్లు పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు మీడియాకు తెలిపారు. విద్యార్థుల వెంటే ప్రభుత్వం నిలుస్తుందని, ప్రశ్నాపత్రాల లీకేజీ దేశవ్యాప్తంగా ఆందోళన కలిగించే అంశమని ప్రధాని పేర్కొన్నట్లు వెల్లడించారు. "అవసరమైతే న్యాయ నిపుణులతో సంప్రదించి చట్టపరంగా కఠిన చర్యలు చేపట్టాలని ప్రధాని ఈ సమావేశంలో సూచించారు. పేపర్ లీక్ ఘటనలపై రాజీ లేకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. నీట్ పరీక్షలో అక్రమాలపై నివేదికలు అందిన వెంటనే కేంద్ర ప్రభుత్వం స్పందించి 13 మందిని అరెస్టు చేసి నిపుణులైన న్యాయవాదుల్ని రంగంలో దించి జైలుకు పంపినట్లు చెప్పారు. లీకేజీ బాధ్యులకు కఠిన శిక్షలు పడేలా చూసి ఇలాంటివి పునరావృతం కాకుండా చేయాలన్నారు" అని రిజిజు వెల్లడించారు.

రాష్ట్రానికి లాజిస్టిక్స్ కేంద్రంగా భోగాపురం విమానాశ్రయం

-ప్రారంభోత్సవ ఏర్పాట్లపై సీఎం చంద్రబాబు టెలికాన్ఫరెన్స్



అమరావతి: ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు తొడిగేలా నిర్మించిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం (భోగాపురం) రాష్ట్రానికి లాజిస్టిక్స్ కేంద్రంగా గ్లోబల్ కనెక్టివిటీని అందిస్తుందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. విమానాశ్రయంతో పాటు ఏఐ డేటా సెంటర్లు, రేర్ ఎర్త్ మినరల్స్ వంటి ఖనిజాలు ఉత్తరాంధ్ర ముఖచిత్రాన్ని మారుస్తాయని తెలిపారు. భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవ ఏర్పాట్లపై ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులతో సీఎం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. 'ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభమయ్యే విమానాశ్రయం ఉత్తరాంధ్రకు గ్రోత్ ఇంజిన్‌గా మారనుంది. ఎయిర్‌పోర్ట్ ప్యాసింజర్ టెర్మినల్, ఏవియేషన్ యూనివర్సిటీ, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, ఏవియేషన్ హబ్, ఎడ్యు సిటీలను ప్రధాని ప్రారంభించబోతున్నారు. ఈ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించాలి. రాబోయే తొమ్మిది రోజుల పాటు ఉత్తరాంధ్రలోని ప్రతి ఇంటా ప్రారంభోత్సవ స్ఫూర్తి చేరాలి. ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాల కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించే బాధ్యత తీసుకోవాలి. అరకు కాఫీ, ఇక్కడి సంస్కృతి సంప్రదాయాలు, స్థానిక కళారూపాలను ప్రదర్శించాలి. విశాఖ ఎకనమిక్ రీజియన్‌లో భోగాపురం విమానాశ్రయం ఎంతటి కీలకపాత్ర పోషిస్తుందనేది ప్రజలకు వివరించాలి' అని చంద్రబాబు సూచించారు.

మోదీకి చంద్రబాబు ఆహ్వానం....ముఖ్యమంత్రి చంద్రబాబు దిల్లీ వెళ్తున్నారు. ప్రధాని మోదీ సహా పలువురు కేంద్ర మంత్రుల్ని ఆయన కలవనున్నారు. భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవానికి ప్రధాని మోదీని చంద్రబాబు స్వయంగా ఆహ్వానిస్తారు. ఆగస్టు 1న ప్రధాని చేతుల మీదుగా విమానాశ్రయాన్ని ప్రారంభిస్తారు. కేంద్ర మంత్రులు అమిత్‌షా, పీయూష్ గోయల్, మనోహర్‌లాల్ ఖట్టర్, సీఆర్ పాటిల్‌లను కూడా సీఎం కలిసే అవకాశముంది.

ఓటు స్ఫూర్తిని యువత ముందుకు తీసుకువెళ్లాలి


-రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్‌చంద్ర పునేఠా



అమరావతి: 'ప్రజాస్వామ్యంలో ఎన్నికల సమర్థ నిర్వహణ అన్ని వర్గాల భాగస్వామ్యంపై ఆధారపడి ఉంటుంది. ఇందులో ప్రజల భాగస్వామ్యమే ప్రజాస్వామ్య విజయానికి, విశ్వసనీయతకు, బలోపేతానికి నిజమైన పునాది' అని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్‌చంద్ర పునేఠా పేర్కొన్నారు. ఇండియా ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెమోక్రసీ అండ్ ఎలక్టోరల్ అసిస్టెన్స్ (ఐడియా), ఏపీ సీఈవో సంయుక్త ఆధ్వర్యంలో విజయవాడలో 'ఓటర్ల అర్హతలు' అనే అంశంపై అంతర్జాతీయ కార్యశాల నిర్వహించారు. అనిల్ చంద్ర పునేఠా మాట్లాడుతూ.. 'భారత ఎన్నికల సంఘం చేపట్టిన అవగాహన కార్యక్రమాలు, ఇతర బలమైన కార్యాచరణ వల్ల పోలింగ్ శాతం పెరిగింది. ఇటీవల పశ్చిమబెంగాల్ ఎన్నికల్లో పోలింగ్ 92 శాతం దాటింది. ఓటు వేయడానికి ప్రజలు జీవనోపాధి వదిలి తమ సొంతూళ్లకు రాకుండానే వారిని ఎన్నికల ప్రక్రియలో ఎలా భాగస్వామ్యం చేయాలన్న అంశంపై కసరత్తు జరగాలి' అని పేర్కొన్నారు. రాష్ట్ర మాజీ ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేశ్‌కుమార్ మాట్లాడుతూ.. ఓటు ప్రజల హక్కు మాత్రమే కాదు బాధ్యత కూడా అన్నారు. విశిష్టమైన ఓటు హక్కు గురించి యువత బాగా అవగాహన పెంచుకుని మరింత మందికి తెలియజెప్పాలని సూచించారు. రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ (సీఈవో) వివేక్ యాదవ్ మాట్లాడుతూ.. ఓటర్ల అర్హత అంశంపై 9 సోపానాలు రూపొందించి క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అమలు చేసేలా ప్రమాణాలను రాష్ట్రం రూపొందిస్తోందన్నారు. కార్యక్రమంలో ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల కలెక్టర్లు లక్ష్మీశ, బాలాజీ పాల్గొన్నారు. వివిధ రాష్ట్రాల ఎన్నికల విభాగాల ప్రతినిధులు, విద్యావేత్తలు వర్చువల్‌గా హాజరయ్యారు.

'ఒక కుటుంబం- ఒక పారిశ్రామికవేత్తకు' సహకారమందించండి

-కేంద్రమంత్రులను కోరిన మంత్రి కొండపల్లి



దిల్లీ: ఏపీ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న 'ఒక కుటుంబం- ఒక పారిశ్రామిక వేత్త' లక్ష్యానికి కేంద్రం నుంచి మరింత సహకారం అందించాలని రాష్ట్ర సెర్ప్ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కేంద్రమంత్రులను కోరారు. ఈ మేరకు ఆయన దిల్లీలో కేంద్ర ఎంఎస్ఎంఈ శాఖ మంత్రి జీతన్ రామ్ మాంఝీ, కేంద్ర సహాయ మంత్రి శోభా కరంద్లాజేతో భేటీ అయ్యారు. ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రామ్ (పీఎంఈజీపీ)లో కేంద్రం ఇచ్చిన లక్ష్యాలను అధిగమించామని, ఈ పథకం కింద 2026-27 బడ్జెట్‌లో ఎక్కువ కేటాయింపులు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే వైఎస్సార్ కడప జిల్లాలోని కొప్పర్తిలో ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటు చేయాలని, అనంతపురంలోని ఎస్‌కే యూనివర్సిటీ, విజయనగరం జేఎన్‌టీయూలలో ఎంఎస్ఎంఈ ఎక్స్‌టెన్షన్ సెంటర్ల ఏర్పాటును వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ సెప్టెంబరు 11-13 వరకు విశాఖపట్నంలో నిర్వహించే ఎంఎస్ఎంఈ ఎక్స్‌పో కార్యక్రమానికి కేంద్రమంత్రి మాంఝీని కొండపల్లి ఆహ్వానించారు.

'స్వయం' ఉత్పత్తుల స్టాల్ ఏర్పాటుకు వినతి .....'స్వయం' బ్రాండ్ ఉత్పత్తులకు గ్లోబల్ మార్కెటింగ్ కల్పించడానికి భోగాపురం విమానాశ్రయంలో స్టాల్ ఏర్పాటుకు సహకరించాలని పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడిని మంత్రి కొండపల్లిశ్రీనివాస్ కోరారు. దిల్లీలో రామ్మోహన్‌నాయుడిని కలిసి వినతిపత్రం ఇచ్చారు. అంతకుముందు మంత్రి కొండపల్లి కేంద్ర ఆహార భద్రత, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ కార్యదర్శి అవినాష్ ప్రకాశ్ జోషి, సంయుక్త కార్యదర్శి దేవేష్ దేవల్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ (పీఎంఎఫ్ఎంఈ) పథకం అమలు గురించి చర్చించారు. ఈ పథకం కింద ఎస్‌హెచ్‌జీ సభ్యులకు వడ్డీ రాయితీతో రుణాలు ఇవ్వాలని మంత్రి కోరారు. ఆయన వెంట స్త్రీనిధి మేనేజింగ్ డైరెక్టర్ హరిప్రసాద్ ఉన్నారు.

సాగు ఖర్చులకు కేంద్రం సాయం చేయాలి

-కేంద్ర మంత్రులకు ఏపీ బృందం వినతి



దిల్లీ: కేంద్ర మంత్రులు శివరాజ్‌సింగ్‌చౌహాన్, నిర్మలా సీతారామన్‌లను రాష్ట్రానికి చెందిన మంత్రులు, ఎంపీలు కలిసి రాష్ట్రంలో నెలకొన్న వ్యవసాయ పరిస్థితులు, పొగాకు రైతుల సమస్యలను వివరించారు. వీరితో రాష్ట్రానికి చెందిన ఇద్దరు కేంద్రమంత్రులు కూడా ఉన్నారు. వ్యవసాయంలో పెట్టుబడి వ్యయాలు పెరగడంతో రైతులపై ఆర్థిక భారం పెరుగుతోందని, కేంద్రం సాగు ఖర్చులు తగ్గించేందుకు సహకారం అందించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహన్‌కు విన్నవించారు. మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా పంటలకు మెరుగైన ధరలు లభించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పౌరవిమానయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడితో కలిసి రాష్ట్ర మంత్రులు, ఎంపీల బృందం కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహన్‌ను కలిసింది. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు ఒక ప్రకటన విడుదల చేశారు. 'రాష్ట్రంలో వ్యవసాయాభివృద్ధి, రైతుల సంక్షేమం, గిట్టుబాటు ధర, మార్కెటింగ్ సదుపాయాలు మెరుగుపరచడం, ఎల్‌నినో తదితర అంశాలపై చర్చించాం' అని పేర్కొన్నారు. అనంతరం ఈ బృందం ఉపరాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్‌ను కలిసింది. ముడిపొగాకుపై జీఎస్టీ తగ్గించాలని వినతి: ముడిపొగాకుపై ఉన్న జీఎస్టీని 40 నుంచి 28 శాతానికి తగ్గించాలని కోరుతూ కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను ఏపీ మంత్రులు, ఎంపీల బృందం మంగళవారం కలిసి వినతిపత్రం అందజేసింది. ఈ కార్యక్రమాల్లో పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, రాష్ట్ర మంత్రులు అచ్చెన్నాయుడు, గొట్టిపాటి రవి, డోలా బాలవీరాంజనేయస్వామి, ఎంపీలు పురందేశ్వరి, లావు శ్రీకృష్ణదేవరాయలు, కలిశెట్టి అప్పలనాయుడు, మాగుంట శ్రీనివాసులురెడ్డి, బస్తిపాటి నాగరాజు, బీద మస్తాన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక నేరాలకు.. అత్యాధునిక పోలీసింగ్ అవసరం



విజయవాడ: సీఎం చంద్రబాబు 2001లో ప్రారంభించిన పోలీసు సంస్కరణల రీట్రీట్ సంప్రదాయాన్ని 25 ఏళ్ల తర్వాత పునరుద్ధరించడం చారిత్రాత్మకమని హోంమంత్రి అనిత పేర్కొన్నారు. భవిష్యత్ సవాళ్లను ముందుగానే అంచనా వేసి పోలీసు వ్యవస్థను సిద్ధం చేయడమే ఈ రీట్రీట్ ప్రధాన లక్ష్యమని వివరించారు. విజయవాడలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళా వేదికలో నిర్వహించిన రీట్రీట్‌లో హోం మంత్రి అనిత ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో పోలీసులు చేస్తున్న సేవలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ప్రస్తుతం సైబర్ నేరాలు, రౌడీయిజం, సోషల్ మీడియా దుర్వినియోగాన్ని అరికట్టడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఆధునిక నేరాలను ఎదుర్కోవడానికి పోలీసులు కూడా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని సూచించారు. మహిళలు, చిన్నారుల భద్రత ప్రభుత్వ అత్యున్నత ప్రాధాన్యత అని వెల్లడించారు. గంజాయి నిర్మూలన కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఈగల్' వ్యవస్థ ద్వారా ఎస్పీలు, పోలీసు అధికారులు సమన్వయంతో గంజాయి సాగు, అక్రమ రవాణాపై సమర్థవంతమైన చర్యలు తీసుకుంటున్నారని వెల్లడించారు. పోలీసు శాఖ బలోపేతానికి ఇప్పటికే 6 వేల మంది కానిస్టేబుళ్ల పోస్టులను భర్తీ చేశామని పేర్కొన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలను మరింత పటిష్ఠం చేయడానికి ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.

బతికున్న వ్యక్తినే కాగితాలపై చంపేశారు



శ్రీకాకుళం: వైసీపీ అంటేనే గొడ్డలి పార్టీ అని, ఆ పార్టీ అధినేత జగన్ ఆధ్వ ర్యంలో నాయకుడు మొదలుకొని చిట్టచివరి కార్యకర్త వరకు భూ కబ్జాలు, దాడులు, అత్యాచారాలకు పాల్పడ్డారని ఆమదా లవలస ఎమ్మెల్యే, రాష్ట్ర పీయూసీ చైర్మన్ కూన రవి కుమార్ ధ్వజమెత్తారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వైసీ పీ అధినేత జగన్, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజుల అక్రమాలపై తీవ్ర ఆరోపణలు చేశారు.

స్పీకర్ పదవికే కళంకం తెచ్చారు..అసెంబ్లీలో ఊకదంపుడు ఉపన్యాసాలిస్తూ, నీతులు వల్లించి ప్రతిపక్షాలను పురుగులకన్నా హీనంగా చూసిన మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం ఆ పదవికే కళంకం తెచ్చారని విమర్శించారు. బతికున్న వ్యక్తిని కాగితాలపై చంపేశారని ఆరోపించారు. రాజ్యాంగం కల్పించిన జీవిం చే హక్కును కాలరాసి ఆస్తుల కోసం ఏకంగా నకిలీ పత్రాలు సృష్టించడం తమ్మినేనికి అలవాటుగా మారింద న్నారు. 'ఫేక్ అదబాల రజని'ని 'అంధవరపు రజని'గా మార్చి సుమారు రూ.4 కోట్ల విలు వైన భూమిని అన్యా యంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని, ఈ కబ్జాలో సీతారాం అసలు సూత్రధారి కాగా అతడి కుమారుడు పాత్రధారి అని విమర్శించారు. నకిలీ పత్రాలతో ఇసుక తవ్వకాల్లో కూడా అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపిం చారు. నకిలీ సర్టిఫికెట్లతో కబ్జాలు చేయమని శాసనసభ మీకు అధికారం ఇచ్చిందా అని ప్రశ్నించారు. ఈ అక్రమా లకు అడ్డువడిన తన కళాశాల లో పనిచేస్తున్న అమా యక ఫ్యాకల్టీని బలిచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పలరాజు వల్లే కేసు తారుమారు....మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కుమారుడు హిట్ అండ్ రన్ కేసు వ్యవహారంపైనా ఎమ్మెల్యే రవి కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

మంత్రిగా రాజ్యాంగ మౌలిక సూత్రాలు పాటిస్తానని ప్రమాణం చేసిన అప్ప లరాజు.. సొంత కొడుకును తన కడుపులో దాచుకునేం దుకు మరో తల్లి కడుపులో మంట పెట్టారని విమర్శిం చారు. రోడ్డు ప్రమాదం తర్వాత కొన ఊపిరితో ఉన్న వ్యక్తినికి ఆస్పత్రికి తీసుకు వెళ్లాల్సిన కనీస బాధ్యతను విస్మరించారన్నారు. అసలు నిందితుడైన తన కొడుకు స్థానంలో.. ఆ ప్రమాదంతో ఎలాంటి సంబంధం లేని బ్రాహ్మణ కులానికి చెందిన మరొక అమాయక యువ కుడిని ప్రవేశపెట్టి కేసును తప్పుదోవ పట్టించడం అన్యాయం కాదా అని నిలదీశారు. గతంలో ఉప ముఖ్య మంత్రి ధర్మాన కృష్ణదాస్ పీఏ ఇంట్లో రూ.వంద కోట్లు దొరికినప్పుడు జగన్, ధర్మాన ప్రసాదరావు, కృష్ణదాస్ ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. 2019-24 మధ్య 64 మంది మత్స్యకారులు సముద్రంలో గల్లంతై చనిపోతే ఒక్క రూపాయి కూడా సాయం చేయని జగన్.. ఇప్పుడు పరామర్శలకు వెళ్లడం ద్వంద్వ విధానం కాదా అని ప్రశ్నించారు. చట్టం తన పని తాను చేస్తుంది.....అప్పట్లో తమ్మినేని సీతారాం 'జగన్నాథ రథచక్రాలు వస్తున్నాయి' అన్నారు కానీ నిజంగా ఇప్పుడు ధర్మ రథ చక్రాలు వచ్చాయి. శ్రీకృష్ణుడి లాంటి చంద్రబాబు నా యుడు రాష్ట్రానికి సీఎంగా ఉన్నారు. వైసీపీ నాయకులు ఎవరైనా భూకబ్జాలకు పాల్పడితే ప్రజలు వెంటనే తెలి యజేయాలి, చట్టం తన పని తాను చేసుకుపోతుంది. జిల్లాలో వైసీపీ నేతలు చేసిన అక్రమాలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలి'అని సూచించారు. సమావేశం లో టీడీపీ జిల్లా అధ్యక్షుడు మొదలవలస రమేష్, నాయ కులు పీఎంజే బాబు, పి.శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

సమున్నత ప్రతీక- ఆషాఢ బోనాల వేడుక

ప్రకృతి శక్తిని అమ్మతల్లిగా భావించే సంస్కృతి అనాదిగా కొనసాగుతోంది. సృష్టి, స్థితి, లయకారకమైన దివ్యశక్తి స్వరూపాన్ని పలురీతుల్లో దర్శిస్తూ కొలుపులు, జాతరలు, ఉత్సవాలు నిర్వహించే సంప్రదాయాలు ఉన్నాయి. ప్రకృతి ఆకృతులైన జగన్మాతల ఆరాధనకు ఆషాఢమాసం ప్రత్యేకమైనది. దక్షిణాయనం ప్రారంభంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు బాగా పండాలని, పచ్చదనం విలసిల్లాలని, ఆరోగ్య సౌభాగ్యాలు వర్ధిల్లాలని ప్రజలు గ్రామ దేవతలను తమవైన పద్ధతులలో పూజిస్తారు. తెలంగాణవ్యాప్తంగా ఆషాఢంలో నిర్వహించే బోనాల వేడుక గ్రామీణ సంస్కృతిని ఆవిష్కరిస్తుంది. ప్రకృతి శక్తుల విభిన్న కళలే గ్రామదేవతలని దేవీ భాగవతం వెల్లడించింది. తమ పలుకుబడులు, అభీష్టాలకు అనుగుణంగా గ్రామీణులు శక్తి రూపాలకు వివిధ పేర్లను పెట్టుకున్నారు. వారికి అర్చనలు చేసి, అన్న పదార్థాలను నివేదించుకునే ఆచారం ఆషాఢ బోనాల వేడుకగా స్థిరపడింది. హైదరాబాద్, సికింద్రాబాద్ నగరాలలో బోనాల సంబరం వైభవంగా జరుగుతుంది. గోల్కొండ కోటలో ఉన్న జగదాంబికా ఆలయంలో భక్తులు 'కలిమి బోనాలు'గా పేర్కొనే ఆషాఢ తొలి బోనాలను సమర్పిస్తారు. కాకతీయుల కాలంనుంచి ఇక్కడ జగదంబ అభీష్ట వరదాయినిగా పూజలు అందుకుంటున్నట్లు చారిత్రక ఆధారాలున్నాయి. ప్రతాపరుద్ర చక్రవర్తి బోనాల వేడుకను ప్రారంభించినట్లు చెబుతారు. ఆషాఢంలో ప్రతి ఆది, గురువారాల్లో గోల్కొండ బోనాలను నిర్వహిస్తారు. ఆ తర్వాత సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి, బల్కంపేట ఎల్లమ్మ, లాల్ దర్వాజా మాతా మహేశ్వరి, షాలిబండ మహంకాళి ఆలయాల్లో ఈ వేడుకలు కొనసాగుతాయి. వేపాకులతో కూడిన పసుపు నీళ్ల కలశాలు, అన్న పదార్థాల కుండలను తలపై ధరించి మహిళలు శక్తిమాతల మందిరాలకు వేడుకగా తరలివస్తారు. ఆ జలాలతో అమ్మవార్లకు అభిషేకం చేసి, అన్న పదార్థాలను నివేదన చేస్తారు. ఎదుర్కోలు, ఘటోత్సవం, ఫలహారపు బండ్ల ఊరేగింపులు, పోతురాజుల నృత్య విన్యాసాలు, భవిష్యవాణిని వినిపించే రంగం, సాగనంపు వంటి ప్రక్రియలతో ఈ సంబరం కనువిందు చేస్తుంది. జగన్మాతను 'అమృత భాండోదరి' అని కీర్తిస్తారు. శ్రీమాత తన ఉదరమనే అమృత భాండంలో సకల జగత్తును నిక్షిప్తం చేస్తుందని దేవీ భాగవతం పేర్కొంది. అందుకు సంకేతంగా మట్టి కుండలలో అన్న పదార్థాలను నింపి గ్రామదేవతలకు సమర్పిస్తారు. బోనపు కుండ శరీరానికి ప్రతీక. ఆ కుండలోని అన్నం జీవశక్తికి సంకేతం. ఆ కుండపై ప్రమిదలో వెలిగే జ్యోతి ప్రాణదీపం. ఆధ్యాత్మిక చైతన్యంతో పాంచ భౌతికమైన మట్టికుండ లాంటి శరీరాన్ని త్రికరణ శుద్ధిగా దైవానికి సమర్పించాలి. ఆత్మజ్యోతిని, పరంజ్యోతితో మమేకం చేసి మోక్షస్థితిని అందుకోవాలని బోనాల ఉత్సవం సందేశమిస్తుంది. బోనాల వేడుకలో కలశ స్థాపన సృష్టికి, ఊరేగింపు స్థితికి, సాగనంపు లయకు ప్రతిబింబాలు. సృష్టి లీలావిలాసం బోనాల వేడుకలో అంతర్లీనంగా ప్రస్ఫుటమవుతుంది. సామూహిక భక్తి విశ్వాసాలకు, సామాజిక సమష్టి జీవన తత్వానికి సమున్నత ప్రతీక- ఆషాఢ బోనాల వేడుక.

ప్రజా సమస్యలు, మీసేవ దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలి

-ప్రజా సేవల్లో జాప్యాన్ని సహించేది లేదు - జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్



అనకాపల్లి: ప్రజా సమస్యల పరిష్కారం, మౌలిక వసతుల కల్పన, సంక్షేమ పథకాల అమలు, మీసేవ సేవలందించడంలో ఎలాంటి జాప్యం జరిగినా సహించేది లేదని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ స్పష్టం చేశారు. జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా స్థాయి సమీక్షా సమావేశంలో వివిధ శాఖల పనితీరు, మౌలిక సదుపాయాలు, రేషన్ పంపిణీ, పింఛన్లు, మీసేవ దరఖాస్తులు, ఈ-కేవైసీ, రీ-సర్వే, మ్యుటేషన్ల పురోగతిపై శాఖల వారీగా సమగ్ర సమీక్ష నిర్వహించారు.

మౌలిక వసతుల అభివృద్ధి వేగవంతం చేయాలి.... జిల్లాలో తాగునీరు, విద్యుత్, రహదారులు, పాఠశాలలు, కమ్యూనిటీ హాళ్ల అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. నిలిచిపోయిన రహదారి పనులు, కనెక్టివిటీ సమస్యలను ప్రణాళికాబద్ధంగా వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

రేషన్, పింఛన్ల పంపిణీలో జాప్యం ఉండరాదు.... కాలనీలు, మారుమూల గ్రామాల్లో రేషన్, పింఛన్లు సకాలంలో అందేలా పంపిణీ ఏర్పాట్లు పటిష్టంగా ఉండాలని ఆదేశించారు. పింఛన్ల మ్యాపింగ్‌లో ఉన్న సాంకేతిక సమస్యలను డీఆర్‌డీఏ, గ్రామ/వార్డు సచివాలయాల అధికారులతో సమన్వయం చేసుకుని వెంటనే పరిష్కరించాలని సూచించారు.

మీసేవ పెండింగ్ దరఖాస్తులపై అసంతృప్తి.... మీసేవ పోర్టల్‌లో ఆదాయ, కుల, ఓబీసీ, భూమి విలువ, కుటుంబ సభ్యుల ధృవీకరణ, జనన-మరణాల ఆలస్య నమోదు దరఖాస్తులు అధికంగా పెండింగ్‌లో ఉండటంపై కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నిబంధనల ప్రకారం పరిశీలించి అన్ని దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలని ఆదేశిస్తూ, "తదుపరి సమీక్షా సమావేశం నాటికి మీసేవ పెండింగ్ దరఖాస్తులు సున్నాకు చేరాలి. ప్రజా సేవల అమలులో నిర్లక్ష్యం ప్రదర్శించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటాం" అని హెచ్చరించారు. ఎస్. రాయవరం మండలంలో రీ-రిజెక్షన్లు లేకపోయినా, గడువు దాటిన 55 శాతం దరఖాస్తులు పెండింగ్‌లో ఉండటాన్ని తప్పుబట్టారు. అనకాపల్లి మండలం దరఖాస్తుల పరిష్కారంలో మెరుగైన పనితీరు కనబరుస్తోందని అభినందించారు. జిల్లాలో సగటున 11 శాతం దరఖాస్తులు తిరస్కరణకు గురవగా, కొన్ని ప్రాంతాల్లో 40 శాతం వరకు తిరస్కరణలు నమోదవడంపై సంబంధిత అధికారులు స్పష్టమైన కారణాలు తెలియజేయాలని ఆదేశించారు.

ఈ-కేవైసీ, రీ-సర్వే పనులు వేగవంతం చేయాలి..... ఆర్ఓఆర్ పూర్తయిన గ్రామాల్లో ఈ-కేవైసీ, రీ-సర్వే పనుల పురోగతిని సమీక్షించారు. మాకవరపాలెం మండలంలో 81 శాతం, అచ్యుతాపురం మండలంలో 86 శాతం పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. సెప్టెంబర్ నాటికి లక్ష్యాలను పూర్తిచేయాలని సూచించారు.

మ్యుటేషన్లు, పెండింగ్ దరఖాస్తులను వెంటనే పూర్తి చేయాలి... నన్నుపర్తి గ్రామంలో మొత్తం 823 ఖాతాలు ఉండగా, డ్రాఫ్ట్ ROR పూర్తయి 107 రోజులు గడిచినా వచ్చిన 40 దరఖాస్తుల్లో 20 మాత్రమే పరిష్కరించడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మిగిలిన దరఖాస్తులను వెంటనే పరిశీలించి పూర్తి చేయాలని, తహసీల్దార్ లాగిన్‌లలో పెండింగ్‌లో ఉన్న అన్ని దరఖాస్తులను వేగంగా క్లియర్ చేయాలని ఆదేశించారు.

వృద్ధుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి....ఆస్తులు స్వాధీనం చేసుకున్న తర్వాత తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసే పిల్లల పట్ల అధికారులు ఎలాంటి సానుభూతి చూపాల్సిన అవసరం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇటువంటి కేసులను ఆర్‌డీఓల దృష్టికి తీసుకెళ్లి సీనియర్ సిటిజన్స్ చట్టం ప్రకారం విచారణ జరిపి, అవసరమైతే తల్లిదండ్రులకు నెలవారీ జీవన భృతి కల్పించడం లేదా వారు ఇచ్చిన ఆస్తుల రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసి తిరిగి వారి పేర్లపై నమోదు చేసే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తల్లిదండ్రులు, పిల్లల మధ్య వివాదాల్లో న్యాయం జరిగేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.

ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ శౌర్య మాన్ పటేల్, డి.ఆర్వో వై. సత్యనారాయణ రావు, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్లు కె. మనోరమ, అనిత, సుబ్బలక్ష్మి, జిల్లా పౌర సరఫరాల అధికారి మూర్తి, అనకాపల్లి ఆర్‌డీఓ షేక్ అయిషా, నర్సీపట్నం ఆర్‌డీఓ వి.వి. రమణ, ఏడీ సర్వే గోపాలరాజా, జిల్లాలోని అన్ని మండలాల రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ప్రధాన్‌ను దించినట్లే... ప్రభుత్వాన్ని మార్చేస్తాం

-అభిజీత్ దీప్కే హెచ్చరిక



ఛత్రపతి సంభాజీనగర్: జంతర్ మంతర్ ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థులపై ప్రభుత్వం వేధింపులను ఆపాలని, నిరసనకారులపై పెల్లెట్ తుపాకులు వాడేలా పోలీసులకు అనుమతి ఇచ్చిన వ్యక్తిపై చర్య తీసుకోవాలని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే డిమాండ్ చేశారు. ప్రభుత్వం దారికి రాకపోతే యువత ప్రభుత్వాన్నే మారుస్తుందన్నారు. నెల రోజులకు పైగా కొనసాగిన జాతీయ ఆందోళన తర్వాత ఆయన తన స్వస్థలమైన మహారాష్ట్రలోని ఛత్రపతి సంభాజీనగర్‌కు వచ్చారు. ఈ సందర్భంగా విమానాశ్రయంలో మీడియాతో మాట్లాడుతూ.. పోలీసులు విద్యార్థుల ఇళ్లకు వెళ్లి అరెస్టు చేస్తామని బెదిరిస్తున్నట్లు వెల్లడించారు. "విద్యార్థులు ఈ దేశ భవిత. వారు ఉగ్రవాదులు కారు. ఇదేవిధంగా వారిని ఇబ్బందిపెడుతూ ఉంటే ధర్మేంద్ర ప్రధాన్‌లాగే రేపు ప్రభుత్వాన్ని కూడా మార్చేస్తాం. ప్రధాని మోదీ తన పదవికి రాజీనామా చేసి, ఆయన ప్రావీణ్యానికి తగ్గట్టు ఇన్‌ఫ్లుయెన్సరుగా మారితే బాగుంటుంది. విద్యార్థుల ఆగ్రహం సద్దుమణగలేదు. అవసరమైతే ఇంకా పెద్ద ఆందోళనను మళ్లీ ప్రారంభిస్తాం" అన్నారు. దీప్కే సీజేపీ ప్రారంభించిన కొత్తలో "భాజపాలో చేరకపోతే నీ తల్లిదండ్రులకు ఇబ్బందులు తప్పవు" అనే వీడియో బెదిరింపును ఎదుర్కొన్నట్లు ఆయన తల్లి అనితా దీప్కే గుర్తుచేసుకున్నారు. ఈ కారణంగా తాము ఛత్రపతి సంభాజీనగర్‌ను విడిచిపెట్టి, కొంకణ్ ప్రాంతంలోని బంధువుల ఇంట్లో పక్షం రోజులు తల దాచుకున్నట్లు ఆమె వెల్లడించారు.

అనంతపురం ఎకాలజీ సెంటర్‌కు వాతావరణ మార్పుల నిర్వహణ అవార్డు



అనంతపురం: అనంతపురంలోని ఆక్షన్ ఫ్రాటెర్నా-ఎకాలజీ సెంటర్‌కు జాతీయ వాతావరణ మార్పుల నిర్వహణ అవార్డు దక్కింది. జిల్లాలోని దాదాపు 300 గ్రామాల్లో కార్బన్ రహితంగా, వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించేలా సుస్థిర వ్యవసాయాభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నందుకు ఐక్యరాజ్యసమితి గ్లోబల్ కాంపాక్ట్ నెట్‌వర్క్ ఇండియా, ఫెడరేషన్ ఆఫ్ కర్ణాటక ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ సంయుక్తంగా ఈ పురస్కారాన్ని ప్రదానం చేశాయి. బెంగళూరులో జరిగిన కార్యక్రమంలో దావణగెరె ఎంపీ ప్రభా మల్లికార్జున్ చేతుల మీదుగా ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ వై.వి.మల్లారెడ్డి ఈ అవార్డు అందుకున్నారు. ఐక్యరాజ్యసమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యాల (ఎస్‌డీజీ)కు అనుగుణంగా కార్యక్రమాలు అమలు చేసిన సంస్థలను గుర్తించి ఈ పురస్కారాలు ఇచ్చామని నిర్వాహకులు తెలిపారు.

లాన్సెట్‌లో పోలియో టీకాపై పరిశోధన వ్యాసం

-ఆంధ్ర, కర్నూలు వైద్య కళాశాలల వైద్యులను అభినందించిన మంత్రి



అమరావతి: పోలియో టీకాపై విశాఖలోని ఆంధ్ర వైద్య కళాశాల, కర్నూలులోని ప్రభుత్వ వైద్య కళాశాల నిర్వహించిన పరిశోధనకు అంతర్జాతీయ గుర్తింపు దక్కిందని వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం వెల్లడించింది. ఈ పరిశోధన 'ది లాన్సెట్ ఇన్‌ఫెక్షియస్ డిసీజెస్' జర్నల్‌లో ఈ ఏడాది మే 15న ప్రచురితమైందని ఒక ప్రకటనలో పేర్కొంది. దేశంలోని 9 ప్రముఖ వైద్య విద్యాసంస్థల బహుళ కేంద్రాల అధ్యయనంలో రాష్ట్రంలోని రెండు వైద్య కళాశాలలు భాగస్వాములయ్యాయని వెల్లడించింది. ఆ వివరాలివి.. రెండేళ్లపాటు నిర్వహించిన ఈ పరిశోధనలో తొలి దశలో 100 మంది..తర్వాత దశలో 643 మంది శిశువులపై అధ్యయనం చేశారు. విశాఖలోని ఆంధ్ర మెడికల్ కాలేజీ వైద్యులు చక్రవర్తి, కర్నూలు వైద్య కళాశాల డాక్టర్ విజయానంద్ ఆధ్వర్యంలో ఈ పరిశోధన సాగింది. ఈ పరిశోధనకు పుణెలోని సీరం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా సమన్వయ సంస్థగా వ్యవహరించింది. ఈ అధ్యయనంలో ప్రస్తుతం వినియోగిస్తున్న ఇనాక్టివేటెడ్ పోలియో వ్యాక్సిన్ (ఐపీవీ)తో పోలిస్తే.. కేవలం నాలుగో వంతు యాంటిజెన్ కలిగిన 'డోస్- స్ప్రేరింగ్ ఇనాక్టివేటెడ్ పోలియో వ్యాక్సిన్ (డీఎస్-ఐపీవీ)ను పరీక్షించారు. తక్కువ యాంటిజెన్‌తో తయారైన ఈ టీకా కూడా పూర్తి మోతాదు టీకాతో సమానమైన రోగనిరోధక శక్తిని ఇస్తుందని, మూడు రకాల పోలియో వైరస్‌లపై సమర్థంగా పనిచేస్తుందని పరిశోధనలో తేలింది. భద్రత పరంగా చూస్తే తీవ్ర దుష్ప్రభావాలు నమోదు కాలేదు. దీంతో తక్కువ మోతాదులోనే ఎక్కువ టీకా డోసులు తయారు చేయడం సాధ్యమై, ప్రపంచవ్యాప్తంగా టీకాల లభ్యత పెరగడంతో పాటు వ్యయం కూడా తగ్గే అవకాశం ఉందని పరిశోధకులు పేర్కొన్నారు. పరిశోధక వైద్యులు చక్రవర్తి, విజయానంద్‌ల బృందాన్ని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అభినందించారు.

వ్యాధుల నియంత్రణ వ్యూహం

-రెండోరోజు 'వన్ హెల్త్' కార్యశాలలో బృంద చర్చలు



అమరావతి: వ్యాధుల తీవ్రత, వాటి వ్యాప్తి, ప్రభావం ఆధారంగా భవిష్యత్తులో చర్యలు తీసుకునేందుకు వీలుగా నిర్దేశించిన ఐదు కీలక ప్రమాణాలపై నిపుణులు సుదీర్ఘంగా చరించారు. వన్ హెల్త్, జూనోటిక్ వ్యాధుల నిర్ధారణపై రాష్ట్ర సమగ్ర కార్యాచరణ రూపకల్పనకు విజయవాడలో నిర్వహిస్తున్న మూడు రోజుల కార్యశాలలో బృంద చర్చలు సాగాయి. వ్యాధి తీవ్రత, వ్యాధి వ్యాప్తి చెందే అవకాశం, నివారణ- నియంత్రణ సామర్థ్యం, సామాజిక- ఆర్థిక ప్రభావం, వన్ హెల్త్ సహకారం అనే అంశాలపై చర్చించారు. ఇప్పటి వరకు వైద్య ఆరోగ్య, పశుసంవర్ధక శాఖలు విడివిడిగా పనిచేశాయని, వన్‌హెల్త్ ద్వారా అన్ని అనుబంధ శాఖలు ఒకే ప్రణాళికతో ముందుకెళ్తాయని విజయవాడలోని పశు వ్యాధి నిర్ధారణ ప్రయోగశాల ఏడీ డాక్టర్ సుజన తెలిపారు. పశువుల్లో వచ్చే వ్యాధులను ముందే గుర్తిస్తే రైతుల ఆర్థిక స్థితిగతులు మెరుగుపడతాయన్నారు. రేబిస్, లెప్టోస్పైరోసిస్, బ్రూసెల్లోసిస్ లాంటి తీవ్రమైన వ్యాధులపై దృష్టి సారించాల్సి ఉందని చెప్పారు. జంతువులు, పక్షుల నుంచి వచ్చే సంక్రమిత వ్యాధుల నియంత్రణ, నివారణ చర్యలకు ఈ కార్యశాల దోహదపడుతుందని రంగరాయ వైద్యకళాశాల మైక్రోబయాలజీ ప్రొఫెసర్ డాక్టర్ డి.సత్యనారాయణమూర్తి తెలిపారు. నిపుణులంతా కలిసి ఏ వ్యాధికి ప్రాధాన్యం ఇవ్వాలో చర్చించి.. వ్యాక్సినేషన్, నివారణ చర్యల కోసం ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. ఎన్‌సీడీ ఏడీ డాక్టర్ జితేష్, ప్రజారోగ్య నిపుణుడు డాక్టర్ రవీందర్ పాల్ సింగ్, విజయవాడ ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాల మైక్రోబయాలజీ విభాగాధిపతి డాక్టర్ ప్రశాంతి, వైద్య ఆరోగ్య, పశుసంవర్ధక శాఖ నిపుణులు పాల్గొన్నారు.

సమన్వయంతో భోగాపురం ఎయిర్ పోర్టు ప్రారంభోత్సవ ఏర్పాట్లు





- ఏర్పాట్లను సమీక్షించిన మంత్రి నారా లోకేష్

భోగాపురం (విజయనగరం జిల్లా): ఉత్తరాంధ్రకే తలమానికంగా రూపుదిద్దుకున్న అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం (భోగాపురం)ను ఆగస్టు 1వతేదీన ప్రధాని నరేంద్ర మోదీజీ జాతికి అంకితం చేస్తున్న నేపథ్యంలో ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నభూతో నభవిష్యత్ అనే రీతిలో విజయవంతం చేయాలని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ ఉత్తరాంధ్ర ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. భోగాపురం విమానాశ్రయ ప్రారంభోత్సవ ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి లోకేష్, అనంతరం సమీక్ష నిర్వహించారు. ఉత్తరాంధ్రలోని విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, అనకాపల్లి, పార్వతీపురం మన్యం జిల్లాల నుంచి 3లక్షలమంది ఎయిర్ పోర్టు ప్రారంభోత్సవం, ప్రధాని మోదీజీ బహిరంగసభకు హాజరవుతారని, అందుకు తగ్గట్లుగా ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని సూచించారు. కూటమి నాయకులు సమన్వయంతో పనిచేసి ప్రధాని సభను విజయవంతం చేయాలని కోరారు. ప్రధాని మోదీజీకి ఘన స్వాగతం పలుకుతూ సుమారు 13వేలమందితో దేశంలోనే అతిపెద్ద ధింసా నృత్య ప్రదర్శనకు ఏర్పాట్లు చేయాలి. ఎయిర్ పోర్టు ప్రారంభోత్సవ సభకు హాజరయ్యే ప్రజలకోసం 36 అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి 5వేల బస్సులు రానున్నాయి. సభకు వచ్చేవారు బస్సు ఎక్కినప్పటినుంచి తిరిగి వెళ్లేవరకు ఎటువంటి లోటులేకుండా మండలస్థాయి లైజన్ ఆఫీసర్లు దగ్గరుండి చూసుకోవాలి. సభకు హాజరయ్యే వారందరికీ తాగునీరు, అల్పాహారం, భోజన సదుపాయం కల్పించాలి. ఎయిర్ పోర్టు ప్రారంభోత్సవ ఏర్పాట్ల కమిటీ ముఖ్య అధికారి ఎంటి కృష్ణబాబు మాట్లాడుతూ... ప్రధాని బహిరంగసభను వీక్షించేందుకు ప్రతి 5వేలమందికి ఒక ఎల్ఈడి స్క్రీన్ ఏర్పాటు చేస్తున్నాం, సీనియర్ ఐఎఎస్ అధికారులు, జాయింట్ కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. సమీక్షా సమావేశంలో మంత్రులు వంగలపూడి అనిత, అచ్చెన్నాయుడు, కొండపల్లి శ్రీనివాస్, టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్, టిడిపి జాతీయ ప్రధానకార్యదర్శి కిలారి రాజేష్, ఎపిఐఐసి చైర్మన్ మంతెన రామరాజు, ఎంపి చింతకాయల విజయ్, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, కార్యక్రమాల కమిటీ కోఆర్డినేటర్ సత్యనారాయణరాజు, ఎమ్మెల్యేలు అదితి గజపతిరాజు (విజయనగరం), కళా వెంకట్రావు (చీపురుపల్లి), కోండ్రు మురళీమోహన్ (రాజాం), లోకం నాగమాధవి (నెల్లిమర్ల), విఎంఆర్ డిఎ చైర్మన్ ప్రణవ్ గోపాల్, ఆర్ అండ్ బి ముఖ్య కార్యదర్శి ఎంటి కృష్ణబాబు, వైద్య,ఆరోగ్యశాఖ కార్యదర్శి జి.వీరపాండ్యన్, విజయనగరం కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి, పౌర సరఫరాల సంస్థ ఎండి ఢిల్లీరావు, మార్క్ ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ చైర్మన్ ఎంఎం నాయక్, ఎపి గిరిజన కార్పొరేషన్ ఎండి ఎస్ఎస్ శోభిక, విశాఖపట్నం రేంజి ఐజి గోపినాథ్ జెట్టి, రవాణాశాఖ కమిషనర్ మనీష్ కుమార్ సిన్హా, విజయనగరం ఎస్పీ దామోదర్, ఎపి ట్రైబల్ వెల్ఫేర్ డైరక్టర్ భార్గవి,ప్రోటోకాల్ (జిఎడి) డైరక్టర్ మోహన్ రావు, విజయనగరం జాయింట్ కలెక్టర్ సేధు మాధవన్, విజయనగరం డిసిసిబి చైర్మన్ కిమిడి నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

గిరి రైతులకు పథకాలు అందాలి



పాడేరు: జిల్లాలో గిరిజన రైతుల ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని జిల్లా కలెక్టర్ టి.నిషాంతి ఆదేశించారు. వ్యవసాయానుబంధ రంగాలకు చెందిన అధికారులతో కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రధానంగా గిరి రైతులు పంటలకు బీమా సదుపాయాన్ని కల్పించే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ప్రభుత్వ పథకాలన్నీ అర్హులైన రైతులకు అందించాలన్నారు. అర్హత కలిగిన ఒక్క రైతుకు అన్యాయం జరగకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని, అవకాశం ఉన్న మేరకు రైతులకు మేలు చేసేందుకు అధికారులు కృషిచేయాలన్నారు. తాజా వాతావరణ పరిస్థితులపై రైతులకు అవగాహన కల్పించి, వారికి అనుకూలంగా ఉండే పంటల సాగుపై దృష్టిసారించేలా సూచనలు, సలహాలు అందించాలన్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లోని పంటల స్థితిగతులు, ఎరువుల లభ్యత, తదితర అంశాలపై కలెక్టర్ నిషాంతి ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టి.శ్రీపూజ, జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బీఎస్.నందు, జిల్లా ఉద్యానవనాధికారి కె.బాలకర్ణ, ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎల్.భాస్కరరావు, జిల్లా పట్టుపరిశ్రమ అధికారి అప్పారావు, మైక్రో ఇరిగేషన్ పీడీ రహీమ్, కాఫీ బోర్డు ఎస్ఎల్‌వో రమేశ్, స్పైసెస్ బోర్డు ఫీల్డ్ అధికారి బి.కల్యాణి, తదితర అధికారులు పాల్గొన్నారు.

మన్యంలో స్పైసెస్ బోర్డు సభ్యుడి పర్యటన



పాడేరు: కేంద్ర సుగంధ ద్రవ్యాల సంస్థ సభ్యుడు కేవీ.సుబ్బారావు ఏజెన్సీలో పర్యటించారు. ఇక్కడికి వచ్చిన ఆయన తొలుత జిల్లా కలెక్టర్ టి.నిషాంతిని కలిశారు. అనంతరం ఆయన స్పైసెస్ బోర్డు అధికారులతో కలిసి పాడేరు, హుకుంపేట, డుంబ్రిగుడ, అరకులోయ మండలాల్లోని పలు గ్రామాల్లో కాఫీ తోటలు, మిరియాల పాదులను ఆయన పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో గిరిజన రైతులతో ఆయన మాట్లాడారు. పంట దిగుబడులు కాఫీ బోర్డు, స్పైసెస్ బోర్డు ద్వారా రైతులకు అందుతున్న పరికరాలు, రాయితీలు, ఇతర సౌకర్యాలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో స్పైసెస్ బోర్డు సీనియర్ ఫీల్డ్ ఆఫీసర్ బి.కల్యాణి, కాఫీ బోర్డు ఎస్-ఎల్‌వో రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి తల్లిదండ్రుల భాగస్వామ్యం అవసరం

- మెగా పీటీఎంలో జిల్లా కలెక్టర్ టి.నిషాంతి - జిల్లా కేంద్రంలో ఘనంగా మెగా పీటీఎం 4.0 వేడుకలు



పాడేరు: విద్యాభివృద్ధికి విద్యార్థుల తల్లిదండ్రుల భాగస్వామ్యం అవసరమని జిల్లా కలెక్టర్ టి.నిషాంతి అన్నారు. స్థానిక తలారిసింగి గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి మెగా పీటీఎం 4.0 కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా మాట్లాడారు. పాఠశాల అభివృద్ధి, విద్యాప్రగతి కేవలం ఉపాధ్యాయుల బాధ్యత మాత్రమే కాదని, తల్లిదండ్రులు సైతం భాగస్వామ్యం ముఖ్యమన్నారు. తల్లిదండ్రులు పాఠశాలలకు వెళ్లడం, ఉపాధ్యాయుల బోధన, విద్యార్థుల అభ్యాసన, అక్కడ వసతులు, తదితర అంశాలపై సైతం అవగాహన ఏర్పరచుకోవాలన్నారు. విద్యార్థులను ప్రతి రోజూ పాఠశాలకు పంపడం, ఉపాధ్యాయులు, పాఠశాల నిర్వహణ కమిటీకి సహకరించడం వంటి చర్యలు చేపట్టాలన్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమన్వయంలో విద్యాభివృద్ధికి కృషి చేసి విద్యార్థుల భవిష్యత్‌ను చక్కగా తీర్చిదిద్దాలన్నారు. ఈ సందర్భంగా ఆశ్రమ పాఠశాలలోని పలువురు తల్లిదండ్రులతో కలెక్టర్ మాట్లాడి, తమ పిల్లల చదువులు, కల్పిస్తున్న సదుపాయాలపై అడిగి తెలుసుకున్నారు. ఆశ్రమ పాఠశాల ప్రాంగణంలో రూపొందించిన వివిధ రకాల యూనిట్‌లను ఆమె పరిశీలించారు. మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, రాష్ట్ర జానపద కళలు, సృజనాత్మకత అకాడమీ చైర్మన్ వంపూరు గంగులయ్య, జీసీసీ డైరెక్టర్ బొర్రా నాగరాజు, ట్రైకార్ డైరెక్టర్ కూడ కృష్ణారావు, తదితరులు పీటీఎంను మాట్లాడారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఈవో, టీడబ్ల్యూ డీడీ పరిమిళ, సమగ్ర శిక్ష ఏపీసీ వీఏ.స్వామినాయుడు, పాఠశాల హెచ్ఎం టి.నాగేశ్వరరావు, మాజీఎంపీపీ బొర్రా విజయరాణి, ఎస్ఎంసీ చైర్మన్ పి.నాగేశ్వరరావు, ఎంఈవోలు బి.విశ్వసాధం, సీహెచ్.సరస్వతి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆర్టీసీకి ప్రయాణికులు కార్మికులు రెండు కళ్ళలాంటి వారు





- ఆర్టీసీ డ్రైవర్ల సేవలు అభినందనీయం - మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

గాజువాక: రాష్ట్రంలో రవాణా రంగాన్ని ఆధునికీకరించి, పర్యావరణహిత ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేయడానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. విశాఖ స్టీల్ సిటీ డిపోలో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి 20 పి.ఎం.ఇ- ఈ-బస్సుల సేవలను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా విద్యుత్ బస్సులను అందుబాటులోకి తీసుకువస్తూ రాష్ట్రంలో ఆధునిక, కాలుష్యరహిత ప్రజా రవాణా వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నామని మంత్రి తెలిపారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి ప్రత్యేకంగా 20 ఈ-బస్సులను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా ప్రయాణికులకు సౌకర్యవంతమైన, వేగవంతమైన సేవలు అందనున్నాయని చెప్పారు. ఆర్టీసీకి ప్రయాణికులు, కార్మికులు రెండు కళ్లు లాంటివారని మంత్రి పేర్కొన్నారు. ఆర్టీసీని గాడిలో పెట్టింది కూటమి ప్రభుత్వమేనని, గత ప్రభుత్వం ఒక్క కొత్త బస్సును కూడా కొనుగోలు చేయలేదని విమర్శించారు. కార్మికులకు నైట్ అవుట్ అలవెన్సులు చెల్లించి వారి సంక్షేమానికి ప్రాధాన్యం ఇచ్చిందీ కూటమి ప్రభుత్వమేనని అన్నారు. కార్మికుల ఐక్యతకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రతిపక్షాలు సృష్టించే అపోహలను నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సున్నా ప్రమాదాలే లక్ష్యంకావాలని ఆర్టీసీ డ్రైవర్లకు మంత్రి పిలుపునిచ్చారు. ప్రయాణికుల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం ఇస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. ఆక్సిడెంట్ ఫ్రీ సర్వీస్‌లో భాగంగా విశాఖ స్టీల్ సిటీ డిపోకు చెందిన 17 మంది ఆర్టీసీ డ్రైవర్లకు ప్రశంస పత్రాలు అందజేసి సత్కరించారు. క్రమశిక్షణ, అప్రమత్తతతో ప్రమాదరహిత సేవలు అందిస్తూ ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడం అభినందనీయమని మంత్రి కొనియాడారు. ఇదే సేవా స్ఫూర్తితో కొనసాగుతూ రాష్ట్రంలో రోడ్డు భద్రతకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.

ఫార్మా కార్మికులకు వేతనాలు పెంపుకై జూలై 30న కలెక్టరేట్ ధర్నాకు తరలి రండి

- ఫార్మాసిటీ స్టాప్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు గని శెట్టి పిలుపు



పరవాడ: ఫార్మా కంపెనీలో కార్మికులు ప్రమాదకర పరిస్థితుల్లో పనిచేస్తున్నారని కార్మిక చట్టాలు అమలు కావడంలేదని 15 ఏళ్లగా ప్రభుత్వాల అండతో యాజమాన్యాలు కార్మికుల శ్రమనుదోచుకుంటున్నాయని, 2011లో ఫార్మపరిశ్రమల్లో వేతనాలు సవరణ చేసి ఆ తర్వాత 2016,20 21,2026 లో అంటే మూడుసార్లుగా 15 సంవత్సరాలైనా వేతనాల పెంపు జీవో ఇవ్వలేదు. ఈనెల 30న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద వేతనాల పెంపకై ధర్నా నిర్వహిస్తున్నట్లు ఈ ధర్నాలో కార్మికుల పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఫార్మాసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు గని శెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. శనివారం ఫార్మసిటీలో కలెక్టర్ కార్యాలయం వద్ద ఈనెల 30 జరిగే ధర్నా పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గని శెట్టి మాట్లాడుతూ గత 15 సంవత్సరాలలో కాంగ్రెస్, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ, కుటమి ప్రభుత్వాలు వేతనాలు పెంచకుండా కార్మికులందరికీ నష్టం చేశారు. మూడుసార్లు వేతనాలు పెంచి ఉంటే ఇప్పుడు వచ్చే వేతనాలు కంటే సుమారు పదివేల రూపాయలు ఎక్కువ వచ్చి ఉండేవి. అలాచేయనందున కార్మికులప్రతినెలావేలాదిరూపాయలునష్టపోతున్నారు. ప్రభుత్వ విధానాల వలన విద్య, వైద్యం ,గ్యాస్, పెట్రోల్ ,కరెంట్ చార్జీలు ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయన్నారు. జీతాలు మాత్రం పాతాళానికి తొక్క వేయబడుతున్నాయన్నారు వెంటనే వేతనాలు పెంపుదాలకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.కార్మికుల వేతనాలు పెంచాలని ఈనెల 30న ధర్నా జరుగుతుందని ఈ ధర్నాలో పెద్ద ఎత్తున కార్మికుల పాల్గొని జయప్రదం చేయాలని గనిశెట్టి పిలుపునిచ్చారు. ఈ పోస్టర్ ఆవిష్కరణలో రమేష్, దేవరాజ్, ఈశ్వరరావు, దేవకిషోర్, కృష్ణ, లక్ష్మణ్, రాము, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

దమ్ముంటే పార్లమెంటులో మాట్లాడండి.. రాహుల్ గాంధీకి పీవీఎన్ మాధవ్ సవాల్



విశాఖపట్నం: యువత భవిష్యత్ పరమావధిగా ప్రధాని మోదీ పని చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. మీడియాతో మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూ లేని విధంగా విద్యలో అనేక సంస్కరణలను ప్రధాని తీసుకువచ్చారని తెలిపారు. ఐ.ఐ.టి., ఐ.ఐ.ఎం., గిరిజన విశ్వవిద్యాలయాలు ఏర్పాటు చేశారని చెప్పారు. దేశంలో మెడికల్ సీట్లు పెంచారన్నారు. గత ప్రభుత్వంతో పోల్చితే.. ఈ ప్రభుత్వంలో లీకులు చాలా తక్కువ జరిగాయని చెప్పుకొచ్చారు. నీట్‌లో లీకులు తెలిసిన వెంటనే చర్యలు తీసుకున్నారని మాధవ్ అన్నారు. నీట్ పేరుతో రెచ్చగొట్టే కార్యక్రమాలు చేయాలని ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. మత విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా ఢిల్లీలో ఆందోళనలు చేస్తున్నారని మండిపడ్డారు. నీట్ సాకు చూపి.. ప్రధాని, సుప్రీంకోర్టుపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. ప్రకాశ్ రాజ్ సహా కొందరు విద్రోహంగా, దేశ వ్యతిరేక మాటలు మాట్లాడారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేసేందుకే ఈ విద్యా సంఘాలు ఉన్నాయని విమర్శలు గుప్పించారు. రాహుల్ గాంధీకి దమ్ముంటే కాంగ్రెస్ ప్రభుత్వంలో జరిగిన పేపర్ లీక్‌పై పార్లమెంట్‌లో మాట్లాడాలని సవాల్ విసిరారు. రాహుల్ గాంధీకి ధైర్యం లేక చర్చల్లో మాట్లాడడం లేదన్నారు. ఆగస్టు 1న ప్రధాని మోదీ భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవానికి వస్తున్నారని మాధవ్ చెప్పారు. ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవ కార్యక్రమంలో13 వేల మందితో ధింసా నృత్యం, బొబ్బిలి వీణ నాదంతో ప్రధానికి ఘన స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. మూడు లక్షల మందితో బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభమైన తరువాత ఉత్తరాంధ్రలో వెనకబడిన మండలం ఉండకూడదని సీఎం చంద్రబాబు ఆలోచనగా చెప్పుకొచ్చారు. ఉత్తరాంధ్రను మరింత అభివృద్ధి చేసేందుకు.. భోగాపురం విమాశ్రయం తీసుకొచ్చారని తెలిపారు. అల్లూరి పేరును చిరస్థాయిగా నిలిచిపోవడానికి ఆయన పేరు విమానాశ్రయానికి పెట్టినట్లు చెప్పారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి అనేక ప్రత్యేకతలు ఉన్నాయని పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు.

ఘనంగా 87వ వార్డులో మెగా పేరెంట్స్ మీట్టింగ్

- ముఖ్య అతిథులుగా మాజీ టిడిపి రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్నాథం జగన్



గాజువాక: గాజువాక నియోజకవర్గం 87వ వార్డు పరిధిలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ 4.0 ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ టిడిపి రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్నాథం జగన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ వార్డ్ పరిధిలో కణితి, వడ్లపూడి, దుర్గపువాని పాలెం, ఈర్లవానిపాలెం, అప్పికొండ మండల పరిషత్ పాఠశాల మరియు కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారాని. తల్లిదండ్రులు తమ పిల్లల యొక్క పురోగతి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవడం జరిగింది. ఉపాధ్యాయులు పాఠశాల అభివృద్ధి, మధ్యాహ్న భోజన పథకం, తల్లికి వందనం పడకలకోసం వివారించడం జరిగింది. అనంతరం తల్లిదండ్రులకు ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు విజయరామరాజు, సెక్రెటరీ బొట్టా ప్రకాష్, బిజెపి జిల్లా నాయకులు లక్కరాజు సోమరాజు, జనసేన నాయకులు కర్రీ నరసింగరావు, బెల్లంకొండ రాజన్ రాజు, ప్రగడ దానయ్య ,పావడ రమణమూర్తి,కణితి ఈశ్వరరావు ద్రోణద్రి అప్పలనాయుడు ,వై భాస్కరరావు, మల్లా రాము,కనకసత్యం,భాగ్య లక్ష్మి,జాన్ రమేష్,కళ్యాణ్ చక్రవర్తి, సుందర్ సునీల్,దాలయ్య, మూర్తి, దశరద తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్ అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

-అర్జీల పరిష్కారం నిర్లక్ష్యం చేయకుండా, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి -ప్రజా సమస్యల పరిష్కారానికే తొలి ప్రాధాన్యత - పీజీఆర్ఎస్ కు 158 అర్జీలు, రెవెన్యూ క్లినిక్ కు 191 వినతులు మొత్తం 349 అర్జీలు -జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి: పీజీఆర్ఎస్ అర్జీలను నిర్లక్ష్యం చేయకుండా, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్ పిజిఆర్ఎస్ మందిరంలో ప్రజా పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తో పాటు , జాయింట్ కలెక్టర్ శౌర్య మాన్ పటేల్ డిఆర్ఓ వై సత్యనారాయణరావు లు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన దరఖాస్తుదారుల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహించరాదన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతి అర్జీని బాధ్యతగా తీసుకుని నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. ముఖ్యంగా రెవిన్యూ, గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్, ఏడి సర్వే, ఇరిగేషన్, జీవీఎంసీ, ఏడి అగ్రికల్చర్, మైనింగ్, ట్రైబల్ వెల్ఫేర్, లేబర్ ఆఫీస్, ఫిషరీస్, ఏపీఎస్ ఆర్టీసీ, డ్వామ, తాగునీరు తదితర శాఖలకు సంబంధించిన ఫిర్యాదులను ఆలస్యం చేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పీజీఆర్ఎస్‌లో నమోదైన అర్జీలను కేవలం సమస్యలను పరిష్కరించడమే ముఖ్యం కాదని, ఫిర్యాదుదారుడు సంతృప్తి చెందేలా క్షేత్రస్థాయిలో విచారణ జరిపి శాశ్వత పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. పీజీఆర్ఎస్ పోర్టల్‌లో నమోదైన ఫిర్యాదులు ఎట్టి పరిస్థితుల్లోనూ పెండింగ్‌లో ఉండకూడదని, గడువు ముగియక ముందే సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. వివిధ శాఖలలో నిర్వహిస్తున్న పిజిఆర్ఎస్ అమలు పనితీరుని




శాఖల వారిగా జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ-ఆఫీస్ తప్పనిసరిగా అమలు చేయాలని, సిబ్బంది అందరికి లాగిన్ ఉండాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. వాట్సాప్ గవర్నన్స్ పై ప్రతీ ఒక్కరికీ అవగాహన ఉండాలన్నారు. ఫిర్యాదులను తిరస్కరించాల్సి వస్తే, దానికి సరైన కారణాలను తెలియజేస్తూ ఫిర్యాదుదారునికి లిఖితపూర్వక సమాచారం ఇవ్వాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా శాఖల మధ్య సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. పెండింగ్ అర్జీలు అధికంగా ఉన్న శాఖల అధికారులకు ప్రత్యేక సూచనలు జారీ చేస్తూ, సమస్యల పరిష్కారంలో అలసత్వం ప్రదర్శిస్తే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు ప్రజల నుంచి వివిధ సమస్యలపై 158 అర్జీలు అందాయి. అదేవిధంగా రెవెన్యూ క్లినిక్ కు 191 వినతులు, మొత్తం 349 అందాయి. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఉత్తరాంధ్ర గేట్‌వేగా భోగాపురం విమానాశ్రయం

-ఆగస్టు 1న ప్రారంభం నాటికి కనెక్టివిటీ రోడ్లను పూర్తి చేసేందుకు చర్యలు -ప్రజాప్రతినిధులు, అధికారులు సమష్టిగా పనిచేసి పది రోజుల పాటు వేడుకలు నిర్వహిద్దాం

విశాఖపట్నం: ఆగస్టు 1న ప్రారంభం కానున్న అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయంతో ఉత్తరాంధ్ర అభివృద్ధికి కొత్త దశ ప్రారంభం కానుందని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్తి కిశోర్ పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో విమానాశ్రయ ప్రారంభోత్సవం, రహదారి అనుసంధానం, ప్రజా రవాణా ఏర్పాట్లపై ఆయన వివరించారు. ఉత్తరాంధ్ర గేట్‌వేగా నిలవనున్న భోగాపురం విమానాశ్రయం ప్రారంభాన్ని పురస్కరించుకుని ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు సమష్టిగా పనిచేసి పది రోజుల పాటు ఉత్సవ వాతావరణంలో కార్యక్రమాలు నిర్వహిద్దామని కలెక్టర్ పిలుపునిచ్చారు. విమానాశ్రయం ద్వారా పర్యాటకం, పరిశ్రమలు, వాణిజ్యం, ఉపాధి అవకాశాలు మరింతగా పెరిగే అంశాలను ప్రజలకు వివరించేలా విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు. స్వర్ణ వార్డు, స్వర్ణ గ్రామం తదితర ప్రాంతాల్లో ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. విశాఖపట్నం నుంచి భోగాపురం విమానాశ్రయానికి అనుసంధానంగా 28 ప్రధాన రహదారులు, సుమారు 238 కిలోమీటర్ల రోడ్లు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ ఈ క్రమంలో తెలిపారు. ప్రతి రహదారిలో ప్రయాణికులకు స్పష్టమైన మార్గదర్శకాలు అందేలా విస్తృతంగా సైనేజీలు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. బ్రౌన్‌ఫీల్డ్, గ్రీన్‌ఫీల్డ్ రహదారులను డిసెంబరు నాటికి అందుబాటులోకి తీసుకురావడానికి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. మాస్టర్ ప్లాన్ రహదారులతో పాటు ఇప్పటికే ఉన్న రోడ్లను అనుసంధానం చేయాలని, మాస్టర్ ప్లాన్ రోడ్లను జాతీయ రహదారికి అనుసంధానించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఏడు ప్రాధాన్య రహదారుల్లో నాలుగు పూర్తయ్యాయని, అడవివరం – శాంత్యాం రహదారికి అటవీ అనుమతులు లభించాయని తెలిపారు. మిగిలిన రెండు రహదారుల పనులను కూడా వేగంగా పూర్తి చేసేందుకు ప్రణాళిక సిద్ధంగా ఉందన్నారు. జుత్తాడ రహదారి పనులు కూడా ప్రారంభమవుతాయని చెప్పారు. మారికవలస జంక్షన్ విస్తరణ, వేపగుంట–జుత్తాడ రహదారి అభివృద్ధిపై దృష్టి సారించనున్నట్లు తెలిపారు. కోస్టల్ కారిడార్ అభివృద్ధికి అవసరమైన అనుమతులు పూర్తిస్థాయిలో లభించిన వెంటనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. జోడుగుళ్లపాలెం నుంచి రుషికొండ మీదుగా భోగాపురం విమానాశ్రయం వరకు అనుసంధానంపై చర్యలు చేపడుతున్నామని చెప్పారు. అందుబాటులో ఉన్న ప్రత్యామ్నాయ రహదారులను ప్రయాణికులు వినియోగించుకునేలా కీలక ప్రాంతాల్లో సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. పీక్



అవర్స్‌లో విశాఖ నగరం నుంచి విమానాశ్రయానికి చేరుకునేందుకు పట్టే సమయంపై ఇప్పటికే అధ్యయనం చేశామని తెలిపారు. జంక్షన్ల వద్ద ఫ్రీ లెఫ్ట్ విధానాన్ని వాహనదారులు పాటిస్తే ట్రాఫిక్ సమస్యలు గణనీయంగా తగ్గుతాయని పేర్కొన్నారు. విమానాశ్రయానికి ప్రత్యేక ప్రజా రవాణా సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు చేపట్టామని కలెక్టర్ తెలిపారు. మొత్తం 100 బస్సుల్లో 20 బస్సులను ప్రత్యేకంగా కేటాయించగా, ఇప్పటికే తొమ్మిది బస్సులు అందుబాటులోకి వచ్చాయని చెప్పారు. గాజువాక నుంచి జాతీయ రహదారి మీదుగా విమానాశ్రయానికి తొలి సర్వీసులు నడిపేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని, బీచ్‌రోడ్ మార్గంలోనూ ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. విమానాల రాకపోకల సమయాలకు అనుగుణంగా బస్సు సర్వీసులు నడిచేలా చర్యలు తీసుకున్నామని, అవసరమైన ఛార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశామని చెప్పారు. విశాఖ నగర పరిధిలో తొమ్మిది ప్రాంతాల్లో ప్రయాణికులు వేచి ఉండేందుకు ప్రత్యేక లాంజ్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు.

కూడళ్ల విస్తరణ, ఫ్రీ లెఫ్ట్ ల వద్ద ప్రత్యేక చర్యలు.... అనంతరం వివిధ కూడళ్లు, ఫ్రీ లెఫ్ట్, సిగ్నల్ పాయింట్స్ వద్ద తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించిన జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్ పలు అంశాలపై సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. ప్రజలు కూడా ఫ్రీ లెఫ్ట్ విధానాన్ని అనుసరించాలని జిల్లా కలెక్టర్ చెప్పారు. వీటన్నింటిపై ఎమ్మెల్యేలు సూచనలు చేశారు. ప్రయాణికులు ఎయిర్‌పోర్ట్ కు సులభంగా చేరుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, వీఎంఆర్డీఏ కమిషనర్ తేజ్ భరత్, ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణ బాబు, విష్ణుకుమార్ రాజు, వంశీకృష్ణ శ్రీనివాస్, వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, డీసీసీబీ ఛైర్మన్ కోన తాతారావు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ వి. సతీష్ కుమార్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

"హరిత విశాఖ - 50 పార్కుల మిషన్"కు శ్రీకారం

-జీవీఎంసీ పరిధిలో 50 ఆధునిక పార్కుల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ -ఇప్పటికే 47 ఓపెన్ స్పేస్‌ల గుర్తింపు... తొలి దశలో రూ.21.97 కోట్లతో 47 పార్కుల అభివృద్ధి -ప్రజల ఆరోగ్యం, ఆహ్లాదం, పిల్లల ఆటవిడుపుకు అన్ని ఆధునిక మౌలిక సదుపాయాలతో హరిత పార్కుల ఏర్పాటు - జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

విశాఖపట్నం: శరవేగంగా అభివృద్ధి చెందుతున్న విశాఖ నగరాన్ని మరింత హరితమయం చేసి, ప్రజలకు ఆరోగ్యవంతమైన, ఆహ్లాదకరమైన జీవన వాతావరణాన్ని కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ఆదేశాల మేరకు జీవీఎంసీ పరిధిలో 50 ఆధునిక పార్కుల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టినట్లు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, నగరంలోని గుర్తించిన ఓపెన్ స్పేస్‌లలో ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడంతో పాటు ఆరోగ్య పరిరక్షణకు ఉదయం, సాయంత్రం వాకింగ్, యోగా, వ్యాయామం నిర్వహించేందుకు, చిన్నారుల ఆటలు, కుటుంబ సభ్యుల విహారం, సీనియర్ సిటిజన్ల విశ్రాంతి, పర్యావరణ పరిరక్షణకు అనువుగా అన్ని ఆధునిక మౌలిక సదుపాయాలతో హరిత పార్కులను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. జీవీఎంసీ పరిధిలో మొత్తం 50 పార్కులను అభివృద్ధి చేయాలని లక్ష్యంగా నిర్ణయించగా, తొలి దశలో ఇప్పటికే 47 ఓపెన్ స్పేస్‌లను గుర్తించడం జరిగిందని కమిషనర్ తెలిపారు. మిగిలిన పార్కులకు అవసరమైన అనువైన స్థలాలను కూడా గుర్తించి దశలవారీగా అభివృద్ధి చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో భీమునిపట్నం జోన్‌లో 7 పార్కులు, మధురవాడ జోన్‌లో 20 పార్కులు, గాజువాక జోన్‌లో 20 పార్కులు, మొత్తం 47 పార్కులను రూ.21.97 కోట్ల (రూ.2,196.75 లక్షలు) అంచనా వ్యయంతో జీవీఎంసీ నిధుల ద్వారా అభివృద్ధి చేయనున్నట్లు కమిషనర్ వెల్లడించారు. ఈ పార్కుల్లో అత్యాధునిక వాకింగ్ ట్రాక్‌లు, చిన్నారుల ఆట పరికరాలు, ఓపెన్ జిమ్‌లు, సీనియర్ సిటిజన్లకు ప్రత్యేక విశ్రాంతి వేదికలు, పచ్చిక బయళ్లు,




సుందరమైన ల్యాండ్‌స్కేపింగ్, అలంకార మొక్కలు, తాగునీటి సౌకర్యం, విద్యుత్ దీపాలు, బెంచీలు తదితర ఆధునిక సౌకర్యాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. హరిత పార్కుల అభివృద్ధి ద్వారా నగరంలో పచ్చదనం పెరగడంతో పాటు పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ, వర్షపు నీటి సంరక్షణ, ప్రజల శారీరక, మానసిక ఆరోగ్య పరిరక్షణకు విశేషంగా దోహదపడుతుందని, చిన్నారులకు సురక్షితమైన ఆట స్థలాలు, కుటుంబాలకు ఆహ్లాదకరమైన విహార కేంద్రాలు అందుబాటులోకి వస్తాయని కమిషనర్ పేర్కొన్నారు. "గ్రీన్ – హెల్తీ – లైవబుల్ విశాఖ" లక్ష్య సాధనలో భాగంగా జీవీఎంసీ చేపడుతున్న 50 పార్కుల అభివృద్ధి కార్యక్రమం నగర పర్యావరణ పరిరక్షణకు, ప్రజల జీవన నాణ్యతను మెరుగుపరచడానికి ఒక కీలక మైలురాయిగా నిలుస్తుందని కమిషనర్ తెలిపారు. నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా పార్కుల అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసి, ప్రజలకు త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత ఇంజినీరింగ్, హార్టికల్చర్, టౌన్ ప్లానింగ్ శాఖ అధికారులను ఆయన ఆదేశించారు.

జగన్నాథ స్వామి వారికి వైభవంగా పట్టువస్త్రాల సమర్పణ

-భక్తిశ్రద్ధలతో సమర్పించిన ఆలయ ఈవో జల్లేపల్లి వెంకట్రావు దంపతులు

సింహాచలం: సింహాచల నాథుని తరఫున, టర్నివర్ సత్రంలో పూజలందుకుంటున్న జగన్నాథ స్వామి వారికి సింహాచలం దేవస్థానం నుండి పట్టువస్త్రాలను సమర్పించారు. సింహాచలం దేవస్థానం ఆలయ ఈవో శ్రీ జల్లేపల్లి వెంకట్రావు దంపతులు స్వామి వారి పట్టువస్త్రాలు, మంగళకరమైన పుష్పాలు, ఫలాలను భక్తిశ్రద్ధలతోసమర్పించారు. దేవస్థానం ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు, ఆధ్వర్యంలో, వేద పండితుల మంత్రోచ్ఛారణలు, నాదస్వర మంగళ ధ్వనుల నడుమ ఈ పట్టువస్త్రాలు సింహాచలం నుండి అత్యంత వైభవంగా బయలుదేరింది. సహాయ కార్య నిర్వహణాధికారి కె. తిరుమలేశ్వరరావు, పర్యవేక్షణ అధికారి కె. వెంకటేశ్వరావుల పర్యవేక్షణలో, టర్నివర్ సత్రానికి చేరుకుంది. అక్కడ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ శ్రీమతి డి. అన్నపూర్ణ చేతుల మీదుగా



జగన్నాథ స్వామి వారికి ఈ పట్టువస్త్రాలను, పల పుష్పాలను అత్యంత భక్తి ప్రపత్తులతో సమర్పించారు.

'షైనింగ్ స్టార్స్' తొలి విజయం.. విజయాల పరంపరకు నాంది కావాలి

-విద్యార్థులు హార్డ్‌వర్క్‌తో పాటు స్మార్ట్‌వర్క్‌పైనా దృష్టి సారించాలి -విశాఖపట్టణం జిల్లా విద్యార్థులు దేశానికి రోల్‌మోడల్‌గా నిలవాలి -షైనింగ్ స్టార్స్ అవార్డుల ప్రదానోత్సవంలో జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్తి కిశోర్ -పదో తరగతి వారికి 88, ఇంటర్ వారికి 46 అవార్డులు అందజేసిన కలెక్టర్, ఎమ్మెల్యేలు

విశాఖపట్నంః విద్యార్థుల జీవితంలో 'షైనింగ్ స్టార్స్' అవార్డు తొలి విజయమని, ఇక్కడితో ఆగిపోకుండా విజయాల పరంపరను కొనసాగించాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్తి కిశోర్ ఆకాంక్షించారు. వీఎంఆర్డీఏ చిల్డ్రన్ ఏరీనాలో నిర్వహించిన షైనింగ్ స్టార్స్ అవార్డుల ప్రదానోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆయనతో పాటు ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, విష్ణుకుమార్ రాజు, వీఎంఆర్డీఏ ఛైర్మన్ ప్రణవ్ గోపాల్ భాగస్వామ్యమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వారంలో తొలి రోజునే ఒక మంచి కార్యక్రమంతో రోజు ప్రారంభం కావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. తన పాఠశాల రోజుల్లో తాను కూడా అప్పటి జిల్లా కలెక్టర్ ఎస్.ఎస్. రావత్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నానని, ఈ కార్యక్రమం తన పాఠశాల రోజుల జ్ఞాపకాలను గుర్తు చేసిందని పేర్కొన్నారు. తాను కూడా పదో తరగతిలో పాఠశాల టాపర్‌గా నిలిచానని, విద్యార్థులు లక్ష్యంపై దృష్టి పెట్టి కష్టపడి పనిచేస్తే విజయాలు సాధించవచ్చని అన్నారు. హార్డ్‌వర్క్‌తో పాటు స్మార్ట్‌వర్క్ కూడా అవసరమని, విద్యార్థులు ఇకపై స్మార్ట్‌వర్క్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. వృత్తి ఏదైనా, రంగం ఏదైనా లక్ష్యాన్ని నిర్దేశించుకుని క్రమశిక్షణతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని, లీప్ (లెర్నింగ్ ఎక్సెలెన్స్ ఇన్ ఏపీ) కార్యక్రమం గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని కలెక్టర్ అన్నారు. జిల్లాలోని 594 పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరుతో పాటు విద్యా



ఫలితాల సాధనను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. చదువుతో పాటు క్రీడలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతి విద్యార్థి కనీసం ఒక క్రీడలో ప్రత్యేక శిక్షణ పొందాలని సూచించారు. తల్లిదండ్రులను గౌరవించి, వారి మార్గదర్శకత్వాన్ని జీవితంలో సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. విశాఖ జిల్లాకు ప్రత్యేకమైన బ్రాండ్ ఉందని, విద్యార్థులకు పుష్కలమైన అవకాశాలు, వనరులు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. విశాఖ విద్యార్థులు దేశవ్యాప్తంగా అందరికీ రోల్‌మోడల్‌గా నిలిచేలా ప్రత్యేకమైన గుర్తింపును సాధించాలని ఆకాంక్షించారు. 134 మంది విద్యార్థులకు అవార్డులు, రూ.26.80 లక్షల కేటాయింపు.... జిల్లాలోని 11 మండలాల పరిధిలో మార్చి–2026లో పదో తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 134 మంది విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ అవార్డులను ప్రదానం చేశారు. ఒక్కో విద్యార్థికి రూ.20 వేల చొప్పున మొత్తం రూ.26.80 లక్షలను ప్రభుత్వం కేటాయించింది. పదో తరగతి విద్యార్థులు 88 మందికి రూ.17.60 లక్షలు, ఇంటర్మీడియట్ విద్యార్థులు 46 మందికి రూ.9.20 లక్షలు అందజేశారు.

జివిఎంసి "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" లో 85 వినతులు

-జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

విశాఖపట్నం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమంలో జీవీఎంసీ లో అన్ని విభాగాలకు కలిపి 85 వినతులు వచ్చాయని జీవీఎంసీ అదనపు కమిషనర్లు డివి రమణమూర్తి, ఎస్ ఎస్ వర్మ పేర్కొన్నారు. సోమవారం వారు జివిఎంసి ప్రధాన కార్యాలయం సమావేశ మందిరంలో జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశాల మేరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు వివరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న"ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమానికి జివిఎంసికి సంబంధించి 85 అర్జీలు / ఫిర్యాదులు స్వీకరించడం జరిగిందని తెలిపారు. అందులో ముఖ్యంగా భీమిలి జోన్ కు 02, మధురవాడ జోన్ కు 17, ఈస్ట్ జోన్ కు 09, వెస్ట్ జోన్ కు 05, నార్త్ జోనుకు 15, సౌత్ జోన్ కు 07, పెందుర్తి జోన్ కు 09, అగనంపూడి జోన్ కు 1, గాజువాక జోన్ కు 14, జివిఎంసి ప్రధాన కార్యాలయానికి 06 ఫిర్యాదులు అందాయని తెలిపారు. జోనల్ అడ్మినిస్ట్రేషన్ కు 01, రెవెన్యూ విభాగమునకు 10, ప్రజారోగ్య విభాగమునకు 09, పట్టణ ప్రణాళిక విభాగమునకు 41, ఇంజినీరింగు విభాగమునకు 20, డిడిహెచ్ విభాగమునకు 03, యుసిడి విభాగమునకు 01 కలిపి మొత్తంగా 85 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. ఫిర్యాదులకు సంబంధించిన విభాగాధిపతులు ప్రజలు పెట్టుకున్న అర్జీలను/ ఫిర్యాదులను అదే రోజు జోనల్ స్థాయి అధికారులు వెంటనే పరిశీలిస్తూ, సంబంధిత ఫిర్యాదు దారులతో సంప్రదించి నిర్ణీత సమయంలో పరిష్కరించాలని, వచ్చిన అర్జీలపై అధికారులు వెంటనే స్పందించి కార్యాచరణ అదే రోజు చేపట్టాలని, ప్రతివారం అదే ఫిర్యాదులు తిరిగి ప్రజలు సమర్పించకుండా ఆయా సమస్యలను నిర్ణీత సమయం లో పరిష్కరించాలని జివిఎంసి



జోనల్ కమీషనర్లను, అధికారులను అదరపు కమిషనర్లు ఆదేశించారు. పురమిత్ర, PGRSలో నమోదైన పిర్యాదులను కూడా అధికంగా పెండింగ్ లో ఉన్నాయని వాటిని పరిశీలించాలన్నారు. జోనల్ కమీషనర్ లు, జోనల్ అధికారులు నిత్యం మధ్యాహ్నం 3 నుండి 5 వరకు కార్యాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ (అమృత్) డి.విజయ భారతి, అదనపు కమిషనర్ పి.నల్లనయ్య, సీసీపీ ఏ ప్రభాకరరావు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఈ.ఎన్.వి నరేష్ కుమార్, ప్రాజెక్ట్ డైరెక్టర్ (యు సి డి) బి.వి.రమణ, ఎగ్జామినర్ ఆఫ్ ఎకౌంట్స్ సి.వాసుదేవ రెడ్డి, స్పోర్ట్స్ డైరెక్టర్ ఇ.ఎ.రాజు, పర్యవేక్షక ఇంజనీర్లు, సిటీ వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ కిరణ్ కుమార్, యుసిడి పి.ఒ– పి.ప్రసన్న వాణి, డిపిఒ జి.నాగార్జునరావు, శాంత కుమారి, ఫైర్ ఆఫీసర్, డిసిపి లు, ఎసిపి లు బయాలజిస్ట్ సాంబమూర్తి, అన్ని విభాగాల సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్ల తయారీకి తైవాన్ కంపెనీల ఆసక్తి



-సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లతో ప్రతినిధి బృందం భేటీ

అమరావతి: తయారీ రంగం, సాంకేతికత, పారిశ్రామికాభివృద్ధిలో పరస్పర సహకారాన్ని అందించేందుకు తైవాన్‌కు చెందిన ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం అంగీకరించింది. ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్లు సహా అధునాతన తయారీ, సాంకేతిక రంగాల్లో రాష్ట్ర ప్రభుత్వంతో భాగస్వామ్యాన్ని మరింత పెంచుకునే దిశగా తైవాన్ పారిశ్రామిక ప్రతినిధుల బృందం సీఎం చంద్రబాబుతో సచివాలయంలో భేటీ అయింది. ఏపీలో కార్యకలాపాలు విస్తరించేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించింది. తైవాన్ కంపెనీలు, పరిశ్రమలకు చెందిన ఉన్నతస్థాయి ప్రతినిధుల బృందం వివిధ అంశాలపై చర్చలు జరిపింది. సీఎం మాట్లాడుతూ. 'రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామిక అనుకూల విధానాలకు ప్రాధాన్యం ఇస్తోంది. ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్లు, ఐటీ, అడ్వాన్స్‌డ్ మాన్యుఫ్యాక్చరింగ్ సహా ఎగుమతి ఆధారిత పరిశ్రమలపై ప్రత్యేక దృష్టి పెట్టాం. రాష్ట్రంలో పెట్టుబడిదారులకు విధానపరమైన స్థిరత్వం, వేగంగా అనుమతులు ఇవ్వడంతో పాటు పూర్తి స్థాయిలో ప్రోత్సాహమిచ్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది' అని సీఎం వివరించారు. తైవాన్‌కు చెందిన డెల్టా ఎలక్ట్రానిక్స్, బెన్‌క్యూ, సీబీటీసీ బ్యాంక్, డైమెర్కో మాస్టర్ హిల్, నాన్ పావోరెసిన్స్, ఎవర్ క్లియర్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీరింగ్, షశ్రీంగ్ హుయ్ టెక్, టెక్ టాప్ ఇంజినీరింగ్, కేఎస్ టెర్మినల్స్, శాండ్ సన్, జిలీ కన్‌స్ట్రక్షన్స్ అండ్ ఇంజినీరింగ్, కపెల్లా స్టోర్స్ వంటి అంతర్జాతీయ దిగ్గజ సంస్థల కంపెనీల ప్రతినిధులు ఈ భేటీలో పాల్గొన్నారు.

మంత్రి లోకేశ్‌తో భేటీ: రాష్ట్రంలో మానవవనరుల అభివృద్ధి, నైపుణ్యాల కల్పన, విద్యాపరమైన సహకారం గురించి మంత్రి లోకేశ్‌తో జరిగిన భేటీలో తైవాన్ ప్రతినిధుల బృందం చర్చించింది. 'ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్లు, ప్రెసిషన్ ఇంజినీరింగ్, ఇండస్ట్రియల్ ఆటోమేషన్, హెల్త్‌కేర్, ఇతర హైస్కిల్ రంగాల్లో పరస్పర సహకారం అందించుకోవాలి. ప్రపంచస్థాయి నైపుణ్య గ్రిడ్ నిర్మించడంతో పాటు మాండరిన్ భాషలో శిక్షణ, పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా సర్టిఫికేషన్, ఇంటర్న్‌షిప్‌లు, విద్యార్థి-ఫ్యాకల్టీ మార్పిడి కార్యక్రమాలు, సంయుక్త పరిశోధనలు, ఉద్యోగ సన్నద్ధత కార్యక్రమాలు చేపట్టాలి' అని లోకేశ్ వారితో చెప్పారు.

తాగునీరు,సాగునీటి తరలింపు పనుల్లో అంతరాయాల్ని 14 రోజుల్లోగా పరిష్కరించాలి

-రెవెన్యూ, సర్వే శాఖల పనుల సమన్వయంపై సమీక్ష -జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్



అనకాపల్లి: విశాఖపట్నం మరియు పరిసర ప్రాంతాలకు నీటి సరఫరా ప్రక్రియను వేగవంతం చేయడంపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆర్డీవోలు, మండల రెవెన్యూ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, వచ్చే 14 రోజుల్లోగా పనుల్లో ఎదురవుతున్న అన్ని రకాల సమస్యలను మరియు అంతరాయాలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పి.ఎల్.ఎం.సి ఇంజనీర్లతో మాట్లాడి, క్షేత్రస్థాయిలో విద్యుత్ , రహదారులు , లేదా భూమికి సంబంధించి ఏవైనా అంతరాయాలు ఉంటే తక్షణమే గుర్తించి పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. కొన్ని ప్రాంతాలలో స్థానిక వ్యతిరేకతల వల్ల యంత్రాలు ప్రవేశించలేకపోవడం, మరికొన్ని చోట్ల తవ్విన మట్టిని వేయడానికి సరైన స్థలం లేకపోవడం వంటి సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించాలన్నారు. కొన్ని చోట్ల రహదారుల మళ్లింపు, నిర్మాణాత్మక సమస్యలు, స్థల సేకరణ, నష్టపరిహారం చెల్లింపులు, కోర్టు కేసులకు సంబంధించిన చిక్కులు ఉంటే, వీటిని త్వరితగతిన పరిష్కరించి పనులు వేగంగా జరిగేలా చూడాలన్నారు. రాబోయే 14 రోజుల్లో పనులన్నీ పూర్తవ్వాలి. మాన్యువల్ సూచనల ప్రకారం, నీరు పాయకరావుపేట కు చేరుకోవాలి. పాయకరావుపేట నుండి విశాఖపట్నం చేరడానికి మరో 2 రోజుల సమయం పడుతుంది. ఈ రెండు రోజుల్లో నీటి ప్రవాహానికి ఎలాంటి అడ్డంకులు ఎదురుకాకూడదన్నారు. పాయకరావుపేటకు 14 రోజుల గడువు ఉండగా, పరవాడ వంటి చివరి మండలాలకు 16 రోజుల సమయం ఉందని, పనులన్నీ ఎలాంటి విఘాతం లేకుండా వేగవంతంగా జరగాలని అధికారులకు స్పష్టం చేశారు. సర్వే రికార్డులను, రెవెన్యూ నంబర్లను పునఃపరిశీలించినప్పుడు లోపాలు రాకుండా చూసుకోవాలని స్పష్టం చేశారు. సంబంధిత సర్వే అధికారులు తమ శాఖ పరిధిలోని సర్వే పనులపై పూర్తి బాధ్యత వహించాలని, రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.

ఉద్యానవన పంటల నష్ట పరిశీలనను వేగవంతం చేయాలి...వివిధ ప్రాంతాల్లో భూ సేకరణ పరిహార అవార్డులు మరియు ఉద్యానవన (హార్టికల్చర్) ఎన్యూమరేషన్ పనుల పురోగతిపై వివరాలను సమీక్షిస్తూ, ఎస్‌డిసి స్థాయి అధికారుల నుండి పెద తీర్థనాల, సీహెచ్‌ఎల్ పురం తదితర ప్రాంతాలకు సంబంధించిన ప్రీ-పేమెంట్ అవార్డుల వివరాలను వెంటనే పంపించాలని సూచించారు. ఈ శనివారంలోగా ఉద్యానవన పంటల నష్ట పరిశీలన/ఎన్యూమరేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని ఎమ్‌ఆర్‌ఓలను ఆదేశించారు. పనులను త్వరితగతిన పూర్తి చేయడానికి అవసరమైనంత మంది సిబ్బందిని క్షేత్రస్థాయిలో నియమించి పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. పనులన్నింటినీ నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. బల్క్ డ్రగ్ పార్క్ రహదారులు మరియు భూముల అంచనాలపై సమీక్ష....బల్క్ డ్రగ్ పార్క్ ప్రాజెక్ట్‌కు సంబంధించి పలు అభివృద్ధి పనులు మరియు భూముల సర్వే పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభావిత భూములలో ఉన్న నిర్మాణాలు మరియు చెట్ల విలువ అంచనా నివేదికలను శనివారంలోగా సిద్ధం చేయాలని ఆదేశించారు. బల్క్ డ్రగ్ పార్క్ అప్రోచ్ రోడ్డుకు సంబంధించి పెగ్ మార్కింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ భూములను స్పష్టంగా గుర్తించి, రహదారి నిర్మాణ పనులు స్పష్టంగా కనిపించేలా చూసుకోవాలని సూచించారు. పనుల్లో ఎలాంటి జాప్యం సహించేది లేదని, నిర్దేశిత సమయానికి పనులు పూర్తి కావాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ శౌర్య మాన్ పటేల్, జిల్లా రెవెన్యూ అధికారి వై. సత్యనారాయణ రావు, నర్సీపట్నం అనకాపల్లి ఆర్డీవోలు వివి రమణ, ఆయేషా, తాహశీల్దార్లు, సర్వేయర్లు పాల్గొన్నారు.

అహోబిలం మఠం వ్యవహారాల్లో జోక్యం వద్దు

-క్రమశిక్షణ ఉల్లంఘిస్తే సహించేది లేదు - ఆళ్లగడ్డ ఎమ్మెల్యే అఖిలప్రియకు తెదేపా అగ్ర నాయకత్వం స్పష్టీకరణ



అమరావతి: అహోబిలం మఠం వ్యవహారాల్లో జోక్యం చేసుకోవద్దని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియకు తెదేపా అగ్ర నాయకత్వం స్పష్టంచేసింది. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని తేల్చిచెప్పింది. ఆళ్లగడ్డ నియోజకవర్గంలో చోటు చేసుకుంటున్న వివాదాస్పద పరిణామాలు, అహోబిలం మఠంలో తలనీలాల కాంట్రాక్ట్ సహా వివిధ అంశాల్లో ఎమ్మెల్యే జోక్యంపై ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో అగ్ర నాయకత్వం అఖిలప్రియను పిలిపించింది. ఆమె తెదేపా కేంద్ర కార్యాలయానికి వచ్చి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును కలిశారు. నియోజకవర్గంలోని పరిణామాలు, తనపై వస్తున్న ఆరోపణలపై వివరణ ఇచ్చారు. అహోబిలం మఠం విషయంలో అఖిలప్రియ తీరుపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఆగ్రహంగా ఉన్నారని పల్లా స్పష్టంచేశారు. నియోజకవర్గంలో అఖిలప్రియ భర్త భార్గవ్ జోక్యం చేసుకోవడానికి వీల్లేదని అధినేత మాటగా పల్లా తేల్చిచెప్పారు. ఇప్పటికీ మారకపోతే పార్టీ చూస్తూ ఊరుకోదని, చర్యలు తప్పవని ఆయన స్పష్టంచేశారు. అహోబిలం మఠంలో తలనీలాల కాంట్రాక్ట్ నామినేషన్ విధానంలో నచ్చిన వాళ్లకు ఇచ్చేస్తున్నారని, ఆలయానికి వస్తున్న ఆదాయాన్ని తమిళనాడులో ఖర్చు పెడుతున్నారని అఖిలప్రియ చెప్పినట్లు తెలిసింది.

ఏం జరుగుతోందో వివరించా: అఖిలప్రియ

'ఆళ్లగడ్డలో ఏ చిన్న సంఘటన జరిగినా సెన్సేషన్ అవడం మా అమ్మానాన్నల కాలం నుంచీ చూస్తున్నా. వాస్తవమా? అవాస్తవమా? అని చూడకుండా ప్రతి చిన్న విషయాన్నీ హైప్ చేస్తున్నారు. కేడర్‌లో గందరగోళం ఏర్పడకూడదన్న ఉద్దేశంతోనే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసి వివరణ ఇచ్చా. జిల్లా, నియోజకవర్గ పరిణామాల్ని వివరించా. రాజకీయాల్లో మా అమ్మానాన్నల స్థాయికి ఎదగాలని పల్లా శ్రీనివాసరావు సూచించారు. పార్టీ నుంచి పూర్తి సహకారం ఉంటుందని చెప్పారు. నియోజకవర్గంలో ఏ చిన్న సమస్య వచ్చినా పార్టీకి తెలపాలని, వివరణ ఇవ్వాలని నాతో చెప్పారు' అని పల్లాతో భేటీ అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ అఖిలప్రియ వివరించారు.

కర్నూలుకు 90 రోజుల్లో హైకోర్టు బెంచ్

-పాదయాత్రలో ఇచ్చిన హామీలు నెరవేరుస్తా -కర్నూలు జిల్లా పర్యటనలో మంత్రి లోకేశ్



కర్నూలు: కర్నూలులో 90 రోజుల్లో హైకోర్టు బెంచ్ ఏర్పడుతుందని మంత్రి నారా లోకేశ్ ప్రకటించారు. ఆదోని శివారులోని మండగిరి ప్రాంతంలో నిర్వహించిన ఆదోని తెదేపా నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 45 రోజులపాటు నిర్వహించిన యువగళం పాదయాత్రలో తాను ఇచ్చిన హామీలన్నీ గుర్తున్నాయని, ఎప్పటికప్పుడు హామీల పుస్తకాన్ని చూసుకుని తానిచ్చిన ప్రతి హామీ నెరవేర్చేందుకు చర్యలు చేపట్టానని పేర్కొన్నారు. పరిశ్రమలశాఖ మంత్రి టీజీ భరత్ పోరాడి మరీ పరిశ్రమలను కర్నూలుకు తీసుకొస్తున్నారని.. రెండో ముంబయిగా ప్రసిద్ధి చెందిన ఆదోనికి పరిశ్రమలు వస్తాయని పేర్కొన్నారు. డ్రోన్ సిటీ నిర్మాణం జరుగుతోందని, టాటా సోలార్ ప్రాజెక్టుకు గురువారం శంకుస్థాపన చేయనున్నామని వెల్లడించారు. 'కూటమి ప్రభుత్వ హయాంలో జొన్నగిరిలో బంగారం కర్మాగారం రాగా వైకాపా హయాంలో బ్రాహ్మణి స్టీల్ కుంభకోణం జరిగింది. కూటమి హయాంలో రాయలసీమలో ఉద్యానహబ్ రాగా... వైకాపా హయాంలో రాయలసీమలో రక్తం పారింది. రాయల్ ఎన్‌ఫీల్డ్, ఐదోతరం యుద్ధవిమానాల తయారీ కేంద్రం తెచ్చిన ఘనత కూటమిది' అని గుర్తుచేశారు.

నాటి విధ్వంసాన్ని ప్రజలకు వివరించాలి...వైకాపా హయాంలో జరిగిన విధ్వంసం గురించి ప్రతి కార్యకర్తా ప్రజలకు చెప్పాలని మంత్రి నారా లోకేశ్ అన్నారు. 'రాయలసీమ రైతులకు కీలకమైన బిందుసేద్యం పరికరాలపై 90% రాయితీని ఎత్తేశారు. అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయి పలువురి ప్రాణాలు పోతే పరామర్శించలేదు, వారికి పరిహారం కూడా ఇవ్వలేదు. అమరరాజా, జాకీ లాంటి సంస్థలను తరిమేశారు' అని గుర్తుచేశారు.

పదో తరగతి తప్పిన బ్యాచ్ కాదు.. 'డీఎస్సీపై చర్చకు రమ్మంటే రాకుండా తన చెంచాలతో ప్రకటనలు చేయిస్తున్నారు. మేము పదోతరగతి తప్పిన బ్యాచ్ కాదు... స్టాన్‌ఫర్డ్‌లో చదివిన బ్యాచ్ మేము. మళ్లీ సవాల్ చేస్తున్నా జగన్.. తేదీ, సమయం చెప్పు. డీఎస్సీపైనా, గ్రూప్-1 కుంభకోణంపైనా, క్వార్టర్ బాటిల్ కుంభకోణంపైనా చర్చిద్దాం' అన్నారు. తెదేపాలో ప్రజలకు ఉపయోగపడేలా అనేక అనుబంధ విభాగాలుంటే.. సైకో పార్టీలో గొడ్డలి విభాగం, బూతుల విభాగం ఉన్నాయని, ఫేక్ ప్రచారాలు చేయడం వారికి జీర్ణించుకుపోయిందని మంత్రి నారా లోకేశ్ ఎద్దేవా చేశారు. రాష్ట్రం గాడిన పడాలంటే కూటమి మరో మూడుసార్లు గెలవాలని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. కర్నూలుకు సుమారు రూ.50 వేల కోట్ల పెట్టుబడులు రానున్నాయని మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు. తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి మీనాక్షినాయుడు, రాయలసీమ సమన్వయకర్త శ్రీనివాసరెడ్డి, ఆదోని పరిశీలకుడు కేశవరెడ్డి, జిల్లా అధ్యక్షురాలు కృష్ణమ్మ, కర్నూలు పార్లమెంటు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి నాగరాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధానమంత్రి భోగాపురం పర్యటనను సమన్వయంతో విజయవంతం చేయాలి

-ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు చేపట్టాలి - జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి



విశాఖపట్నం: విశాఖపట్నంలో నిర్వహిస్తున్న ప్రతి ప్రభుత్వ కార్యక్రమాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో విజయవంతంగా నిర్వహిస్తున్నారని, అదే స్ఫూర్తితో భారత ప్రధానమంత్రి భోగాపురం పర్యటనతో పాటు అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని కూడా అత్యంత ప్రతిష్ఠాత్మకంగా విజయవంతం చేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి పిలుపునిచ్చారు. అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా రవాణా, ట్రాఫిక్ నియంత్రణ, తాగునీరు, వైద్య సేవలు, భద్రత తదితర అంశాల్లో పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. ఉత్తరాంధ్ర ప్రజల ఎన్నో ఏళ్ల ఆకాంక్షకు ప్రతిరూపంగా రూపుదిద్దుకున్న అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవం ఈ ప్రాంత అభివృద్ధి చరిత్రలో ఒక చారిత్రాత్మక ఘట్టమని మంత్రి పేర్కొన్నారు. ఆగస్టు 1న భారత ప్రధానమంత్రి చేతుల మీదుగా జరగనున్న ఈ మహా కార్యక్రమంలో ప్రజలు స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన అధికారులకు, ప్రజాప్రతినిధులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమానికి స్వచ్ఛందంగా హాజరయ్యే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రజల రాకపోకలు, తాగునీరు, ఆహారం, వైద్య సేవలు, భద్రత తదితర అంశాల్లో పకడ్బందీ ఏర్పాట్లు ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి వచ్చే ప్రజల కోసం ప్రత్యేక రవాణా ప్రణాళిక రూపొందించాలని, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి బస్సుల రాకపోకలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. అన్ని బస్సులు ఉదయం 9 గంటలకల్లా భోగాపురం చేరుకునేలా, ఆయా ప్రాంతాల దూరం మరియు రహదారి పరిస్థితులను బట్టి ఉదయం 6 గంటల నుంచే దశలవారీగా బయలుదేరేలా ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. గ్రామం, మండలం, రూట్ వారీగా బాధ్యతలను స్పష్టంగా కేటాయించి అధికారులు, ప్రజాప్రతినిధులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. బస్సుల రూట్ మ్యాప్, సమయాలు, ప్రయాణ వివరాలను ప్రత్యేక యాప్ ద్వారా పర్యవేక్షించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజల సాధారణ రాకపోకలకు ఎలాంటి ఆటంకం కలగకుండా ప్రత్యేక ట్రాఫిక్ ప్రణాళికను అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి రావడం ద్వారా ఉత్తరాంధ్ర ప్రాంతానికి ఉపాధి, పెట్టుబడులు, పర్యాటకం, వ్యాపారం, విమానయాన రంగాల్లో విస్తృత అవకాశాలు లభించనున్నాయని మంత్రి పేర్కొన్నారు. ఈ అవకాశాలపై యువతకు, ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, జాయింట్ కలెక్టర్ జి. విద్యాధరి, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి రావు, శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణబాబు, విష్ణుకుమార్ రాజు, కార్పొరేషన్ చైర్మన్లు సీతంరాజు సుధాకర్, గండి బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై పొగాకు రైతుల బైఠాయింపు

-గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్



ఒంగోలు: పొగాకుకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.1000 కోట్లు కేటాయించి, రైతుల వద్ద ఉన్న సరకును కొనుగోలు చేయాలని పొగాకు రైతులు నినదించారు. సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ప్రకాశం జిల్లా త్రోవగుంటలోని ముదిగొండ వంతెన సమీపంలో, టంగుటూరు టోల్‌ప్లాజా వద్ద 16వ నంబరు జాతీయ రహదారిపై ఈ మేరకు రాస్తారోకోలు చేశారు. పొగాకు రైతుకు న్యాయం జరగకపోతే అమరావతి, దిల్లీ స్థాయికి పోరాటాన్ని తీసుకెళ్లేందుకు రైతులు సిద్ధం కావాలని నాయకులు పిలుపునిచ్చారు. పొగాకుపై ప్రభుత్వానికి రూ.90 వేల కోట్ల ఆదాయం వస్తుంటే రైతులకు రూ.188 కోట్ల భిక్ష వేస్తారా అంటూ ప్రశ్నించారు. రైతులు బైఠాయించడంతో రహదారిపై రెండు చోట్లా భారీగా వాహనాలు నిలిచిపోయాయి. దీంతో పోలీసులు నిరసన చేస్తున్న వారిని బలవంతంగా పక్కకు తీసుకెళ్లారు. మరికొందరిని అరెస్టు చేసి, స్టేషన్‌కు తరలించారు. ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య, జిల్లా అధ్యక్షుడు పమిడి వెంకటరావు, జిల్లా కార్యదర్శి జజ్జూరి జయంతిబాబు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులు సమాజ ప్రగతి సాధకులు



-పాత్రికేయుల సమస్యలు పరిష్కారానికి సహకారం -
ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ సమావేశంలో -
పద్మనాభం తాసిల్దార్ దాడిశెట్టి శైలజ, సి ఐ చంద్ర మౌళి

భీమిలి: జర్నలిస్టుల సమస్యలు పరిష్కారానికి తమ వంతు సంపూర్ణ సహకారం అందిస్తామని పద్మనాభం మండల తాసిల్దార్ దాడిశెట్టి శైలజ, స్థానిక సీఐ మీసాల చంద్రమౌళి హామీ ఇచ్చారు.. పద్మనాభం గ్రామంలో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల పాత్రికేయుల సమావేశం నిర్వహించారు.. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ జర్నలిస్టులతోనే ప్రజా సమస్యలు పరిష్కరించడానికి అవకాశం కలుగుతుందన్నారు.. నిరంతరం కష్టపడి గ్రామీణ ప్రాంతాల ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి ఎంతగానో కృషి చేస్తున్నారని కొనియాడారు.. అలాగే జర్నలిస్టులకు ప్రభుత్వం నియమ నిబంధనల ప్రకారం ఇళ్ల స్థలాలు ఇండ్లు కేటాయించేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు.. పాత్రికేయులు అందరూ సమన్వయంతో ముందుకు సాగుతూ సమాజ ప్రగతికి మరింతగా తోడ్పాటు అందించాలని వారు ఆకాంక్షించారు.. సమావేశంలో జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి ఆంధ్ర ప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టులు ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ నగరంతో పాటు



గ్రామీణ ప్రాంత జర్నలిస్టులకు తమ వంతు అండగా ఉంటామన్నారు.. వారికి అవసరమైన అక్రిడేషన్లు .. హెల్త్ ఇన్సూరెన్స్. ఇళ్ల స్థలాలు వంటి సమస్యలు పరిష్కారానికి యూనియన్ పరంగా సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు.. పద్మనాభం మండల రిపోర్టర్లు ఐక్యంగా ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారని కొనియాడారు . విశాఖ జిల్లా అధ్యక్షులు పి నారాయణ ప్రధాన కార్యదర్శి జి శ్రీనివాస్ రావు లు మాట్లాడుతూ జిల్లాలో అన్ని మండలాల్లో పర్యటిస్తూ జర్నలిస్టుల సమస్యలు పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తున్నామన్నారు.. ఈ ఏడాది సుమారు 800 మంది జర్నలిస్టులు తమ యూనియన్ లో సభ్యత్వం స్వీకరించారు అన్నారు.. ఈ సమావేశానికి పద్మనాభం ఫెడరేషన్ నాయకులు కే సత్యనారాయణ సభాధ్యక్షత వహించి.. స్థానికంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించారు.. అలాగే ప్రస్తుత ఎంపీపీ రాంబాబు మాజీ ఎంపీపీ గోపిరాజు.. స్థానిక ఫెడరేషన్ నాయకులు కే తులసీదాసు.. బి ప్రసాద్.. కే త్రినాథ్.. పి రాజు . ఏ దేవుడు.. బి అప్పలనాయుడు.. రంగధామారావు. విశాఖ జిల్లా.. బ్రాడ్ కాస్ట్ అధ్యక్ష కార్యదర్శులు ఇరోతి ఈశ్వరరావు.. కింతాడ మదన్ స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జగన్మోహన్, కార్యదర్శి కే శ్రీనివాసరావు.. ఇతర ప్రతినిధులు హరి. బొబ్బర ప్రసాద్, ఫెడరేషన్ ఉపాధ్యక్షులు నగేష్ బాబు. స్థానిక పాత్రికేయులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో 'యూఏఈ' ఫుడ్ క్లస్టర్

-మొదటగా రూ.100 కోట్లతో చిత్తూరు జిల్లాలో యూనిట్ -ఏపీ ఈడీబీ- యూఏఈ మధ్య అవగాహన ఒప్పందం



అమరావతి: రాష్ట్రంలో ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో ఎగుమతులు, వాణిజ్యం, పెట్టుబడులు పెట్టేలా ఏపీ ఎకనమిక్ డెవలప్‌మెంట్ బోర్డు(ఈడీబీ) – యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ)కి చెందిన ఫుడ్ క్లస్టర్ అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. సచివాలయంలో సీఎం చంద్రబాబు, యూఏఈ ఆర్థిక, పర్యాటక విభాగం మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మర్రి సమక్షంలో ఒప్పందంపై ఇరుపక్షాలు సంతకాలు చేశాయి. దీంతో ఉద్యాన ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతి చేయడం, విదేశీ వాణిజ్యం సహా యూఏఈకి చెందిన సంస్థలు ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు అవకాశం ఏర్పడుతుంది. ఈ ఏడాది జనవరిలో దావోస్‌లో జరిగిన ప్రపంచ దేశాల ఆర్థిక సదస్సులో రాష్ట్రంలో ఫుడ్ క్లస్టర్ ఏర్పాటుకు యూఏఈ సంసిద్ధత వ్యక్తం చేసింది. దీనిపై సీఎం చంద్రబాబు, యూఏఈ ప్రతినిధుల బృందం చర్చలు జరిపింది. ఆహారశుద్ధి రంగంలో ఏపీలో వ్యాల్యూ చైన్ ఏర్పాటుకు యూఏఈ అంగీకరించింది. మామిడి, అరటి, కోకో వంటి వివిధ ఉద్యాన ఉత్పత్తులకు సంబంధించి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు, విలువ జోడించిన ఉత్పత్తుల ఎగుమతులు, వాణిజ్యం వంటి అంశాల్లో పరస్పరం సహకరించుకుంటాయి. దీనికి తొలి అడుగుగా చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరులో రూ.100 కోట్ల పెట్టుబడితో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు యూఏఈకి చెందిన 'ఫ్లోర్ మాస్టర్స్ ఇంటర్నేషనల్ సంస్థ' ముందుకొచ్చింది. దుబాయ్, యూఏఈ కేంద్రంగా ఉన్న ఈ సంస్థ 25 దేశాలకు తమ ఉత్పత్తులను ఎగుమతి చేస్తోంది.

ఏపీ–యూఏఈ మధ్య ఫుడ్ కారిడార్.... యూఏఈ సంస్థ ఆరు నెలల్లోగా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయనున్నట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 'రూ.లక్ష కోట్ల ప్రభుత్వ, ప్రైవేటు పెట్టుబడులతో రాయలసీమను ఉద్యాన హబ్‌గా మారుస్తున్నాం. రిలయన్స్ భాగస్వామ్యంతో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌ను ఏర్పాటు చేయనున్నాం. 200కు పైగా ఉద్యాన క్లస్టర్లతో ఆక్వా, మిర్చి, పామాయిల్, కోకో, కాఫీ తదితర పంటలను ఎగుమతి చేస్తున్నాం. పోర్టులు, రైల్వే, రోడ్డు వ్యవస్థతో ఏపీ లాజిస్టిక్స్ కేంద్రంగా మారింది. ఆగస్టు ఒకటి నుంచి ఏపీలో మరో అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి వస్తోంది' అని యూఏఈ బృందానికి సీఎం వివరించారు. ఏపీలో ఏర్పాటు చేసే క్లస్టర్ ద్వారా డెయిరీ, పౌల్ట్రీ, సీఫుడ్, పప్పుదినుసులు తదితర ఉత్పత్తులను ఎగుమతి చేయడానికి దృష్టి పెడతామని యూఏఈ మంత్రి పేర్కొన్నారు. మంత్రి టీజీ భరత్, యూఏఈ ప్రతినిధులు, ఈడీబీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కత్తులతో బెదిరించి దోపిడీకి యత్నం

-తొమ్మిది మంది అరెస్టు



రాజానగరం: పశువులను తరలిస్తున్న వాహనాల డ్రైవర్లను కత్తులతో బెదిరించి దోపిడీకి యత్నించిన తొమ్మిది మందిని అరెస్టు చేసినట్లు ఉత్తర మండల డీఎస్పీ సి.హెచ్.జీవన తెలిపారు. రాజానగరం పోలీసుస్టేషన్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో డీఎస్పీ, సీఐ ఎస్.ప్రసన్నవీరయ్యగౌడ్ వివరాలను వెల్లడించారు. శ్రీకాకుళానికి చెందిన ప్రసాద్ అనే వ్యక్తి పాతపట్నంలో రైతుల నుంచి ఆరు ఎద్దులను కొన్నారు. వాటిని అమరావతి పరిధిలోని కోసూరు సంతకు తీసుకెళ్లి వెంకటేష్ అనే రైతుకు అప్పజెప్పాల్సి ఉంది. కొండపల్లి రవి, తాడేలా నవీన్, ఆలాపన దాలిరాజు అనే డ్రైవర్లతో రెండు వాహనాల్లో వాటిని పంపించారు. ఈనెల 9న పాతపట్నం నుంచి ఎద్దులతో వాహనాలు బయలుదేరాయి. 10న తెల్లవారుజామున కాలకృత్యాల కోసం రాజానగరం హైవేపై వారు ఆగారు. అంతలో రెండు వాహనాల్లో కొంతమంది వ్యక్తులు వచ్చి కత్తులు చూపి రవి, నవీన్, దాలిరాజును బెదిరించారు. పశువుల వాహనాలను పల్లకడియం వద్దకు తీసుకెళ్లి డబ్బులు డిమాండ్ చేశారు. తమ వద్ద డబ్బులు లేవని, వదిలేయాలని ముగ్గురూ ప్రాధేయపడటంతో వారు వెళ్లిపోయారు. దీనిపై బాధిత డ్రైవర్లు ఇచ్చిన ఫిర్యాదుతో మేరకు కేసు నమోదు చేశారు. ఎస్సై జి.వి.వి.సత్యనారాయణ కేసు దర్యాప్తు చేశారు. దీనికి సంబంధించి తొమ్మిది మందిని అరెస్టు చేసినట్లు చెప్పారు. వీరంతా రాజమహేంద్రవరంలోని వెండి, చరవాణులు, గిఫ్ట్ షోరూంల్లో పనిచేస్తున్నట్లు గుర్తించామన్నారు.

మహిళల రక్షణపై దువ్వాడ ఎస్ ఐ వెంకట లక్ష్మి సూచనలు



గాజువాక: విశాఖపట్నం పోలీస్ కమీషనర్ శంకభ్రత బాగ్చి ఆదేశాల మేరకు సౌత్ సబ్ డివిజన్ ఏసీపీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో దువ్వాడ రైల్వే స్టేషన్ వద్ద మహిళలు కాలేజ్ స్టూడెంట్స్ తో ఆమె మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న పలు సంఘటనలను వారితో పంచుకుని అటువంటి అకృత్యాల పట్ల మహిళలు అప్రమతంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలలు ఆపత్కాల సమయంలో రక్షణగా శక్తి యాప్ నిలుస్తుందని అన్నారు. శక్తి యాప్ శక్తి వాట్సాప్ నెంబర్ ద్వారా ఆకతాయిలు ఆగడాలు,సంఘ వ్యతిరేక కార్యకలాపాలను నిరోధించేందుకు ఉపయోగ పడతాయన్నారు. ఆపదలో ఉన్నప్పుడు గాని పని ప్రదేశంలో ఇబ్బంది ఉన్నా గాని లేదా మరే ఇతర ఇబ్బందికర పరిస్థితులలో అయినా మహిళలు ఎలా ఉండాలో పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలో మరియు వారికి పలు చట్టాలు వాటి ఉపయోగాలు వివరించారు. ఆన్లైన్ పరిచయాలు, సోషల్ మీడియా ద్వారా పరిచయాలు అటువంటి వారితొ స్నేహం చేసినా జీవితం నాశనం అవుతుందని వాటి పరిణామాలు వివరిస్తూ అటువంటి వారికి దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో శక్తి టీమ్ ఏఎస్ఐ వినయ్, హేమ సుందర్, స్పందన తదితరులు పాల్గొన్నారు.

పి.జి.ఆర్.ఎస్ పై క్యూ.ఆర్ కోడ్ ద్వారా స్పందన తెలియజేయండి

-జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్



అనకాపల్లి: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్)పై ప్రజలు తమ స్పందన తెలియజేయాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికను మరింత పారదర్శకత, జవాబుదారీతనం దిశగాను, నిరంతర అభిప్రాయ సేకరణ చేసి పౌరుల సంతృప్తిని మెరుగుపరచడం, వ్యవస్థను బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. పి.జి.ఆర్.ఎస్ కేంద్రాలను సందర్శించే పౌరుల నుండి అభిప్రాయాన్ని సేకరించేందుకు జిల్లా, మండల స్థాయి పి.జి.ఆర్.ఎస్ కేంద్రాలలో, వివిధ మాధ్యమాల్లో ప్రజల అభిప్రాయ సేకరణకు క్యూ.ఆర్ కోడ్‌ను ప్రదర్శించాలని నిర్ణయించడం జరిగిందని చెప్పారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా, మండల స్థాయి పి.జి.ఆర్.ఎస్ కేంద్రాల ప్రవేశ, నిష్క్రమణ ప్రాంతాలలో క్యూ.ఆర్ కోడ్ ప్రముఖంగా ప్రదర్శించాలని ఆదేశించారు. క్యూ.ఆర్ కోడ్‌ను స్పష్టంగా, కంటికి కనిపించే పరిమాణంలో ముద్రించి, ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండే ప్రాంతాలలో ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. పౌరులు పి.జి.ఆర్.ఎస్ సేవలను పొందిన వెంటనే తమ మొబైల్ ఫోన్‌ల ద్వారా క్యూ.ఆర్ కోడ్‌ను స్కాన్ చేసి తమ అభిప్రాయాన్ని సమర్పించవచ్చని చెప్పారు. ఎక్కువ సంఖ్యలో పౌరులు భాగస్వామ్యం అయ్యే విధంగా నోటీసు బోర్డులు, హెల్ప్ డెస్క్‌లు, ఫిర్యాదుల కౌంటర్లు, తదితర ప్రదేశాల్లో పెట్టాలని సూచించారు. క్యూ.ఆర్ కోడ్ వలన ప్రజల స్పందన అధికారిక పి.జి.ఆర్.ఎస్ పోర్టల్ https://pgrs.ap.gov.in/Home/QRGrievance Feedback కు చేరుతుందని అన్నారు. ఆర్జీల స్థితిగతులు తెలుసుకొనుటకు టోల్ ఫ్రీ నంబర్ 1100 కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని తెలిపారు. పి.జి.ఆర్.ఎస్ ను వినియోగించుకోవాలని, తమ అభిప్రాయాలను తెలియజేస్తూ మరింత మెరుగైన సేవలు అందించుటకు సహకరించాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

ప్రతీ సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోను, మండల కార్యాలయాల్లోనూ నిర్వహించే పి.జి.ఆర్.ఎస్ లో అర్జీలు అందించండి, వాటిపై మీ స్పందన క్యూ.ఆర్ కోడ్ ద్వారా తెలియజేయండి అని కోరారు.

కార్యకర్త కుటుంబానికి ఐదు 5లక్షలు చెక్కు పంపిణీ చేసిన పల్లా



గాజువాక: ప్రమాదవ శాత్తు మరణించిన 64వ గంగవరం తెలుగు దేశం పార్టీ క్రియాశీలక కార్యకర్త కంబాల మాధవరావు గారికి మృతిని కుటంబానికి గాజువాక నియోజకవర్గ శాసనసభ్యులు, ఆంధ్రప్రదేశ్ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు ఐదు లక్షల రూపాయల కార్యకర్తల సంక్షేమ నిధి చెక్కును సతీమణి కంబాల కళ్యాణికి అందజేసీ కార్యకర్త కుటుంబానికి అండగా నిలిచారు. పార్టీ కోసం అవిశ్రాంతంగా కృషి చేసిన కార్యకర్తకు ఆర్థిక సహాయంగా రూ 5లక్షల రూపాయల చెక్కును ఆయన స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ కి కార్యకర్తలే మనకు బలం. వారి కుటుంబాల సంక్షేమం మా బాధ్యత.. ఏ కార్యకర్త కష్టంలో ఉన్నా తెలుగుదేశం పార్టీ, కూటమి ప్రభుత్వం అండగా ఉంటుంది" కార్యకర్తల సంక్షేమానికి దేశంలో అధిక ప్రాధమిక ఇచ్చిన తెలుగుదేశం పార్టీకి దక్కుతుందని అన్నారు అధికారంలో ఉన్న ప్రతిపక్షంలో ఉన్న ప్రజలతాలకు సమస్యలను పరిష్కరించడంలో టిడిపి పార్టీ కార్యకర్తలు క్రియాశీలక పాత్ర పోసిస్తుందని తెలిపారు. పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తకు ఇలా పెద్ద మొత్తంలో ఆర్థిక సహాయం అందించడంతో కార్యకర్త కుటుంబ సభ్యులు, స్థానిక నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, వార్డు అధ్యక్షులు, గోమడవాసు వియ్యపు కొండబాబు నల్లూరి సూర్యనారాయణ కర్రి దసేంద్ర కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సింహగిరి ప్రదక్షిణకు పకడ్బందీ ఏర్పాట్లు

-భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలి -32 కి.మీ. మేర ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్



విశాఖపట్నంః ఈ నెల 28, 29 తేదీల్లో నిర్వహించనున్న సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామివారి వార్షిక సింహగిరి ప్రదక్షిణకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ అధికారులను ఆదేశించారు. సింహగిరి ప్రదక్షిణ జరిగే 32 కిలోమీటర్ల మార్గాన్ని జిల్లా కలెక్టర్ పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, దేవస్థానం ఈవో వెంకటరావు, ఇతర అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. లుంబినీ పార్కు నుంచి ఎంవీపీ సర్కిల్, ఇసుకతోట జంక్షన్, డబుల్ రోడ్ జంక్షన్, సీతమ్మధార, మురళీనగర్, మారియెట్ హోటల్ మీదుగా జాతీయ రహదారి, ఎన్ఎస్టీఎల్, కుమారి కళ్యాణ మండపం నుంచి తొలి పావంచ వరకు గిరి ప్రదక్షిణ మార్గాన్ని బస్సులో ప్రయాణిస్తూ పరిశీలించారు. రహదారుల మరమ్మతులు, అభివృద్ధి పనులు, విద్యుత్ దీపాల ఏర్పాటు, భూగర్భ కేబులింగ్ పనులు, సీసీ కెమెరాల ఏర్పాటు, భక్తుల కోసం వేచి ఉండే ప్రదేశాలు తదితర ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు తగిన సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. భూగర్భ కేబులింగ్ పనులను వేగంగా పూర్తి చేసి రహదారులను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. రాత్రి వేళల్లో భక్తులకు ఇబ్బంది లేకుండా తగినంత లైటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. భక్తులకు అవసరమైన సహాయం అందించేందుకు ప్రదక్షిణ మార్గంలో 30 అసిస్టెన్స్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

ఉద్యోగాలు కల్పించినప్పుడే నిజమైన స్టార్లు



విజయనగరం: విద్యార్థులు చిన్ననాటి నుంచి లక్ష్యాలతో ముందుకెళ్లాలని హోంమంత్రి అనిత సూచించారు. పైనింగ్ స్టార్లుగా ఎంపికైన వారికి విజయనగరం మండలం ముడిదాంలో ప్రశంసాపత్రాలు అందించారు. తల్లిదండ్రులు ఎన్నో కష్టాలు పడి చదివిస్తున్నారని, వారి కలలను నిజం చేయాలని కోరారు. ప్రభుత్వం అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తోందని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉద్యోగాలు పొందడం ముఖ్యం కాదని, పది మందికి ఉపాధి కల్పించిన వారే నిజమైన స్టార్లు అని పేర్కొన్నారు. కలెక్టర్ రాంసుందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు అదితి, నాగమాధవి, తూర్పుకాపు కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ యశస్వి, మార్క్‌ఫెడ్ ఛైర్మన్ బంగార్రాజు, డీసీఎంఎస్ ఛైర్మన్ గొంప కృష్ణ, డీఈవో మాణిక్యంనాయుడు పాల్గొన్నారు. పదో తరగతిలో ప్రతిభ చూపిన 184 మంది, 39 మంది ఇంటర్ విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, పతకాలు, నగదు బహుమతులను అందించారు.

యథాతథంగా రిజిస్ట్రేషన్లు'

-సబ్ రిజిస్ట్రార్ ఉమా కల్యాణి

'కురుపాం: డాక్యుమెంట్ రైటర్ల పెన్‌డౌన్ నేపథ్యంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా రిజిస్ట్రేషన్లు యథాతథంగా చేస్తున్నామని కురుపాం సబ్ రిజిస్ట్రార్ ఆర్.ఉమా కల్యాణి అన్నారు. ఆమె విలేకరులతో మాట్లాడుతూ కార్యాలయంలో ప్రత్యేకంగా హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేశామన్నారు. పబ్లిక్ డేటా ఎంట్రీ విధానం ద్వారా ప్రజలు తమ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లను తామే సిద్ధం చేసుకునే అవకాశం కూడా అందుబాటులో ఉందన్నారు. రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల ఏర్పాటు.. రిజిస్ట్రేషన్ శాఖ ప్రైవేటీకరణ చేయడం కాదని స్పష్టం చేశారు. రిజిస్ట్రేషన్ సేవలను మరింత వేగంగా, పారదర్శకంగా అందించేందుకు చేపట్టిన చర్యలు మాత్రమేనన్నారు. డాక్యుమెంట్ రైటర్ల పెన్ డౌన్ కారణంగా ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రిజిస్ట్రేషన్, ఇతర శాఖాపరమైన సేవలు అవసరమైన వారు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సంప్రదించ వచ్చని ఆమె సూచించారు.




అరకులో 3.65 కిలోల లిక్విడ్ గంజాయి స్వాధీనం



అరకులోయ: విశాఖపట్నం కేంద్రంగా పనిచేస్తున్న నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ) అధికారులు అరకులోయలోని ఒక ఇంట్లో సోదాలు చేసి 3.65 కిలోల లిక్విడ్ గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఒకరిని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా అరకులోయ పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో ఎన్‌సీబీ సీఐ కిరణ్‌బాబు మాట్లాడుతూ రాజమహేంద్రవరానికి చెందిన బెల్లపు కృష్ణమూర్తి అరకులోయలో నివాసం ఉంటూ గంజాయి వ్యాపారం చేస్తున్నాడన్నారు. అతనిపై గతంలో పలు కేసులు ఉన్నాయని, పక్కా సమాచారం రావడంతో నిఘా పెట్టామన్నారు. కృష్ణమూర్తి ఉంటున్న ఇంటిపై దాడి చేసి 3.65 కిలోల లిక్విడ్ గంజాయిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అతడి స్వస్థలమైన రాజమహేంద్రవరంలోని ఇంట్లో కూడా లిక్విడ్ గంజాయి ఉన్నట్టు విచారణలో తేలడంతో అక్కడి అధికారులు సోదాలు చేసి 1.5 కిలోలు స్వాధీనం చేసుకున్నారని చెప్పారు. రెండుచోట్ల పట్టుకున్న 5.15 కిలోల లిక్విడ్ గంజాయి విలువ సుమారు కోటి రూపాయలు ఉంటుందని తెలిపారు.

నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు

-తాగునీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా చూడాలి -జలజీవన్ పనుల్లో నాణ్యతను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తా -మెగా వాటర్ గ్రిడ్ పనులపై సమీక్షలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్



అమరావతి: ఎల్‌నినోతో వర్షాభావ పరిస్థితులు నెల కొంటున్నందున, నీటి ఎద్దడితో ప్రజలు ఇబ్బంది పడకుండా ఇప్పటి నుంచే ముందస్తు చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. తాగునీటి కొరత తీవ్రంగా ఉండే పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో జలజీవన్ మిషన్- అమరజీవి జలధార పథకంలో చేపడుతున్న మెగా వాటర్ గ్రిడ్ పనులు గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. రెండు జిల్లాల్లో మెగా వాటర్ గ్రిడ్ పథకాల పనుల పురోగతిపై గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులతో ఉప ముఖ్యమంత్రి మంగళగిరిలోని క్యాంప్ కార్యాలయంలో సమీక్షించారు. 'తాగునీటి సమస్యతో దశాబ్దాలుగా ఇబ్బంది పడుతున్న పల్నాడు, ప్రకాశం ప్రాంత ప్రజలకు మెగా వాటర్ గ్రిడ్ ప్రాజెక్టులు జీవనాధారంగా మారనున్నాయి. 10 నియోజకవర్గాల పరిధిలో 16 లక్షల మందికి పైగా ప్రజలకు శాశ్వత తాగునీటి భద్రత కల్పించే ఈ పనుల్లో అలసత్వానికి తావివ్వొద్దు. గడువులోగా పూర్తి చేసి, ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా నీటి సౌకర్యం అందుబాటులోకి తీసుకురావాలి. గ్రామాల మధ్య పైపులైన్ నిర్మాణం, అటవీ అనుమతుల వంటి సమస్యలు వెంటనే పరిష్కరించాలి. భుజం శస్త్రచికిత్స నుంచి పూర్తిగా కోలుకున్న తర్వాత పనుల పురోగతి పరిశీలించేందుకు క్షేత్రస్థాయిలో పర్యటిస్తా. పనుల నాణ్యత పరిశీలిస్తా' అని చెప్పారు. రూ.95 కోట్ల విలువైన పనుల పూర్తి: రెండు మెగా వాటర్ గ్రిడ్ ప్రాజెక్టుల్లో ఇప్పటి వరకు రూ.95 కోట్ల విలువైన పనులు పూర్తయినట్లు గ్రామీణ తాగునీటి సరఫరా ఇంజినీరింగ్ విభాగం అధికారులు ఉప ముఖ్యమంత్రికి తెలిపారు. 'రూ.1,290 కోట్ల అంచనాలతో ప్రారంభించిన పనుల్లో ఇంటేక్ వెల్ నిర్మాణం పనులు 40%కి పైగా పూర్తయ్యాయి. 119 మిలియన్ లీటర్ల నీటిశుద్ధి ప్లాంట్ పనులు, సంపులు, గ్రౌండ్ లెవెల్ బ్యాలెన్స్ రిజర్వాయర్ పనులు పురోగతిలో ఉన్నాయి. 53 కిలోమీటర్ల మేర పైపులైన్ నిర్మాణ పనులు పూర్తయ్యాయి' అని వివరించారు.

రాజకీయ లబ్ధికి రాహుల్ తాపత్రయం



దిల్లీ: రాహుల్ గాంధీకి విద్యార్థులపై ప్రేమ లేదని, ఆయన రాజకీయ లబ్ధి కోసం తాపత్రయ పడుతున్నారని కేంద్ర మంత్రి జేపీ నడ్డా విమర్శించారు. నీట్ పేపర్ లీక్‌పై ఆయన రాజకీయం చేస్తున్నారని ధ్వజమెత్తారు. పార్లమెంటులో సమగ్ర చర్చ జరుపుదామని, శాశ్వత పరిష్కారం కనుగొందామని ఆయన ప్రతిపక్షాలకు పిలుపునిచ్చారు. భాజపా ప్రధాన కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రధాని మోదీ ప్రభుత్వం.. ఈ విషయంలో బాధ్యతాయుతంగా వ్యవహరిస్తోందని నడ్డా తెలిపారు. పేపర్ లీక్ అంశంపై దర్యాప్తు జరుగుతోందని, ప్రజలు లేవనెత్తే ప్రతి అంశానికీ ప్రభుత్వం జవాబిస్తుందని పేర్కొన్నారు. 'కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో పేపర్ లీక్‌ల గురించి రాహుల్ గాంధీ ఎందుకు మాట్లాడలేదు? దీనిని బట్టి ఆయన ఉద్దేశం అర్థమవుతోంది. ఆయనకు విద్యార్థులపై ప్రేమ లేదు. రాజకీయ మైలేజీ కోసమే ఆయన తాపత్రయం. ఇది దురదృష్టకరం' అని నడ్డా వ్యాఖ్యానించారు.

మ్యుటేషన్ దరఖాస్తులు నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి

-రెవెన్యూ క్లినిక్ లో వచ్చిన అర్జీలపై క్షేత్ర స్థాయిలో విచారణ చేసి సత్వరమే పరిష్కరించాలి -జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్



అనకాపల్లి: మ్యుటేషన్ దరఖాస్తులు ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్ఎల్ఏ లో ఉండకుండా నిర్ణీత గడువులోనే పరిష్కరించాలని డి.ఆర్వో, ఆర్డీఓలు, తహసీల్దార్లను జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ ఆదేశించారు. మధ్యాహ్నం కలక్టరేట్ సమావేశ మందిరంలో రెవెన్యూ, సర్వే మరియు భూమి రికార్డులు, పౌర సరఫరాల శాఖల పై మండల, డివిజన్ ల వారిగా మరియు గ్రామ వార్డు సచివాలయల సర్వీస్ లు, రెవెన్యూ క్లినిక్, మ్యుటేషన్లు, పి జి ఆర్ ఎస్ లలో వచ్చిన అర్జీల పై జాయింట్ కలెక్టర్ శౌర్యమాన్ పటేల్ తో కలిసి జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు ప్రతి రోజు క్షేత్ర స్థాయిలో మానిటరింగ్ చేసి, రెవెన్యూ సేవలలో ఆలస్యం లేకుండా ప్రజలకు త్వరితగతిన సేవలు అందించాలన్నారు. ప్రభుత్వ భూములను పరిరక్షిస్తూ, ఆక్రమణలను నివారించేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో వివాదరహిత భూ రికార్డులు, బాధ్యతాయుత రెవెన్యూ పరిపాలన కోసం అధికారులు మరింత చురుకుగా పనిచేయాలన్నారు. ఆన్లైన్ సేవలు, భూ వ్యాపింగ్, రికార్డులు అప్డేషన్, మ్యుటేషన్ దరఖాస్తులు వంటి సమస్యలపై కార్యాచరణ ప్రణాళిక తయారుచేసుకొని పరిష్కరించాలన్నారు. లోపాలు ఉన్న చోట వెంటనే సరిదిద్దాలని, నిర్ణీత సమయంలో నివేదికలు సమర్పించాలన్నారు. పిజిఆర్ఎస్, రెవిన్యూ క్లినిక్ లలో ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే విచారణ చేయాలన్నారు. సమావేశంలో డి.ఆర్వో వై. సత్యనారాయణ రావు, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్లు కె.మనోరమ, అనిత, సుబ్బలక్ష్మి , జిల్లా పౌర సరఫరాల అధికారి మూర్తి, అనకాపల్లి, నర్సీపట్నం ఆర్డీఓలు షేక్ అయిషా, వి వి రమణ, ఎడి సర్వే గోపాలరాజా, అన్ని మండలాల తహసీల్దార్లు, సర్వేయర్లు, కలక్టరేట్ మేజిస్ట్రియల్, కో ఆర్డినేషన్, భూ వ్యవహారాల పర్యవేక్షకులు, తదితరులు పాల్గొన్నారు.

నిధుల వినియోగం, పథకాల అమలులో పారదర్శకత పాటించాలి

-విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన మౌలిక వసతులు కల్పించాలి -కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే ఆర్థిక ఫలాలు గిరిజనులకు అందించాలి -ఏపీ శాసన సభ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ పులపర్తి ఆంజనేయులు



విశాఖపట్నంః ప్రభుత్వ నిధుల వినియోగం, సంక్షేమ పథకాల అమలు విషయంలో పారదర్శకత పాటించాలని, జవాబుదారీతనంతో కూడిన విధానాలు అవలంబించాలని ఏపీ శాసన సభ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ పులపర్తి ఆంజనేయులు పేర్కొన్నారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా విశాఖపట్టణం విచ్చేసిన కమిటీ ఏయూ పరిధిలోని ఐఐఎం భవనంలో ఏయూ, గిరిజన సంక్షేమ శాఖ అధికారులతో ప్రత్యేకంగా సమావేశమై వివిధ అంశాలపై సమీక్షించింది. 2014-19 కాలంలో జరిగిన కార్యక్రమాలు, ఆడిట్ నివేదికల్లో పేర్కొన్న అభ్యంతరాలపై ఆయా శాఖల అధికారులను వివరణ కోరింది. సందేహాలను నివృత్తి చేసుకోవటంతో పూర్తి వివరాలను అడిగి తెలుసుకుంది. ఏయూ పరిపాలనా విధానాల్లో అవలంబిస్తున్న పద్ధతులు, గిరిజన సంక్షేమ శాఖలో నిధుల వినియోగం గురించి ఆరా తీసిన కమిటీ పలు అంశాలపై తగిన మార్గదర్శకాలు జారీ చేసింది. సమీక్ష అనంతరం మాట్లాడిన ఛైర్మన్ పులపర్తి ఆంజనేయులు విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడంతో పాటు ఉపాధ్యాయులు-విద్యార్థుల నిష్పత్తిని మెరుగుపరచాలని సూచించారు. విలువలతో కూడిన నాణ్యమైన విద్యను అందించాలని, రాష్ట్రానికి, దేశానికి ఉపయోగపడే ఉత్తమ పౌరులను తీర్చిదిద్దాలని హితవు పలికారు. కెరీర్ కౌన్సెలింగ్, మార్గదర్శకత్వం అందించాలని, ఉన్నత విద్య, నైపుణ్యాభివృద్ధి, పోటీ పరీక్షలకు అవసరమైన శిక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పాఠ్యాంశాలతో పాటు కమ్యూనికేషన్, సాఫ్ట్ స్కిల్స్, ప్రాక్టికల్ నాలెడ్జ్‌ను పెంపొందించే కార్యక్రమాలను చేపట్టాలన్నారు. వీలైతే ఇంజనీరింగ్ విద్యార్థులకు పోలవరం, అమరావతిలో జరుగుతున్న నిర్మాణాలను చూపించాలన్నారు. విద్యార్థుల్లో పరిశోధనా దృక్పథాన్ని పెంపొందించేందుకు పరిశోధన కార్యకలాపాలను ప్రోత్సహించాలని, స్కాలర్‌షిప్‌లు, ఫెలోషిప్‌లు, ఇతర ఆర్థిక సహాయ పథకాలపై అవగాహన కల్పించాలని చెప్పారు. నూతన కోర్సులను ప్రవేశపెట్టడంతో పాటు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యా కార్యక్రమాలను రూపొందించాలని సూచించారు. కళాశాలల్లో ఎస్సీ, ఎస్టీ సెల్‌లను సమర్థవంతంగా నిర్వహించాలని, లింగ సమానత్వం, విద్యార్థుల సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు, పారిశుద్ధ్యం, భద్రతా చర్యలు అందుబాటులో ఉండేలా చూడాలని చెప్పారు. ఏయూ వెబ్సైట్ పేజీ సమర్థంగా నిర్వహించటంతో పాటు, సోషల్ మీడియాను ఫాలో అవ్వాలని, విద్యార్థులకు తాజా సమాచారం అందించాలని సూచించారు. ఏయూలాంటి సరస్వతీ నిలయంలో అధికారులందరితో కలిసి సమీక్ష చేయటం సంతోషంగా ఉందని ఛైర్మన్ చివరిగా పేర్కొన్నారు.

గిరిజనులకు సేవ చేయటమంటే.. దేవుడికి చేసినట్లే ....గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న ఆర్థిక సహాయ పథకాల వివరాలను సమీక్షించిన ఛైర్మన్, అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు పూర్తిస్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పథకాల అమలులో జాప్యం లేకుండా, ట్రైకార్ నిధులను సక్రమంగా వినియోగించేలా అధికారులు పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. గిరిజనులకు సేవ చేయటమంటే.. దేవుడికి చేసినట్లే అని పేర్కొంటూ వారికి అన్ని విధాలుగా తోడ్పాటు అందించాలని సూచించారు. అందరికీ న్యాయం జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు, బర్త్ సర్టిఫికేట్లు తప్పకుండా అందించాలని పేర్కొన్నారు. సాంకేతిక కారణాలతో వారికి వచ్చే పథకాలను, ఆర్థిక ఫలాలను అడ్డుకోవద్దని హితవు పలికారు. సమావేశంలో సభ్యులు పి. విష్ణుకుమార్ రాజు, అరిమిల్లి రాధాకృష్ణ, బూర్ల రామాంజనేయులు, శ్రీరామ్ రాజగోపాల్, కోళ్ల లలిత కుమారి, అసెంబ్లీ జాయింట్ సెక్రటరీ ఎం. విజయ్ రాజు, డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ సాయికృష్ణ, ఏయూ వీసీ జి.పి. రాజశేఖర్, రిజిస్ట్రార్ కె. రాంబాబు, రెక్టార్ పి. కింగ్, ట్రైకార్ ఎండీ మణికుమార్, డీటీడబ్ల్యూవో సురేశ్ కుమార్, ఏయూలోని వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జీవీఎంసీలో 25 మంది ఉద్యోగులకు పదోన్నతి

-పదోన్నతి ఉత్తర్వులను అందజేసిన జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్



విశాఖపట్నం: మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ లో 6 గురు జూనియర్ అసిస్టెంట్లకు సీనియర్ అసిస్టెంట్లుగా, 19 మందికి జూనియర్ అసిస్టెంట్లకు పదోన్నతిని కల్పిస్తూ ఉత్తర్వులను జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ తన చాంబర్లో అందించి వారికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పదోన్నతులను రోస్టర్ ప్రకారం అర్హత కలిగిన ఆరుగురు జూనియర్ అసిస్టెంట్లకు సీనియర్ అసిస్టెంట్లుగా , వివిధ కేడర్లలో ఉన్న 19 మందికి జూనియర్ అసిస్టెంట్లకు పదోన్నతిని కల్పిస్తూ ఉత్తర్వులను అందించామన్నారు. జీవీఎంసీలో ఎంతో బాధ్యతగా చిత్తశుద్ధితో విధులు నిర్వహించేందుకు తగు శిక్షణ నైపుణ్యతను పెంపొందించుకోవాలని పదోన్నతి పొందిన ఉద్యోగులకు సూచించారు. మీలో ఎంతమందికి కంప్యూటర్ పరిజ్ఞానం ఉందని వారిని అడిగి తెలుసుకుని ప్రతి ఒక్కరూ కంప్యూటర్ నైపుణ్యతను అలవర్చుకోవాలని, ప్రభుత్వ విధుల్లో రూల్ పొజిషన్లు తెలుసుకోవాలని, ఉన్నత పదోన్నతులను పొందాలని వారికి సూచించారు. జీవీఎంసీలో ఏ విభాగంలో మీకు స్థానం కల్పించినా అక్కడ తప్పని సరిగా విధులు నిర్వహించేలా డ్రాఫ్టింగ్ పరిజ్ఞానం పెంపొందించుకోవాలన్నారు. తప్పనిసరిగా మీ విధులలో చిత్తశుద్ధిని కనపరుస్తూ బాధ్యతగా విధులు నిర్వహిస్తూ జీవీఎంసీ కి మంచి పేరును తీసుకురావాలని వారికి కమిషనర్ సూచించారు. విధులలో అశ్రద్ధ కనపరిచినా, అవినీతికి పాల్పడిన వెంటనే విధుల నుండి తొలగిస్తామని కమిషనర్ వారికి తెలిపారు. ఇప్పుడు పదోన్నతులు పొందిన వారికి అన్ని విభాగాల్లో వారు విధులు నిర్వహించేలా కొన్ని రోజులు పాటు అవసరమగు శిక్షణను ఇప్పించాలని జీవీఎంసీ అదనపు కమిషనర్ పీఎం.సత్యవేణికి కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ అడ్మినిస్ట్రేటివ్ అధికారి పి పద్మజ, పర్యవేక్షకులు రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

భోగాపురం విమానాశ్రయాన్ని ప్రారంభించండి

-ప్రధాని మోదీకి సీఎం చంద్రబాబు ఆహ్వానం -గోదావరి-కావేరి అనుసంధానంపై కేంద్రమంత్రి పాటిల్‌తో చర్చ



దిల్లీ: భోగాపురం విమానాశ్రయాన్ని ఆగస్టు 1న ప్రారంభించాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీని సీఎం చంద్రబాబు కోరారు. ఆయన పార్లమెంటు భవనంలోని ప్రధాని కార్యాలయంలో నరేంద్రమోదీని కలిసి అధికారికంగా ఆహ్వానించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పీపీపీ పద్ధతిలో హైదరాబాద్‌లో గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయానికి దివంగత ప్రధాని వాజ్‌పేయీ అనుమతులిస్తే, ఇప్పుడు భోగాపురం విమానాశ్రయం మీ హయాంలో పురుడు పోసుకొని ప్రారంభోత్సవానికి సిద్ధమైందని వివరించారు. అందుకు ప్రధాని మోదీ సంతోషం వ్యక్తం చేస్తూ ప్రారంభోత్సవానికి వస్తానని హామీ ఇచ్చారు. ఉదయం 11 గంటలకు కేంద్రమంత్రులు రామ్మోహన్ నాయుడు, శ్రీనివాసవర్మ, ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, కలిశెట్టి అప్పలనాయుడితో కలిసి ప్రధాని కార్యాలయానికి వెళ్లిన ముఖ్యమంత్రి కొద్దిసేపు అందరితో కలిసి ప్రధానితో సంభాషించారు. అనంతరం వారిద్దరే ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సమావేశం 50 నిమిషాలు సాగింది. ప్రధానితో జరిగిన భేటీ గురించి సంతోషం వ్యక్తం చేస్తూ చంద్రబాబు తర్వాత ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

నదుల అనుసంధానానికి సీఆర్ పాటిల్ సానుకూలం....గోదావరి-కావేరి నదుల సంధానంపై కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో సీఎం చంద్రబాబు సుదీర్ఘంగా చర్చించారు. ప్రస్తుత ఎల్‌నినోలోనూ గోదావరి నుంచి 2వేల టీఎంసీల నీరు సముద్రం పాలవుతున్న నేపథ్యంలో వాటిని సద్వినియోగం చేసుకోవడానికి నదుల అనుసంధానాన్ని వేగవంతం చేయాలని కోరారు. అందుకు సానుకూలంగా స్పందించిన కేంద్రమంత్రి పాటిల్.. దీనిపై రెండువారాల్లో భాగస్వామ్య రాష్ట్రాలతో సమావేశం ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఇదే సమయంలో అధికారులు ఇప్పటివరకూ తమ వద్ద ఉన్న ప్రతిపాదన గురించి చంద్రబాబుకు వివరించారు. పోలవరం-బనకచర్ల ప్రాజెక్టును ప్రతిపాదించాక.. కావేరి వరకు నదుల అనుసంధానం చేయొచ్చన్న ఆలోచన వచ్చిందని పేర్కొన్నారు. గోదావరి ప్రాజెక్టును శ్రీకాకుళం జిల్లావరకూ తీసుకెళ్లాలని కేంద్రమంత్రిని సీఎం చంద్రబాబు కోరారు. పోలవరం ఎడమ ప్రధానకాలువ విశాఖపట్నం వరకు వెళ్తుందని, అక్కడి నుంచి మరో వంద కిలోమీటర్లు పొడిగిస్తే శ్రీకాకుళం జిల్లాకు నీరు అందించొచ్చని అభిప్రాయపడ్డారు. అయితే, దీనికి ఒడిశా వాళ్లు అభ్యంతరం చెప్పడమో, లేదంటే వాటా కోరడమో చేస్తారని అధికారులు పేర్కొన్నారు. ఇప్పుడు వివాదాల్లేకుండా గోదావరి-కావేరి అనుసంధానం పూర్తిచేసి కావాలంటే ఆ తర్వాత దాన్ని మెరుగు పరుద్దామని సూచించారు. పోలవరం స్టాప్ వర్క్ ఆర్డర్‌ను శాశ్వతంగా రద్దు చేయాలి.....పోలవరం ప్రాజెక్టు పనులను ఆపాలని కేంద్ర పర్యావరణ, అటవీశాఖ 2011 ఫిబ్రవరిలో జారీచేసిన ఉత్తర్వులను స్తంభింపజేస్తూ ఏటా ఉత్తర్వులు తెచ్చుకోవాల్సి రావడం ప్రాజెక్టు పనులకు అడ్డంకిగా మారిందని సీఆర్ పాటిల్‌కు చంద్రబాబు చెప్పారు. స్టాప్ వర్క్ ఆర్డర్‌ను శాశ్వతంగా రద్దుచేయాలని కోరారు. దీనిపై తాను పర్యావరణ, అటవీశాఖకు లేఖ రాస్తానని పాటిల్ హామీ ఇచ్చారు. ప్రాజెక్టును పూర్తిస్థాయిలో నిర్మిస్తున్నా, ముంపు సమస్య కారణంగా 41.15 మీటర్ల వరకే నీళ్లు నిలబెట్టాల్సి వస్తుందని, అందువల్ల ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లతో మాట్లాడి ముంపు సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలన్న ముఖ్యమంత్రి విజ్ఞప్తిపైనా కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారు. పార్లమెంటు సమావేశాల తర్వాత పోలవరం రావాలని సీఆర్ పాటిల్‌ను సీఎం ఆహ్వానించారు.

పంచదార్ల కొండపై అక్రమ మైనింగ్.. సమగ్ర విచారణకు పవన్ ఆదేశం



అమరావతి: అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలంలోని పంచదార్ల కొండ రెవెన్యూ భూముల్లో అక్రమ మైనింగ్‌పై డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ విచారణకు ఆదేశించారు. ఈ వ్యవహారంపై అనకాపల్లి జిల్లా కలెక్టర్, కాలుష్య నియంత్రణ మండలి అధికారులతో ఆయన మాట్లాడారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి నివేదిక సమర్పించాలని కాలుష్య నియంత్రణ మండలి అధికారులను ఆదేశించారు. కలెక్టర్ ఇచ్చిన ప్రాథమిక నివేదికను పరిశీలించి.. తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. మైనింగ్ అనుమతులు పొందిన సంస్థ నిబంధనల ఉల్లంఘనకు పాల్పడినట్టు ప్రాథమిక ఆధారాలు ఉన్నందున జరిమానా విధించడంతో పాటు కఠిన చర్యలు తీసుకోవాలని పవన్ స్పష్టం చేశారు. పంచదార్ల కొండ దిగువన ఉన్న శ్రీఉమా ధర్మలింగేశ్వర స్వామి వారి ఆలయం, సహజ జలధారల ప్రాముఖ్యాన్ని దృష్టిలో ఉంచుకుని సంరక్షణ చర్యలు చేపట్టాలని పవన్ సూచించారు. జలధారల రంగు మార్పుపై జాతీయ జలవిజ్ఞాన సంస్థ శాస్త్రవేత్తలను ఆహ్వానించాలన్నారు. జలధారల మూలాలను పరిశీలించి, సహజ ప్రవాహ సంరక్షణకు సంబంధించిన శాస్త్రీయ నివేదికలు తీసుకోవాలని చెప్పారు. నిబంధనలు ఉల్లంఘించిన సంస్థపై జరిమానాతోపాటు పర్యావరణ పునరుద్ధరణ బాధ్యత కూడా వేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పంచదార్ల కొండ పరిసరాలను నో మైనింగ్ జోన్‌గా ప్రకటించాలని రెవెన్యూ, మైనింగ్ శాఖలకు పవన్ సూచించారు. ఆ మైనింగ్ సంస్థకు ఇచ్చిన పర్యావరణ అనుమతులను తక్షణమే రద్దు చేయాలని ఆదేశించారు.

రైల్వే భూముల్లో నివసిస్తున్న వారికీ పట్టాలు

-కేంద్రంతో సంప్రదింపులు జరుపుతున్నాం: మంత్రి లోకేశ్



మంగళగిరి: 'ఇచ్చిన హామీని నెరవేర్చడంలో భాగంగా వివిధ శాఖలను ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ.. పేదలకు ఇళ్ల పట్టాలు అందిస్తున్నాం. రైల్వే భూముల్లో దశాబ్దాలుగా నివాసం ఉంటున్న పేదలకూ పట్టాలు ఇస్తాం. అందుకోసం కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతున్నాం' అని విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేశ్ చెప్పారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ హాల్లో పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం రెండోరోజైన పండగ వాతావరణంలో కొనసాగింది. ప్రభుత్వ, నిషేధిత భూముల్లో నివాసం ఉండే 1,303 మందికి అనుభవ పత్రాలు, ఇళ్ల పట్టాలను లోకేశ్ పంపిణీ చేశారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 3.30 వరకు కార్యక్రమం కొనసాగగా అంతసేపూ లోకేశ్ ఓపిగ్గా నిలబడి పాల్గొన్నారు. వేదికపైకి రాలేని స్థితిలో ఉన్న వారికి.. కిందికి వెళ్లి మరీ పట్టాలను ఇచ్చారు.

'తల్లికి వందనం' కోసం ఏటా రూ.10 వేల కోట్లు.....'పిల్లలే మన సంపద.. చదువే తరగని ఆస్తి. ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుతుంటే అంతమందికీ తల్లికి వందనం పథకాన్ని అమలు చేస్తున్నాం. అందుకోసం ప్రభుత్వం ఏటా రూ.10 వేల కోట్లు ఖర్చు చేస్తోంది. తల్లుల ఖాతాల్లో నిధుల జమ ఈరోజు మొదలైంది. 24 వరకు జమ అవుతాయి' అని లోకేశ్ చెప్పారు.

పాఠశాల విద్యార్థులకు వీడియో పోటీ...రాష్ట్రప్రభుత్వం 'తల్లికి వందనం' పథకాన్ని అమలుచేస్తున్న నేపథ్యంలో సమగ్ర శిక్షాభియాన్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు వీడియో పోటీ నిర్వహిస్తున్నారు. ఒకటి నుంచి పదో తరగతి వరకు చదివే విద్యార్థులు తమ అమ్మపై ఉన్న ప్రేమను చాటేలా 60 సెకన్ల వీడియో రికార్డు చేసి అప్‌లోడ్ చేస్తే వాటిలో బాగున్న వీడియో చేసిన చిన్నారులకు లోకేశ్‌ను కలిసే అవకాశం లభిస్తుందని ప్రకటించారు.

ఉద్యోగుల సమస్యలన్నీ సీఎం దృష్టికి..

-సాధ్యమైనంత వరకు పరిష్కరించేందుకు కృషి -ఉద్యోగ సంఘాల నేతలతో మంత్రివర్గ ఉపసంఘం -పీఆర్సీ ఏర్పాటు చేసి, ఐఆర్ ప్రకటించి.. పెండింగ్ బకాయిలు -చెల్లించాలని సంఘాల డిమాండ్



అమరావతి: ఉద్యోగుల సమస్యలను సాధ్యమైనంత వరకు పరిష్కరించేందుకు ప్రభుత్వం అన్నివిధాలా ప్రయత్నిస్తోందని మంత్రివర్గ ఉపసంఘం స్పష్టం చేసింది. సచివాలయంలో ఉద్యోగుల సమస్యలపై ఉద్యోగ సంఘాల నాయకులతో మంత్రివర్గ ఉపసంఘం సమావేశమైంది. 5 గంటల పాటు ఉద్యోగుల సమస్యలను తెలుసుకుంది. సమావేశం అనంతరం ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ..'21 ఉద్యోగుల సంఘాల నుంచి వచ్చిన అన్ని సమస్యలను తెలుసుకున్నాం. వాటన్నింటినీ సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తాం. పీఆర్సీ ఏర్పాటు, ఐఆర్, పెండింగ్ డీఏలు, ఇతర పెండింగ్ బిల్లులు సకాలంలో చెల్లించాలనే డిమాండ్లు అన్ని ఉద్యోగ సంఘాల నుంచి వచ్చాయి. ఉద్యోగుల పట్ల సానుకూల దృక్పథంతోనే ప్రభుత్వం ఓపీఎస్ అమలు చేసింది. ప్రభుత్వ రంగ సంస్థల్లో పని చేసే వారికి పదవీవిరమణ వయసును పెంచింది. గత ప్రభుత్వం నుంచి వారసత్వంగా వచ్చిన అప్పుల భారం నుంచి రాష్ట్రాన్ని ఏవిధంగా బయటకు తేవాలనే దానిపై సీఎం నిరంతరం శ్రమిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం తగిన సహాయం అందిస్తోంది' అని తెలిపారు. ఈ సమావేశానికి మంత్రులు సత్యకుమార్ యాదవ్, అనగాని సత్యప్రసాద్, నాదెండ్ల మనోహర్, సీఎస్ సాయి ప్రసాద్ హాజరయ్యారు. సమావేశంలో మాట్లాడిన వివరాలను సంఘాల నాయకులు తెలియజేశారు.

గిరిజనులకు జీవో-3పై త్వరలో సీఎం చంద్రబాబు వరం



-ఆదివాసీల ప్రయోజనాల్ని కాపాడేలా కూటమి ప్రభుత్వం ముందుకు -గిరిజన సంఘాల నేతలతో మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

అమరావతి: గిరిజనులకు జీవో-3 అమలుపై సీఎం చంద్రబాబు త్వరలో వరం ఇవ్వబోతున్నారని గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. ఏజెన్సీలోని ఉపాధ్యాయ నియామకాల్లో పోస్టులన్నీ స్థానిక గిరిజనులకే దక్కేలా ఉద్దేశించిన ఈ జీవో ప్రయోజనాల్ని కూటమి ప్రభుత్వం కాపాడుతోందన్నారు. 'జీవో-3కి అమలుకు మేం వ్యతిరేకం కాదు. దీన్ని యథాతథంగా మళ్లీ అమలుచేస్తే సుప్రీంకోర్టులో నిలబడదు. జీవోను తేవడం ఎంత ముఖ్యమో.. స్థిరంగా కొనసాగేలా చూసుకోవడం కూడా అంతే ప్రధానం. అందుకే దీనిపై న్యాయనిపుణులతో ప్రభుత్వం చర్చించింది. త్వరలోనే జీవో-3 ఫలాలను భావితరాలకు అందిస్తాం. 1/70 చట్టం అమలుపై ప్రభుత్వం తరఫున న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేయబోతున్నాం' అని స్పష్టంచేశారు. గిరిజనుల సమస్యల పరిష్కారానికి మంత్రి అధ్యక్షతన ప్రజాప్రతినిధులు, అధికారులు, ఆదివాసీ సంఘాల నేతలతో విజయవాడలోని గిరిజన సంక్షేమశాఖ డైరెక్టరేట్ కార్యాలయంలో బుధవారం సమావేశమయ్యారు. 4 గంటలపాటు సుదీర్ఘ చర్చ జరిగింది.

చట్టం రూపంలో తీసుకురావాలి....గిరిజనులకు ఉద్దేశించిన చట్టాన్ని మార్చకుండా నిబంధనలు మారుస్తూ జీవో-3 తీసుకురావడం వల్ల సుప్రీంకోర్టులో ఇది నిలబడలేదని, ఈసారి జీవో రూపంలో కాకుండా చట్టం రూపంలో తీసుకురావాలని మెజారిటీ సంఘాలు అభిప్రాయపడ్డాయి. రాజ్యాంగంలోని 5(1)(బీ)లో చేరిస్తే రక్షణ ఉంటుందని ప్రతిపాదించారు. జనాభా ప్రాతిపదికన అమలుచేస్తే కోర్టు కొట్టేసే అవకాశముందని తెలిపారు. జాతీయ గిరిజన పాలసీ, పీసా చట్టం, కేంద్ర న్యాయచట్టాన్ని ప్రాతిపదికగా తీసుకుని కొత్త చట్టాన్ని రూపొందించాలని ఆదివాసీ గిరిజన సంఘం నాయకుడు శ్రీనివాస్ తెలిపారు. సుప్రీంకోర్టులో వైకాపా ప్రభుత్వం సరైన వాదనల్ని వినిపించకపోవడమే జీవో-3 రద్దుకు కారణమని ఆదివాసీ జేఏసీ నాయకుడు ముడియం శ్రీనివాస్ వెల్లడించారు. ఎల్‌టీఆర్ చట్టం అమలులో ఎస్‌డీసీలు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని భారత ఆదివాసీ సంఘం నేత రాజబాబు పేర్కొన్నారు.

22ఏ భూముల నిబంధనలపై కొత్త జీవో

-మంత్రి అనగాని సత్యప్రసాద్



అమరావతి: నిషేధిత జాబితా (22ఏ) నుంచి భూములను తొలగించే నిబంధనలను సరళీకృతం చేస్తూ నేడు కొత్త జీవో తీసుకొస్తున్నామని ఏపీ రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. ఆ జాబితాలో భూములు నమోదు చేసే నిబంధనలను కఠినతరం చేసినట్లు చెప్పారు. ఇకపై 22ఏ నిర్వహణ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఐజీ పరిధిలో ఉంటుందని చెప్పారు. గ్రామ కంఠం, పట్టా భూములను నిషేధిత జాబితాలో చేర్చకూడదన్నారు. వ్యవసాయ భూములకు వెబ్‌ల్యాండ్ 2.0 ప్రామాణికంగా ఉంటుందని.. ఏవిధమైన మాన్యువల్ ఎంట్రీలు ఉండవని స్పష్టం చేశారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో అనగాని మాట్లాడారు. "18.06.1954 కంటే ముందు అసైన్ చేసిన అన్ని భూములు నిషేధిత ఆస్తుల జాబితా నుంచి తొలగిస్తున్నాం. కొత్త ఉత్తర్వులు జారీ అయిన 90రోజులలోపు సాఫ్ట్‌వేర్‌లో మార్పులను ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ (ఐజీఆర్ఎస్), సీసీఎల్ఏ (చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్) పూర్తిచేయాలి. తన భూమి ప్రభుత్వ భూమి కాదని నిరూపించుకోవాల్సిన బాధ్యత పౌరులు, భూ యజమానులపై ఉండదు. దీనికి ప్రభుత్వమే బాధ్యత వహిస్తుంది. ఏ కారణంగానైనా భూ యజమాని హక్కులకు భంగం కలిగితే దానికి సంబంధిత అధికారినే బాధ్యుడిగా భావించి తదుపరి చర్యలు తీసుకుంటాం. 22ఏ జాబితాలో పెట్టాలని ప్రతిపాదించిన ప్రతి ఫైల్‌కు సంబంధించిన సమాచారాన్ని ప్రజలు తెలుసుకునేందుకు వీలుగా పబ్లిక్ ఇన్‌క్లూజన్ రిజిస్టర్‌ను ఐజీఆర్ఎస్ నిర్వహిస్తుంది. ఏదైనా భూమి అన్యాక్రాంతం కాబోతోందనే సమాచారంతో ఎమర్జెన్సీగా 22ఏ జాబితాలో పెట్టాలంటే 60 రోజుల్లోపే ఆ ప్రక్రియను పూర్తిచేయాలి. ఆలోపు సంబంధిత పౌరుడికి 30 రోజుల గడువుతో నోటీసు ఇవ్వాలి. 60 రోజుల్లో ఎమర్జెన్సీ కేటగిరీ కింద 22ఏ జాబితాలో చేర్చకపోతే ఆ భూమి పట్టా భూమిగానే ఉంటుంది" అని అనగాని సత్యప్రసాద్ వివరించారు.

బాధిత కుటుంబానికి యాదవ సంఘం నుండి రూ.3 లక్షలు

-కొలుసు పెదరెడ్డయ్య యాదవ్ ఛారిటబుల్ ట్రస్ట్ తరపున రూ.2 లక్షలు -దానయ్య కుటుంబానికి మంత్రి పరామర్శ -గొర్రెల కాపరుల సమాజానికి అండగా ఉంటాం.. దానయ్య కుటుంబానికి గృహ నిర్మాణం, పిల్లల చదువుల బాధ్యత తీసుకుంటాం -రాష్ట్ర గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి



శ్రీకాకుళం: ఇటీవల రహదారి ప్రమాదంలో దురదృష్టవశాత్తు ప్రాణాలు కోల్పోయిన దుబ్బ దానయ్య కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం, కూటమి నాయకులు అన్నివిధాలా అండగా ఉంటారని రాష్ట్ర గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, పలాస శాసనసభ్యురాలు గౌతు శిరీష స్పష్టం చేశారు. ఈ నెల 10వ తేదీన జరిగిన మోటారు బైక్ ప్రమాదంలో దుబ్బ దానయ్య మృతి చెందిన నేపథ్యంలో పలాసలోని మృతుడి నివాసానికి వెళ్లిన మంత్రి, ఇచ్ఛాపురం, పలాస శాసన సభ్యులు బాధితులను స్వయంగా పరామర్శించి తీవ్ర సానుభూతిని తెలిపారు. కుటుంబ సభ్యులను ఓదార్చి వారిలో ధైర్యం నింపారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ.. ప్రమాదం జరిగిన వెంటనే పార్టీ స్పందించి రూ.10 లక్షల పరిహారాన్ని ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ ఆర్థిక సాయానికి అదనంగా, బాధిత కుటుంబాన్ని వ్యక్తిగతంగా ఆదుకోవాలనే ఉద్దేశంతో తమ తండ్రి, మాజీ పార్లమెంట్ సభ్యులైన కొలుసు పెదరెడ్డయ్య యాదవ్ ఛారిటబుల్ ట్రస్ట్ నుండి రూ.2 లక్షలు, యాదవ సంఘం నుండి రూ.3 లక్షలు ఈ ఐదు లక్షల రూపాయలు పార్టీ తరపున ఆర్థిక సహాయాన్ని ఎమ్మెల్యే గౌతు శిరీష చేతుల మీదుగా బాధిత కుటుంబానికి అందజేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ "నేను కూడా ఒక గొర్రెల కాపరి కుటుంబం నుంచే వచ్చి, భగవంతుని, సమాజపు ఆశీస్సులతో ఈ స్థాయికి చేరుకున్నట్లు చైప్పారు.. సోదరి గౌతు శిరీష వ్యక్తపరిచిన ఆవేదనను, బాధను ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలన్నారు. ఒక సెంట్ భూమి కూడా లేకుండా, కూలీతో బతుకుతున్న ఒక నిరుపేద కుటుంబంలో ప్రమాదం వల్ల జరిగిన నష్టం పూడ్చలేనిదన్నారు. ఇక్కడికి వచ్చి, నిరుపేద కుటుంబం గురించి కనీస ప్రస్తావన చేయకుండా, ప్రమాదం చేసి మరణానికి కారణమైన 18 సంవత్సరాలు నిండిన మేజర్ యువకుడి గురించి మాట్లాడారంటే, ఆ పార్టీ డిఎన్ఏ ఎటువంటిదో ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలి" అని ఘాటుగా విమర్శించారు. రోడ్డు ప్రమాదాలు జరిగితే చట్టం తన పని తాను చేసుకుపోతుందని, కానీ ఒక తండ్రిగా తన కొడుకుని తప్పించేందుకు వేరే వ్యక్తిని తెచ్చి నిలబెట్టడం చట్టానికి ఆమోదయోగ్యమా అని మంత్రి ప్రశ్నించారు. అటువంటి వ్యక్తులు రేపు అధికార స్థానాల్లోకి వస్తే పరిస్థితులు ఎంత ఘోరంగా ఉంటాయో ప్రజలు ఆలోచించాలని కోరారు. 'సెంట్ భూమి లేని గొర్రెల కాపరి కుటుంబానికి తప్పు జరిగింది, ఆదుకోవాలి' అని కనీసం ఒక్క మాటైనా అనకపోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వ సహాయ చర్యలను వివరిస్తూ.. "ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ కుటుంబాన్ని వదిలేయదని, వారికి ఇల్లు, భూమి లేకపోవడంతో, ఎమ్మెల్యే శిరీష స్థలం కేటాయించగానే గృహ నిర్మాణ శాఖ ద్వారా వెంటనే పక్కా ఇల్లు నిర్మిస్తామన్నారు. పిల్లల చదువుల పూర్తి బాధ్యతను మేమందరం చూసుకుంటామన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో బలహీన వర్గాల సంక్షేమానికి మా ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. అనంతరం పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ దానయ్య చనిపోయింది ఒక కటిక నిరుపేద అని తెలిసి ప్రతి ఒక్కరూ సాయం చేసేందుకు ముందుకు వస్తున్నట్లు చెప్పారు. ఒక ప్రాణం తీసి, రోడ్డుపై అనాథ శవంలా పడేసి వెళ్లిపోయారన్నారు. ఇద్దరు కొడుకులను పోగొట్టుకున్న ముసలి తల్లి, భర్తను కోల్పోయి అనాథగా మారిన భార్య, తండ్రి పేరే తెలియని చిన్న పిల్లల బాధలు వారికి కనిపించడం లేదా? సరిగా ప్రింటింగ్ కూడా రాని కొన్ని పేపర్లు, యూట్యూబ్ ఛానళ్లు నిజాన్ని కప్పిపుచ్చి తప్పుడు ప్రచారాలు చేస్తున్నట్లు చెప్పారు. ఒక యూ ట్యూబ్ ఛానళ్లలో కూడా విలువలు లేకుండా కథనాలు రాయడం బాధాకరమని ఆగ్రహం వ్యక్తం చేశారు. మానవత్వం ఉన్న ప్రతి ఒక్కరూ, జనసైనికులు, యాదవ సంఘాలు స్వచ్ఛందంగా వచ్చి ఈ కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్నాయని, స్వయంగా వచ్చి తన సొంత నిధుల నుంచి బాధిత కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించిన మంత్రి పార్థసారథికి నియోజకవర్గ ప్రజల తరపున ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. ఈ పరామర్శ కార్యక్రమంలో ఇచ్ఛాపురం శాసన సభ్యులు, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్, ప్రజాప్రతినిధులు, వివిధ బీసీ, యాదవ సంఘాల ప్రతినిధులు, కూటమి నాయకులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

ట్రేడింగ్ పేరుతో రూ.15 కోట్లకు టోకరా

-నెలకు 10-20 శాతం లాభాలు వస్తాయని రూ.లక్షల్లో సేకరణ -తెలంగాణకు చెందిన మోసగాడు కడపలో అరెస్టు




కడప: స్టాక్ మార్కెట్ ట్రేడింగ్, క్రిప్టో కరెన్సీలో పెట్టుబడులు పెడితే నెలకు 10 నుంచి 20 శాతం వరకు భారీ లాభాలు వస్తాయని ఆశ చూపి పలువురిని రూ. 15 కోట్ల మేర మోసం చేసిన అంతర్రాష్ట్ర ఘరానా మోసగాడిని కడప రిమ్స్ పోలీసులు అరెస్టు చేశారు. హైదరాబాద్ కేంద్రంగా నకిలీ ట్రేడింగ్ సంస్థలు నడుపుతూ వివిధ రాష్ట్రాల్లో కూడా రూ.కోట్లు వసూలు చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. రిమ్స్ సీఐ రాజగోపాల్ కథనం మేరకు.. భద్రాచలంలోని ఆధార్‌నగర్ కాలనీకి చెందిన కిచ్చా వీరభద్రరావు అలియాస్ కేవీ రావు ప్రస్తుతం హైదరాబాద్ నాగోల్‌లో నివాసం ఉంటూ వీఆర్ ట్రేడింగ్ సర్వీసెస్, రావు ట్రేడింగ్ గ్రూప్ పేర్లతో కార్యాలయాలు నిర్వహిస్తున్నాడు. కడప నగరానికి చెందిన కమతం సుజాత, మరో బాధితురాలు సునీతలను వంచించి సుమారు రూ. 55 లక్షల మేర మోసం చేశాడు. వారిచ్చిన ఫిర్యాదు మేరకు రిమ్స్ పోలీసు స్టేషన్‌లో అతనిపై కేసు నమోదు చేశారు. నిందితుడు తన సహచరులతో కలిసి ఏపీ, తెలంగాణ, హరియాణ తదితర రాష్ట్రాల్లో మోసాలు చేయడంతో నాలుగు రాష్ట్రాల్లో ఇతనిపై కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

'టీనేజ్ గర్భధారణ నివారణకు కృషిచేద్దాం'



బొబ్బిలి:టీనేజ్ గర్భధారణ నివారణకు ప్రతి ఒక్కరు బాధ్యతగా పనిచేయాలని ఐసీడీఎస్ పీడీ బాలమణి పిలుపునిచ్చారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో టీనేజ్ గర్భధారణ నివారణ, బాల్యవివాహాల నిర్మూలన, పోషకాహార ప్రాధాన్యంపై అంగన్‌వాడీ కార్యకర్తలు, కిశోర బాలికలు, గర్భిణులు, అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చట్టబద్ధమైన వయస్సు వచ్చాకే వివాహాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవికుమార్, ఏంఈవో వాసు, సీడీపీవో జె.విజయలక్ష్మి, పిరిడి వైద్యాధికారి భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కులో జిమ్మిక్కు



విశాఖపట్నం: విశాఖపట్నం స్టీల్‌ప్లాంటులో ఒక్కొక్కరికి ఒక్కో రకం నిబంధన అమలు చేస్తున్నారని ఉద్యోగ వర్గాలు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నాయి. గత మూడు దశాబ్దాలుగా ఎన్నడూ లేని కొత్త నిబంధనలు తీసుకువచ్చారని ఆరోపిస్తున్నాయి. సంస్థ ఆర్థిక స్థితి బాగా లేదని పేర్కొంటూ ఉద్యోగులకు ఏడాదిన్నర కాలంగా పూర్తి జీతాలు ఇవ్వడం లేదు. దశల వారీగా పర్సంటేజీల ప్రకారం చెల్లిస్తున్నారు. ఈ విధంగా స్టీల్‌ప్లాంటు యాజమాన్యం సగటున ఒక్కో ఉద్యోగికి 390 శాతం జీతం బకాయి పడింది. అంటే సుమారు నాలుగు నెలల జీతం చెల్లించాల్సి ఉంది. ఇదిలావుండగానే గత ఏడాది నవంబరు నుంచి ఉత్పత్తి ఆధారిత జీతాలకు శ్రీకారం చుట్టారు. కేంద్ర ప్రభుత్వం నడిపే ఏ స్టీల్‌ప్లాంటులోను ఈ విధానం లేదు. ప్రతి విభాగానికి ప్రతి నెలా లక్ష్యం ఇచ్చి, అందులో ఎంత ఉత్పత్తి చేస్తే అంతే జీతం ఇవ్వడం ప్రారంభించారు. ప్లాంటును 100 శాతం ఉత్పత్తి సామర్థ్యంతో నడిపే ఆర్థిక వనరులు, ముడిసరకులు యాజమాన్యం వద్ద లేకపోయినా ఈ నిబంధన అమలు చేయడం గమనార్హం. దీంతో ఉద్యోగులు 80 నుంచి 95 శాతం జీతాలు మాత్రమే అందుకుంటున్నారు. ప్లాంటులో పనిచేస్తున్న ఉద్యోగులు అందరికీ ఈ రకంగా జీతాలు ఇస్తూ, ఉన్నతాధికారులు అంటే డైరెక్టర్లు, ఆపైన ఉండేవారు మాత్రం పూర్తి జీతాలు తీసుకుంటున్నారు. ప్లాంటు ఉత్పత్తి లక్ష్యాలు సాధించలేకపోయినప్పుడు వారు కూడా అందులో భాగస్వాములే అయినప్పుడు వారు ఎలా పూర్తి జీతాలు తీసుకుంటారని ప్రశ్నిస్తూ ఓ కార్మిక నాయకుడు కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. అది ఇప్పుడు ప్లాంటు వర్గాల్లో కలకలం రేపుతోంది. జీతాలు ఇవ్వకుండా ఆదాయ పన్ను చెల్లింపు....ఉద్యోగులకు వంద శాతం జీతాలు ఇవ్వకపోయినా ఇచ్చినట్టు రికార్డుల్లో చూపించి, ఆ మొత్తాలపై వారి తరపున యాజమాన్యం ఆదాయ పన్ను చెల్లించుకుంటూ పోతోంది. జీతాల్లో బకాయిలు ఏమైనా ఉంటే వాటిని ఆర్థిక సంవత్సరం పూర్తయ్యే నాటికి సెటిల్‌మెంట్ చేయాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉంది. కానీ నిధుల లేమి పేరుతో బకాయిల చెల్లింపును పక్కన పెడుతోంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఉద్యోగులకు 230 శాతం జీతం బకాయిలు ఉండగా, దానిపై కూడా ఆదాయ పన్ను కట్టేశారని, దీనివల్ల సీనియర్ ఉద్యోగులు ఒక్కొక్కరు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షలు నష్టపోయామని, అధికారుల సంఘం నాయకుడు ఒకరు తెలిపారు. ఢిల్లీలో ఉక్కు మంత్రిత్వ శాఖ పేరు చెప్పి, విశాఖపట్నంలో యాజమాన్యం ఇష్టానుసారం నిర్ణయాలు తీసుకుంటున్నదని, వీటిపై ఫిర్యాదులు, కోర్టు కేసులు పడుతున్నా కేంద్ర ప్రభుత్వం విచారణకు ఆదేశించకపోవడంపై వారంతా అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కనీసం విజిలెన్స్ విచారణ అయినా చేపట్టి, ప్రక్షాళనకు చర్యలు చేపట్టాలని ఉద్యోగ వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి.

మెగా పీటీఎంలో పాల్గొనాలని కలెక్టర్ పిలుపు



విజయనగరం: జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 24న 'మెగా పేరెంట్-టీచర్స్ మీటింగ్' (మెగా పీటీఎం) కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి తెలిపారు. విద్యార్థుల విద్యా ప్రగతిని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లడంతో పాటు పాఠశాలలు, తల్లిదండ్రులు, సమాజం మధ్య బలమైన అనుబంధాన్ని ఏర్పరచే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమం ద్వారా పాఠశాలల అభివృద్ధి, అవసరాలు, విద్యార్థుల అభ్యాసంలో ఎదురవుతున్న సవాళ్లు, నాణ్యమైన విద్య అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలు, సమాజ భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే అంశాలపై విస్తృతంగా చర్చించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని శాఖల అధికారులు, మండల స్థాయి అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేసి ఈ కార్యక్రమాన్ని అత్యంత విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. ప్రతి పాఠశాలలో తల్లిదండ్రుల భాగస్వామ్యం ఉండేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో తల్లిదండ్రుల పాత్ర అమూల్యమని, తల్లిదండ్రులు ఈ అరుదైన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మెగా పీటీఎంలో తప్పనిసరిగా పాల్గొని, ఉపాధ్యాయులతో ముఖాముఖిగా చర్చించి తమ పిల్లల విద్యా ప్రగతి, ప్రతిభ, భవిష్యత్తు లక్ష్యాలపై అవగాహన పెంపొందించుకోవాలని, పిల్లల ఉన్నత భవిష్యత్తుకు భాగస్వాములు కావాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

వరకట్న నిషేధ చట్టంపై అవగాహన



పాలకొండ: ఎన్.కె.రాజపురంలో వరకట్న నిషేధ చట్టం 1961పై న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి కె.హరిబాబు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరకట్నం తీసుకోవడం, ఇవ్వడం రెండూ చట్టరీత్యా నేరమన్నారు. వరకట్నం వేధింపులు కారణంగా మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, వారికి చట్టపరంగా కల్పిస్తున్న రక్షణ, అందుబాటులో ఉన్న న్యాయ సహాయ సేవలను వివరించారు. ఎన్ఎల్ఎస్ఏ టోల్ ఫ్రీ నెంబర్ 15100 కాల్ చేసి ఉచిత న్యాయ సహాయం పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు వెన్నపు శ్రీనివాసరావు, నీలాపు శ్రీనివాసరావు, ప్యానెల్ న్యాయవాదులు బి.రామ్మోహన్‌రావు, ఎం.జగన్మోహన్‌రావు పాల్గొన్నారు.

రైతులకు పింఛన్ ఇవ్వాలి



విజయనగరం: పేద, మధ్యతరగతి రైతులు, కౌలురైతులు, వ్యవసాయ కార్మికులకు నెలకు రూ.10 వేలు పింఛన్ ఇవ్వాలని రైతు సంఘ నాయకులు డిమాండ్‌చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘ నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమెరికాతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందానికి సిద్ధమ వుతోందని, ఆ ఒప్పందం జరిగితే అమెరికా నుంచి పన్నులు లేకుండా వచ్చే చౌక దిగుమతుల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని చెప్పారు. ఇప్పటికే ఆ ప్రభావంతో పొగాకు మొక్కజొన్న, మామిడి పత్తి తదితర పంటల ధరలు పడిపోయాయని తెలిపారు. అగ్రిమెంట్లు అమల్లోకి వస్తే ఆహార వాణిజ్య పంటలు పండించే 11 కోట్ల మంది రైతులు, ఎనిమిది కోట్ల మంది పాడి రైతులకు నష్టం వస్తుందన్నారు. నాలుగు లేబర్ కోడ్లు ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలోని రైతు సంఘ నాయకులు డేగల అప్పలరాజు, ఆదినారాయణ, ముత్యాలు నాయుడు, కొండలరావు పాల్గొన్నారు.

ప్రతి రైతుకు యూరియా అందజేస్తాం



గంట్యాడ: ప్రతి రైతుకు యూరియా అందజేస్తామని వ్యవ సాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎం.రామారావు తెలిపారు. మండలంలోని మురపాకవ్ర, పెదవేమలిల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియా పంపిణీ గతంలో మాదిరిగా కాకుండా ఇప్పుడు ఏపీఏఐఎంఎస్ యాప్ ద్వారా ఓటీపీతో ద్వారా రైతులకు పంపిణీ చేస్తున్నా మని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో వల్ల వర్షాలు తక్కువగా కురిసే అవకాశం ఉం దని, దీంతో రైతులు పంటలు బీమాకు వరి పంట కోసం వచ్చే నెల 15లోగా ఎకరాకు రూ 200 చెల్లించాలని కోరారు. కార్యక్రమంలోని ఏవో శ్యామ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రధాని మోదీ పర్యటన ఏర్పాట్ల పరిశీలన



విజయనగరం: నెల్లిమర్ల నియోజకవర్గం భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవానికి ఆగస్టు 1న రాష్ట్రానికి వస్తున్న ప్రధాని మంత్రి నరేంద్ర మోదీ పర్యటన ఏర్పాట్లను కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి పరిశీలించారు. బహిరంగ సభా ప్రాంగణాన్ని పరిశీలించారు. అక్కడి వేదిక ఏర్పాట్లు, వివిధ గ్యాలరీలు, గ్రీన్ రూమ్స్ తదితర వాటి గురించి సంబంధిత అధికారులతో చర్చించారు. వీఐపీ వాహనాల పార్కింగ్ స్థలాలను పరిశీలించి వాహనాల రాకపోకలపై ఆరా తీశారు. ట్రాఫిక్‌కు ఎక్కడా అంతరాయం లేకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అంతకుముందు టెర్మినల్ భవనాన్ని కలెక్టర్ పరిశీలించి, కంట్రోల్ రూమ్‌కి భవనాన్ని ఖరారు చేశారు. సంయుక్త కలెక్టర్ సేధు మాధవన్, జీసీసీ ఎండీ ఎస్ఎస్ శోభిక, ట్రైనీ ఐఏఎస్ హరి ఓం పాండ్య, జీఎంఆర్ ప్రాజెక్ట్ హెడ్ రామరాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జూలై 27న సౌత్ జోన్ లో బహిరంగ వేలం

-జీవీఎంసీ సౌత్ జోనల్ కమిషనర్ ఎం .మల్లయ్య నాయుడు

విశాఖపట్నం: జీవీఎంసీ సౌత్ జోన్ పరిధిలో గల పలు ప్రాంతాల్లో షాపు రూములు, మార్కెట్ లు, కళ్యాణ మండపములను లీజుకు ఇచ్చుటకు 2026 జులై 27 న ఉదయం 11.00 గంటలకు సౌత్ జోన్ సూర్యబాగ్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించబడునని జీవీఎంసీ సౌత్ జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్య నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బహిరంగ వేలంలో షాప్ రూములు... స్ప్రింగ్ రోడ్ డైక్స్ ట్యాంక్ వాణిజ్య సముదాయం గ్రౌండ్ ఫ్లోర్ , ఫస్ట్ ఫ్లోర్ , జగదాంబ వాణిజ్య సముదాయం, పాత బస్ స్టాండ్ ఫేస్-× ం×× లో, పద్మనగర్ , సూర్యబాగ్ వాణిజ్య సముదాయము ఫస్ట్ ఫ్లోర్ లో, టి.ఎస్.ఆర్. వాణిజ్య సముదాయము, డైమండ్ పార్క్ ,ఆశీల్ మెట్ట వాణిజ్య సముదాయములలో షాపుకు, 2)మార్కెట్ లు ఏవిఎన్ కాలేజీ దరి (రోడ్ సైడ్) ఫిష్ మార్కెట్, నెహ్రూ బజార్ మార్కెట్ , శ్రీ నగర్ మార్కెట్ లకు, 3)కళ్యాణ మండపములు...సైలాడ పైడితల్లి నాయుడు, శ్రీ పొట్టి శ్రీరాములు కళ్యాణమండపములకు లీజుకు ఇచ్చుటకు బహిరంగ వేలం నిర్వహించబడునన్నారు. కావున, ఆసక్తి గల వ్యక్తులు/సంస్థలు సదరు బహిరంగ వేలం నందు



పాల్గొనవలసినదిగా కోరుతూ ఇతర వివరముల కొరకు సౌత్ జోన్ లో కార్యాలయ పర్యవేక్షకులను పని వేళలలో ఉదయం 10.00 గంటల నుండి సాయింత్రం 5.00 గంటల లోపు సంప్రదించవచ్చునని జోనల్ కమిషనర్ తెలియజేశారు.

పర్యావరణ హితంగా గోదావరి పుష్కరాలు

రాజమహేంద్రవరం: గోదావరి పుష్కరాలను పర్యావరణహితంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ కీర్తి చేకూరి అన్నారు. పుష్కరాల ఏర్పాట్లపై రాష్ట్రస్థాయి పర్యావరణ పరిరక్షణ కమిటీ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో రాజమహేంద్రవరంలోని క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్, జేసీ మేఘాస్వరూప్, నగరపాలక సంస్థ కమిషనర్ రాహుల్‌మీనా, ఇతర అధికారులు పాల్గొన్నారు. గోదావరి సాగు, తాగునీటి సరఫరా వ్యవస్థలు కలుషితం కాకుండా.. రూ.300 కోట్ల అంచనాలతో డెడికేటెడ్ ఛానల్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి, ఇప్పటికే ప్రభుత్వానికి డీపీఆర్ సమర్పించినట్టు తెలిపారు. ఈలోపు రాజమహేంద్రవరం నగరం, కొవ్వూరు పట్టణాల్లో డ్రెయిన్ వాటర్‌ను తాత్కాలికంగా బ్యారేజీ దిగువకు తరలించేలా ప్రతిపాదిస్తున్నామన్నారు. పుష్కరాల దృష్ట్యా అన్ని ఘాట్లలో నిరంతర నీటి నాణ్యత పర్యవేక్షణ, ప్లాస్టిక్ రహిత చర్యలు అమలు చేస్తామన్నారు. మునికూడలి ఘాట్ ఆధునికీకరణ పనులు ప్రారంభమయ్యాయని కలెక్టర్ వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ... పారిశ్రామిక వ్యర్థాలు, జనావాసాల నుంచి వచ్చే మురుగు, ఘన వ్యర్థాలతో గోదావరి జలాలు కలుషితం కాకుండా



నదీ పరీవాహక పట్టణాలు, గ్రామాల్లో వివిధ శాఖల సమన్వయంతో నియంత్రణ చర్యలు చేపడుతున్నామన్నారు. జిల్లాలో 17 రెడ్ కేటగిరి పరిశ్రమల నుంచి వ్యర్థాలు వెలువడుతుండగా వాటిల్లో రెండు పరిశ్రమల వ్యర్థాలను గోదావరిలోకి వదులుతున్నారని, వాటిని నూరుశాతం ట్రీట్‌మెంట్ చేసేలా ఆదేశాలు జారీ చేస్తామన్నారు. నదీ, కాలువలకు సమీపంలో ఉన్న గ్రామాల్లో సివరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు, మ్యాజిక్ డ్రైన్లు, సోక్ పిట్లు ఏర్పాటుకు ప్రతిపాదించామన్నారు.

ఫిల్మ్ నగర్ భూ కేటాయింపుపై ప్రభుత్వ సానుకూలత

విశాఖపట్నం: ఫిల్మ్ నగర్ కల్చరల్ సెంటర్ నిర్మాణం కోసం భూమి కేటాయించడానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చెప్పారు. తిమ్మాపురంలోని కల్చరల్ సెంటర్ కార్యవర్గంతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014-19 లో తిమ్మాపురంలో ఫిల్మ్ నగర్ కల్చరల్ సెంటర్ కోసం 5 ఎకరాల స్థలాన్ని కేటాయించి, శంకుస్థాపన కూడా చేయడం జరిగిందని గుర్తు చేశారు. అయితే జీఓ లో లీజు గడువు పేర్కొనని కారణంగా సాంకేతిక సమస్య తలెత్తిందన్నారు. తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వాన్ని కార్యవర్గం ఎన్నిసార్లు కోరినా పట్టించుకోలేదని చెప్పారు. ఇటీవల మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారని, గడువు పేర్కొంటూ తొందర్లోనే జీఓ జారీ చేయడానికి హామీ ఇచ్చారన్నారు. భూమి కేటాయింపు కోసం కృషి చేస్తున్న గంటాకు కార్యవర్గం కృతజ్ఞతలు తెలియజేసింది. అధ్యక్షుడు ఆర్.వి. చంద్రమౌళి ప్రసాద్,



కోశాధికారి కె.బాలాజీ శివప్రసాద్, సంయుక్త కార్యదర్శి ఎన్.ఆర్.కె. రెడ్డి, జాస్తి శ్రీకాంత్, అశోక్ కుమార్, హరివర్మ, ఎ.ఎల్.ఎన్. రాజు తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియా పోకడలపై అసెంబ్లీలో చర్చిస్తాం

ఏలూరు: సోషల్ మీడియా పోకడలపై అసెంబ్లీలో చర్చిస్తామని ప్రభుత్వ విప్, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ తెలిపారు. హత్యలు చేసే వారిని, రౌడీలను సోషల్ మీడియాలో హీరోలుగా చూపిస్తున్నారని, దీని వల్ల సమాజానికి ఏం సంకేతం ఇస్తున్నారని ప్రశ్నించారు. సోషల్ మీడియాపై నియంత్రణ అవసరమని వ్యాఖ్యానించారు. ఏలూరులో సోషల్ మీడియా-సామాజిక బాధ్యత అనే అంశంపై జరిగిన రౌండ్ టేబుల్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి జగన్‌ను ఉద్దేశించి సోషల్ మీడియాలో చిన్న కామెంట్ పెట్టినా, ఏదైనా చిన్న మాట అన్నా వెంటనే పోలీసులు బాధ్యులను అరెస్టు చేసి జైలుకు పంపేవారని అన్నారు. ఇప్పుడు ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం, వారి కుటుంబ సభ్యులను, పిల్లలను లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియాలో తిడుతున్నా.. ఏవేవో పోస్టులు పెడుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదన్నారు. ఇంత ఉదాసీనంగా ఉంటే తప్పు చేసే వారికి ఏం భయం




ఉంటుందన్నారు. తప్పు ఎవరు చేసినా తప్పేనని, శిక్ష పడినప్పుడే మరొకరు తప్పు చేయరని అన్నారు. ఇలాంటి వాటిపై త్వరలో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి సోషల్ మీడియాపై ఒక విధానపరమైన నిర్ణయం తీసుకోవాలని యోచిస్తున్నామన్నారు. సమాజానికి ఉపయోగపడే మంచి కంటెంట్‌ను సోషల్ మీడియాలో ప్రచారం చేయాలని సూచించారు.

పంచదారల కొండపై అక్రమ మైనింగ్ ను అడ్డుకుంటాం



-నో మైనింగ్ జోన్ గా జీవో విడుదల చేయాలి... శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ

రాంబిల్లి: అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలంలో గల పంచదారల ఫణిగిరి పర్వతంపై అక్రమ మైనింగ్ ను అడ్డుకుంటామని, నో మైనింగ్ జోన్ గా ప్రకటించి జీవో విడుదల చేసే వరకు వైయస్సార్సీపి ధర్మపోరాటం చేస్తుందని ఆంధ్ర ప్రదేశ్ శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ అన్నారు. వైయస్సార్సీపి ఎలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ ఆధ్వర్యంలో చలో పంచదారల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అనకాపల్లి నుంచి పంచదారల వరకు భారీగా కార్లు, బైకుల ర్యాలీ నిర్వహించారు. అనంతరం బొత్స సత్యనారాయణ, వైయస్సార్సీపి రీజనల్ కోఆర్డినేటర్లు కురసాల కన్నబాబు, గుడివాడ అమర్నాథ్, వైఎస్ఆర్సీపి జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్ పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు ఫణిగిరి పర్వతంపై జరిగిన అక్రమ మైనింగ్ను పరిశీలించారు. పంచదారల పుణ్యక్షేత్రాన్ని సందర్శించి శ్రీ ఉమాధర్మలింగేశ్వర స్వామిని దర్శించుకున్నారు. పుణ్య ధారల నుంచి వస్తున్న పవిత్రమైన నీరును పరిశీలించారు. అనంతరం నిర్వహించిన సభలో బొత్స మాట్లాడుతూ, ధర్మ శ్రీ ఆధ్వర్యంలో



నిర్వహిస్తున్న ఉద్యమానికి పార్టీ అండగా ఉంటుందన్నారు. సనాతన ధర్మం గురించి మాట్లాడే ఎంపీ, ఎమ్మెల్యేలు అక్రమ మైనింగ్ పాల్పడి పుణ్యక్షేత్రం పవిత్రతను దెబ్బతీయడంతో పాటు పుణ్యదార లకు ముప్పు వాటిల్లే చర్యలకు పాల్పడటం దారుణం అన్నారు. మాజీమంత్రులు కన్నబాబు, అమర్నాథ్ లు మాట్లాడుతూ అక్రమమైనందు ద్వారా కోట్లు రూపాయలు సంపాదించుకుంటూ సంపద దోచుకోవడమే కాకుండా శతాబ్దాల చరిత్ర కలిగిన పంచదారుల పుణ్యక్షేత్రాన్ని నాశనం చేయడానికి పూనుకోవడం దారుణం అన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ తమ ఉద్యమం ఆపే ప్రసక్తే లేదన్నారు. అవసరమైతే రాష్ట్రవ్యాప్త ఉద్యమంగా తీసుకువెళ్లి పోరాటం చేస్తామన్నారు. ధర్మ శ్రీ మాట్లాడుతూ, అక్రమ మైనింగ్ కు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీ, ఇక్కడ ఎమ్మెల్యే చేస్తున్న దోపిడీపై పోరాటం తప్పదని హెచ్చరించారు. ఈ ధర్మ పోరాటాన్ని తీవ్రతరం చేస్తామన్నారు. నో మైనింగ్ జోన్ గా జీవో జారీ చేయాలని డిమాండ్ చేశారు. అంతేగాక ఈ అక్రమ మైనింగ్ కు అనుమతులు ఇచ్చిన అధికారులపై తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్ పర్సన్ సుభద్ర, వైఎస్ఆర్సీపి నాయకులు దూలి నాగరాజు, శ్రీనుబాబు, కిషోర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్యశాఖలో అక్రమాలపై సీరియస్

- డీఎంహెచ్‌వో డి.కృష్ణమూర్తి నాయక్ సస్పెన్షన్ - జీవో జారీ చేసిన వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి వీరపాండ్యన్ - అక్రమాలు నిర్ధారణ కావడంతో ఎట్టకేలకు శాఖాపరమైన చర్యలు

పాడేరు: జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో అక్రమాలపై ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అక్రమాలకు పాల్పడిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ డి.కృష్ణమూర్తి నాయక్‌ను సస్పెండ్ చేస్తూ జీవో జారీ చేసింది. దీనికి సంబంధించి బాధితుల కథనం, విచారణాధికారుల నివేదికల ఆధారంగా వివరాలిలా ఉన్నాయి. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ప్రతి పనికి డబ్బులు డిమాండ్ చేస్తున్నారని వైద్యులు మొదలుకుని పారా మెడికల్ సిబ్బంది వరకు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ప్రధానంగా వైద్యుల రెగ్యులరైజేషన్, ఇతర సిబ్బంది సర్వీసు అంశాల క్రమబద్ధీకరణ, డిప్యూటేషన్లు, కాంట్రాక్ట్ సిబ్బంది వార్షిక రెన్యువల్స్ వంటి ప్రక్రియలను చేపట్టేందుకు ముక్కు పిండి డబ్బులు వసూలు చేస్తున్నారని బాధిత వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఫిర్యాదులు చేశారు. అలాగే ఆస్పత్రులకు వచ్చే ప్రత్యేక అభివృద్ధి నిధులు, పల్స్ పోలియో వంటి జాతీయ కార్యక్రమాల నిర్వహణకు సంబంధించిన నిధులను పక్కదారి పట్టిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఆస్పత్రుల్లోని వ్యర్థాలను సేకరించే సంస్థల పేరిట అధిక మొత్తంలో నిధులు తప్పుడు బిల్లులతో స్వాహా చేశారని పలువురు ఉద్యోగులే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.

అక్రమాలపై రెండు స్థాయిల్లో విచారణలు... స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో అక్రమాలపై ఉన్నతాధికారులు మూడు స్థాయిల్లో విచారణలు చేపట్టారు. తమకు వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా విశాఖపట్నంలోని వైద్య ఆరోగ్యశాఖ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ రాధారాణి మే నెలలో విచారణ చేపట్టారు. ఈ విచారణకు డీఎంహెచ్‌వో కృష్ణమూర్తినాయక్, బాధిత ఉద్యోగులు



హాజరయ్యారు. అలాగే జూన్ 22, 23 తేదీల్లో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ జాతీయ గ్రామీణ ఆరోగ్య కమిషన్ అడిషనల్ డైరెక్టర్ కేవీఎన్ఎస్.అనిల్‌కుమార్ విచారణ చేపట్టారు. ఉమ్మడి అల్లూరి సీతారామరాజు జిల్లాలో జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్‌లో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్లుగా పని చేస్తున్న 353 మంది కాంట్రాక్ట్ ఉద్యోగుల వార్షిక రెన్యువల్ చేసేందుకు ఒక్కొక్కరి నుంచి రూ.1,000 నుంచి రూ.1,500 వరకు వసూలు చేశారని ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్ట్ వైద్య ఉద్యోగుల సంఘం నేతలు బి.సందీప్‌కుమార్, ఎన్.పవన్‌కల్యాణ్, వాసు, వెంకట్, బాధిత ఉద్యోగులు లిఖిత పూర్వకంగా తెలిపారు. ఈ రెండు విచారణల నివేదికలను రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ డాక్టర్ పద్మావతికి సమర్పించారు. అలాగే ఆమె సైతం అంతర్గత విచారణ చేపట్టారు. అన్ని విచారణల్లో డీఎంహెచ్‌వో కృష్ణమూర్తి నాయక్ అక్రమాలకు పాల్పడినట్టు నిర్ధారణ కావడంతో ఆయనపై సస్పెన్షన్ వేటు వేస్తూ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి వీరపాండ్యన్ జీవో ఆర్‌టీ నంబర్ 669ను జారీ చేశారు. గతేడాది అక్టోబరులో ఇక్కడ డీఎంహెచ్‌వోగా బాధ్యతలు చేపట్టిన కృష్ణమూర్తి నాయక్ కేవలం ఎనిమిది నెలల్లోనే అక్రమాల ఆరోపణలతో సస్పెండ్ కావడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

ప్రభుత్వాసుపత్రుల్లో పారిశుద్ధ్య లోపాన్ని సహించం

-స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిరామ్

అనంతపురం: స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో పారిశుద్ధ్యానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిరామ్ తెలిపారు. ఆసుపత్రుల్లో బయో వ్యర్థాల సేకరణ, నిర్వహణ, తరలింపులో ప్రమాణాలు పాటించకుంటే సహించేది లేదని స్పష్టం చేశారు. అనంతపురం జిల్లా ఆసుపత్రి బయో వ్యర్థాలను మున్సిపల్ డంపింగ్ యార్డులో పడేస్తున్నారన్న ఫిర్యాదుల నేపథ్యంలో ఆయన పరిశీలనకు వచ్చారు. ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యంతోపాటు తరలింపు ఏజెన్సీల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి నెలా మూడో శనివారం తలపెట్టిన స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ఆసుపత్రుల్లో మొక్కుబడిగా కాకుండా.. బాధ్యతగా కొనసాగించాలని సూచించారు. వారంలో ఆసుపత్రి అంతటినీ పరిశుభ్రంగా మార్చాలని, లేనిపక్షంలో సంబంధిత ఏజెన్సీలను బ్లాక్ లిస్ట్‌లో పెడతామని హెచ్చరించారు. జగన్‌రెడ్డి ప్రజలపై చెత్తపన్నులు వేసి వ్యర్థాల కొండలు మిగిల్చి పోతే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చెత్త రహిత డంపింగ్ యార్డులను సాకారం చేయబోతున్నామని పట్టాభిరామ్ పేర్కొన్నారు. అనంతపురం డంపింగ్ యార్డును ఎమ్మెల్యే దగ్గుపాటిప్రసాద్‌తో కలిసి



పరిశీలించారు. రాష్ట్రంలో కోటి 50 లక్షల టన్నుల చెత్త ఉంటే ఇప్పటికే 80 శాతం పూర్తి చేశామన్నారు. డంపింగ్ యార్డుల్లో పడే ఏరోజు చెత్తను ఆరోజే శుద్ధి చేయడానికి 107 ప్రెస్ వేస్ట్ ప్లాంట్లు రూ.550 కోట్లతో ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. 107 ప్లాంట్లతో ప్రతి రోజూ 5,500 మెట్రిక్ టన్నుల చెత్తను ప్రాసెస్ చేసి రాష్ట్రంలో డంపింగ్ యార్డులు కన్పించకుండా చేస్తామన్నారు. అనంతపురంలో రూ.17.50 కోట్లతో ఆగస్టు 15 లోపు కొత్త ప్లాంట్ ఏర్పాటు చేసి డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు.

అప్పన్నదొరపాలెంలో భూముల పరిశీలన

-జాయింట్ కలెక్టర్‌తో కలిసి భూముల పరిశీలన -500 ఎకరాలు అవసరమన్న కంపెనీ ప్రతినిధులు

మాకవరపాలెం: మండలంలో మరో భారీ కంపెనీ ఏర్పాటు కానున్నది. ఇందుకు 500 ఎకరాలు అవసరం కావడంతో సదరు కంపెనీ ప్రతినిధులతోపాటు జాయింట్ కలెక్టర్ శౌర్యమాన్ పటేల్ ఇక్కడకు వచ్చి పరిశీలించారు. మండలంలోని పైడిపాల, పెద్దిపాలెం, బూరుగుపాలెం, తూటిపాల రెవెన్యూ పరిధిలో 4,250 ఎకరాల డి.పట్టా భూములతో పాటు ప్రభుత్వ భూములను ల్యాండ్ బ్యాంకుగా అధికారులు గుర్తించారు. గతంలో ఈ భూములను ఏపీఐఐసీ ఎండీతోపాటు పరిశ్రమల శాఖ ముఖ్యకార్యదర్శి యువరాజ్, కలెక్టర్ విజయ్‌కృష్ణన్ పరిశీలించారు. అప్పట్లో బ్లాక్‌స్టోన్ కంపెనీ ప్రతినిధులు ఇక్కడకు వచ్చి భూములను చూసి వెళ్లారు. తరువాత ఈ భూమికి ఎనిమిది కిలోమీటర్ల పొడవున, 100 అడుగుల వెడల్పుతో రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు అధికారులు ప్రణాళికను తయారు చేశారు. ఈ నేపథ్యంలో తూటిపాల రెవెన్యూ పరిధిలోని అప్పన్నదొరపాలెం వద్ద కంపెనీ ఏర్పాటుకు సుమారు 500 ఎకరాలు అవసరమంటూ సదరు




కంపెనీ ప్రతినిధులు వచ్చి పరిశీలించారు. ఈ సందర్భంగా ఈపీడీసీఎల్, జలవనరుల శాఖ అధికారులతో మాట్లాడారు. అయితే ఇక్కడ ఏర్పాటు చేయాలనుకుంటున్న కంపెనీ ఏమిటన్నది వెల్లడించకుండా గోప్యత పాటిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ అధికారులతోపాటు తహశీల్దార్ కాకర నూకరాజు, మండల సర్వేరు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

12 PRAJA MUDRA Telugu Monthly ప్రజాముద్ర తెలుగు మాస పత్రిక JULY 2026

డబ్బులు ఇవ్వకపోతే రైవాడ నీరు బంద్

-జీవీఎంసీ అధికారులకు ఎమ్మెల్యే బండారు అల్టిమేటం
-డీఆర్సీలో చెప్పినట్టు పక్షం రోజుల్లో రూ.5 కోట్లు ఇవ్వాలి -లేదంటే రైతులతో కలిసి నేనేంటో చూపిస్తానని హెచ్చరిక -ఆయకట్టుకు నీరు విడుదల



దేవరాపల్లి: మహా విశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంసీ) అధికారులు పక్షం రోజుల్లో రూ.5 కోట్లు విడుదల చేయకపోతే రైవాడ రిజర్వాయర్ నుంచి విశాఖకు నీటి సరఫరాను నిలుపుదల చేయిస్తానని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి స్పష్టం చేశారు. ఆయన మండలంలోని రైవాడ జలాశయం నుంచి కాలువల ద్వారా ఆయకట్టుకు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా బండారు మాట్లాడుతూ, రైవాడ జలాశయం నుంచి నిరంతరాయంగా 50 క్యూసెక్కుల చొప్పున నీటిని తరలించుకుపోతున్న జీవీఎంసీ అధికారులు ఇంతవరకు రూ.169 కోట్లు చెల్లించాల్సి వుందని, బకాయిలు చెల్లించకుండా అధికారులు తాత్సారం చేస్తున్నారని ఆరోపించారు. రైవాడ నీటిని విశాఖ నగరంలో అమ్ముకుంటున్న జీవీఎంసీ అధికారులు.. జలాశయం అభివృద్ధి పనులకు డబ్బులు ఇవ్వకపోతే ఎలా అని ప్రశ్నించారు. ఇటీవల జరిగిన డీఆర్సీ సమావేశంలో ఈ విషయాన్ని ప్రస్తావించగా.. తొలుత రూ.5 కోట్లు ఇస్తామని జీవీఎంసీ అధికారులు చెప్పారని, 15 రోజుల్లో నిధులు విడుదల చేయకపోతే ఆయకట్టు రైతులతో కలిసి తానేంటే చూపిస్తానని హెచ్చరించారు. కోటి ఇరవై ఐదు లక్షల రూపాయలతో జలాశయం గేట్లకు, ఇన్‌టేక్ చాంబర్‌కు మరమ్మత్తులు చేయించినట్టు చెప్పారు. ఈ ఏడాది వర్షాలు తక్కువ కురిసే అవకాశం వున్నందున రైతులు నీటిని పొదుపుగా వాడుకోవాలని ఆయన కోరారు. అంతకు ముందు రిజర్వాయర్‌ను ఆనుకొని ఉన్న ఎరకాలమ్మ గుడివద్ద పురోహితులు పాకల కామేశ్వరశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించి ఎడమ కాలువ వద్ద జలహారతి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జలాశయం ఈఈ సత్యంనాయుడు, జలాశయ చైర్మన్ పాత్రునాయుడు, కూటమి నేతలు కిలపర్తి భాస్కరరావు, గొర్లె గోవింద, రామ్మూర్తినాయుడు, బండారు రామారావు, పెద్దాడ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

మంజూరైన పనులు ఆగస్టు లోపు పూర్తి చేయాలి

-జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్



అనకాపల్లి: జిల్లాలోని మంజూరైన రోడ్ల పనులు ఆగస్టు నెల ఆకుల లోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సాయంత్రం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రాజెక్ట్స్ ఈఈ , డి ఈ లు, ఏఈ లతో జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రావీ+హ్ స్కీం కింద మూడు బ్రిడ్జి పనులను ఆగస్టు 15 నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. అదేవిధంగా నాబార్డ్ ద్వారా పది పనులను ఆగస్టు నెలాఖరు నాటికి పూర్తి చేయాలని ఈ ప్రాజెక్టును రత్నకుమార్ ఆదేశించారు. పంచాయతీరాజ్ గ్రాఖ దగ్గర పని ఒత్తిడి తక్కువగా ఉన్నందున జిల్లాలో తహశీల్దార్ కార్యాలయాల నూతన భవనాల నిర్మాణం, ఫిషరీస్ ట్యాంక్ వర్క్స్, రైతు బజార్ల నిర్మాణం సి ఎస్ ఆర్ నిధులతో నిర్మించే పనులను చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రాజెక్ట్స్ ఈఈ, ఏ ఈ లు, డి ఈ లు పాల్గొన్నారు.

మంగళగిరిలో జీఎస్టీ అప్పిలేట్ ట్రైబ్యునల్ బెంచ్ ప్రారంభం

-జీఎస్టీ అప్పిలేట్ ట్రైబ్యునల్ బెంచ్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న భాస్కరరెడ్డి వేమిరెడ్డి



మంగళగిరి: జీఎస్టీ అప్పీళ్ల విచారణలో పన్ను చెల్లింపుదారులకు వేగవంతమైన, పారదర్శక న్యాయాన్ని అందించడానికి ట్రైబ్యునల్ నిబద్ధతతో ఉందని కేంద్ర జీఎస్టీ-ఏటీ ఉపాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి వేమిరెడ్డి పేర్కొన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో కేంద్ర గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్ అప్పిలేట్ ట్రైబ్యునల్ విజయవాడ, విశాఖపట్నం బెంచ్‌లను ఆయన ప్రారంభించారు. మొదటి రోజే ఆయా బెంచ్‌ల్లో విచారణ ప్రారంభమైందని తెలిపారు. నూతన బెంచ్‌ల ఏర్పాటుతో జీఎస్టీ అప్పీళ్లకు వేగవంతమైన పరిష్కారం, పన్ను చెల్లింపుదారులకు న్యాయ లభ్యత మెరుగుపడటం, వ్యాజ్యాల తగ్గుదల, వస్తుసేవల పన్ను విధానం అమలు మరింత బలోపేతం అవుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో జీఎస్టీ-ఏటీ ఏపీ సాంకేతిక సభ్యులు సతీష్‌కుమార్ అగర్వాల్, రాష్ట్ర పన్నుల శాఖ ప్రధాన కమిషనర్ ఎ.బాబు, స్పెషల్ కమిషనర్ ఎన్.సౌమ్య, కమిషనర్ (అప్పీల్స్) దేవేష్ గుప్తా, కమిషనర్ (కస్టమ్స్) ఆర్కే రామన్, కమిషనర్ (సీజీఎస్టీ) అరుణ్ రిచర్డ్ తదితరులు పాల్గొన్నారు.

2,034 పాఠశాలల్లో మెగా పీటీఎం

- విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశం - శత శాతం తల్లిదండ్రులు హాజరుకావాలని సూచన



పాడేరు: జిల్లాలో మెగా పేరెంట్- టీచర్ మీట్(పీటీఎం) 4.0ను విజయవంతంగా నిర్వహించాలని విద్యాశాఖాధికారులను కలెక్టర్ టి.నిషాంతి ఆదేశించారు. మెగా పీటీఎంపై గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడారు. పీటీఎం కార్యక్రమం పాఠశాల, విద్యాభివృద్ధికి దోహదపడాలని, ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులను ప్రత్యేకంగా ఆహ్వానించాలని, శత శాతం తల్లిదండ్రులు పీటీఎంకు హాజరయ్యేలా ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అలాగే కార్యక్రమానికి హాజరైన వారందరికీ కనీస సదుపాయాలు కల్పించాలని, సూచించిన మెనూ ప్రకారం భోజనాలు ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా మెగా పీటీఎం నిర్వహణపై ప్రధానోపాధ్యాయులు, టీచర్లు చేపట్టాల్సిన చర్యలను సమగ్ర శిక్ష ఏపీడీ స్వామినాయుడు, ఇన్‌చార్జి డీఈవో, టీడబ్ల్యూ డీడీ పరిమిళ వివరించారు. జిల్లాలో 2,034 పాఠశాలల్లో మెగా పీటీఎం జరుగుతుందని, కార్యక్రమానికి సంబంధించిన ఫొటోలు, వివరాలను సంబంధిత యాప్‌లో విధిగా అప్‌లోడ్ చేయాలని సూచించారు.

ప్రభుత్వ విక్టోరియా ఆసుపత్రిలో బయో- వెస్టన్ మరుగుదొడ్లను ప్రారంభించిన సెంట్రల్ టాక్స్ కమిషనర్ పి ఆనంద్ కుమార్





విశాఖపట్నం: ప్రజారోగ్యం, పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తూ స్వచ్ఛ భారత్ అభియాన్‌లో భాగంగా విశాఖపట్నం చెంగల్ రావు పేట కనకమహాలక్ష్మి ఆలయం సమీపము లోని ప్రభుత్వ విక్టోరియా (గోషా) ఆసుపత్రిలో రూ.4.74 లక్షల వ్యయంతో నిర్మించిన బయో- వెస్టన్ మరుగుదొడ్లను గుంటూరు సీజీఎస్టీ ఆడిట్ కమిషనరేట్ సెంట్రల్ టాక్స్ కమిషనర్ శ్రీ పి. ఆనంద్ కుమార్, ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విక్టోరియా ఆసుపత్రి ప్రధాన ప్రసూతి కేంద్రంగా సేవలందిస్తున్నందున ప్రతిరోజూ అధిక సంఖ్యలో గర్భిణులు, బాలింతలు, నవజాత శిశువులు ఆసుపత్రికి వస్తున్నారని తెలిపారు. పెరుగుతున్న రోగుల అవసరాలకు అనుగుణంగా పరిశుభ్రమైన పారిశుద్ధ్య సౌకర్యాలు కల్పించడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న మరుగుదొడ్ల సౌకర్యాలు పెరుగుతున్న అవసరాలకు సరిపోకపోవడంతో తల్లులు, నవజాత శిశువుల ఆరోగ్యం, పరిశుభ్రతను దృష్టిలో ఉంచుకుని అదనంగా బయో- వెస్టన్ న్ మరుగుదొడ్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సౌకర్యాలు ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య వాతావరణాన్ని అందించడంతో పాటు స్వచ్ఛ భారత్ లక్ష్యాల సాధనకు దోహదపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విక్టోరియా (గోషా) ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి. ఉష, సీజీఎస్టీ డిప్యూటీ కమిషనర్ శ్రీ సి. సత్యనారాయణ, ఐఆర్ఎస్, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది, సీజీఎస్టీ అధికారులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాలు వితరణ



అనకాపల్లి: జిల్లాలోని పాఠకులకు నాణ్యమైన విజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో విజయవాడకు చెందిన ఎమ్మెస్కో బుక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ జిల్లా కేంద్ర గ్రంథాలయానికి ఉచితంగా అందజేసిన వివిధ నూతన పుస్తకాలను జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు వి. సతీష్ కుమార్ తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఎమ్మెస్కో సంస్థ అందించిన పుస్తకాలు విద్యార్థులు, పోటీ పరీక్షల అభ్యర్థులు, పాఠకులకు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ఈ పుస్తకాలను జిల్లాలోని అన్ని శాఖా గ్రంథాలయాలకు సర్క్యులేట్ చేసి, ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. గ్రంథాలయాల వినియోగాన్ని ప్రజలు మరింతగా పెంచుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని కలెక్టర్ సూచించారు.

నగరం నుంచి భోగాపురానికి ప్రతి అరగంటకో ఏరో ఎక్స్‌ప్రెస్

-జోరుగా అనుసంధాన రోడ్ల పనులు, ప్రధాని సభకు జిల్లా నుంచి 50 వేల మంది -పించన్ల పంపిణీకి ఇబ్బంది లేకుండా ముందస్తు చర్యలుఃజిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిశోర్



విశాఖపట్నం: భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవం నేపథ్యంలో నగరం నుంచి విమానాశ్రయానికి ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ తెలిపారు. నగరంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేయనున్న లాంజ్ ల నుంచి ప్రతి అరగంటకు ఒక ఏరో ఎక్స్‌ప్రెస్ బస్సు నడిపేలా ప్రణాళిక రూపొందించామని పేర్కొన్నారు. కలెక్టరేట్ వీసీ హాలులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పలు అంశాలపై ఆయన మాట్లాడారు. ప్రభుత్వం జిల్లాకు 100 బస్సులు కేటాయించిందని, ఇప్పటికే 20 ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులోకి వచ్చాయని చెప్పారు. ప్రయాణికుల డిమాండ్‌ను బట్టి సంఖ్యను పెంచుతామన్నారు. నగరం నుంచి భోగాపురం విమానాశ్రయానికి ప్రత్యేక ఏసీ బస్సు సేవలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. విమానాశ్రయానికి వెళ్లే ప్రయాణికులకు సౌకర్యంగా ఓలా, ఉబర్ తదితర క్యాబ్ సేవలను కూడా అనుమతించేలా జీఎంఆర్‌తో చర్చలు జరిపినట్లు తెలిపారు. ప్రారంభమైన తొలిరోజు నుంచే క్యాబ్ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు.

230 కి.మీ. రహదారులపై ప్రత్యేక దృష్టి..... భోగాపురం విమానాశ్రయానికి నగరం నుంచి అనుసంధానమయ్యే 28 రహదారులను గుర్తించామని, వీటి మొత్తం పొడవు సుమారు 230 కిలోమీటర్లు ఉంటుందని తెలిపారు. ఇప్పటికే ఉన్న రహదారుల్లో మరమ్మతులు, జంక్షన్ అభివృద్ధి, వెడల్పు, హైమాస్ట్ లైట్ల ఏర్పాటు వంటి పనులను వేగవంతం చేశామన్నారు. ఏడు ప్రధాన అనుసంధాన రహదారుల్లో నాలుగు పూర్తయ్యాయని, మరో రెండు ఈ నెలాఖరులోగా పూర్తవుతాయని వివరించారు. జాతీయ రహదారులు, ఆర్అండ్‌బీ, జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏ, ఏపీఎస్ఆర్టీసీ తదితర శాఖల సమన్వయంతో స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ప్రణాళికలను రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. భవిష్యత్తులో ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారంగా మెట్రో రైలు, డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ వంటి ప్రాజెక్టులపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. విమానాశ్రయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి విశాఖపట్నం జిల్లా నుంచి సుమారు 50 వేల మంది హాజరయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని 11 మండలాల్లో ప్రతి గ్రామం నుంచి ప్రజలను తరలించేందుకు బస్సులు, వాహనాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. విమానాశ్రయం ద్వారా భవిష్యత్తులో లబ్ధి పొందే ప్రతి ఒక్కరూ కార్యక్రమంలో పాల్గొని, ఈ ప్రాజెక్టు ద్వారా కలిగే అవకాశాలను తెలుసుకోవాలని సూచించారు. విమానాశ్రయం ప్రారంభోత్సవం రోజున ప్రధానమంత్రి విమానం మాత్రమే అక్కడ దిగుతుందని, ప్రయాణికుల వాణిజ్య విమాన సర్వీసులు ఆ రోజున ప్రారంభం కావని తెలిపారు. వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభమయ్యే తేదీని అధికారికంగా ప్రకటిస్తామన్నారు.

అదే రోజు అసిప్ టెక్నాలజీస్ సంస్థకు శంకుస్థాపన....ఆగస్టు 01న భారతదేశంలోనే తొలి ఇండియన్ సెమీకండక్టర్ మిషన్ ప్రాజెక్టుకు ఆంధ్రప్రదేశ్‌లో శంకుస్థాపన జరగనుందని తెలిపారు. ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రులు కార్యక్రమంలో పాల్గొంటారని జిల్లా కలెక్టర్ చెప్పారు. విమానాశ్రయ ప్రారంభోత్సవం కారణంగా ఒకటో తారీఖున పించనుదారులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని ప్రత్యామ్నాయాలను పరిశీలిస్తున్నామని కలెక్టర్ చెప్పారు.

5-10 లక్షల మంది భక్తులు వచ్చినా గిరి ప్రదక్షిణకు ఏర్పాట్లు.... ఈ నెల 28న జరిగే సింహాచలం గిరి ప్రదక్షిణకు 5-10 లక్షల మంది భక్తులు వచ్చినా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. 32 కి.మీ. మార్గాన్ని 30 విభాగాలుగా విభజించి ప్రతి విభాగంలో భక్తుల సహాయ కేంద్రాలు, తాగునీరు, పారిశుద్ధ్యం, వైద్య, పోలీసు సేవలను అందుబాటులో ఉంచుతున్నామన్నారు. హనుమంతవాక-మధ్యలాపాలెం మధ్య సాధారణ వాహనాల రాకపోకలను నియంత్రించి, అత్యవసర వాహనాలకు మాత్రమే అనుమతి ఇవ్వనున్నట్లు చెప్పారు. ప్రత్యామ్నాయ మార్గాల్లో ట్రాఫిక్ మళ్లింపులు, సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు. గిరి ప్రదక్షిణ మార్గంలో పలు ప్రాంతాల్లో షవర్ బాత్ సదుపాయాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. రెండు రోజుల పాటు మద్యం దుకాణాలు మూసివేయనున్నట్లు తెలిపారు. ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల మళ్లింపుపై రెండు కమిటీలను ఏర్పాటు చేశామని, వాటి నివేదికల ఆధారంగా ప్రజలకు మార్గదర్శకాలు జారీ చేస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు.

నెట్ జీరో హెల్తీ క్యాంపస్ అమలులో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి

-మెగా పేరెంట్-టీచర్ సమావేశాన్ని విజయవంతం చేయాలి -జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్



అనకాపల్లి: జిల్లాలోని విద్యాసంస్థలను పరిశుభ్రంగా, పర్యావరణహితంగా తీర్చిదిద్దే లక్ష్యంతో చేపడుతున్న "నెట్ జీరో హెల్తీ క్యాంపస్" కార్యక్రమంపై జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలలు, కళాశాలల్లో పరిశుభ్రత, పచ్చదనం, వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణ, నీటి సంరక్షణ, విద్యుత్ ఆదా, ప్లాస్టిక్ రహిత వాతావరణం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి విద్యాసంస్థలో నెట్ జీరో హెల్తీ క్యాంపస్ లక్ష్యాలను సమర్థవంతంగా అమలు చేసి, విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించే కార్యక్రమాలను నిరంతరం నిర్వహించాలని సూచించారు. అదేవిధంగా నిర్వహించనున్న మెగా పేరెంట్-టీచర్ సమావేశాన్ని విజయవంతం చేయడానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. సమావేశానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయడంతో పాటు, తల్లిదండ్రుల భాగస్వామ్యాన్ని పెంచేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. మండల ప్రత్యేక అధికారులు సమావేశానికి ముందుగానే తమ పరిధిలోని పాఠశాలలను సందర్శించి, నెట్ జీరో హెల్తీ క్యాంపస్ కార్యక్రమంలో నాటిన మొక్కలన్నీ సక్రమంగా ఉన్నాయా, వాటికి ప్రతిరోజూ నీరు అందిస్తున్నారా, మొక్కల సంరక్షణ సరిగా జరుగుతోందా అనే అంశాలను తప్పనిసరిగా పరిశీలించాలని ఆదేశించారు. పాఠశాల ప్రాంగణాల్లో పాములు సంచరించకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని, పాఠశాల ప్రహరీ గోడల చుట్టూ అవసరమైన చోట సంబంధిత శాఖల సమన్వయంతో పాముల నివారణకు ఉపయోగించే రసాయనాలను పిచికారీ చేయించాలని సూచించారు. అలాగే పాఠశాల ఆవరణలో పొదలు, కలుపు మొక్కలు పెరగకుండా ఎప్పటికప్పుడు తొలగించి పరిశుభ్రమైన వాతావరణాన్ని నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

లీక్‌లకు చెక్ పెట్టే బిల్లు

-క్యాబినెట్‌లో నిర్ణయం -సాధ్యమైనంత త్వరలో పార్లమెంటులో ఆమోదం -అర్ధరాత్రి వీడియో సందేశంలో ప్రధాని మోదీ వెల్లడి - లీక్‌లపై మరిన్ని కఠిన చర్యలుంటాయని స్పష్టీకరణ



దిల్లీ: పేపర్ లీక్ ఘటనలపై మరిన్ని తీవ్ర చర్యలుంటాయని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. లీక్‌లకు చెక్ పెట్టే బిల్లుపై జరిగే క్యాబినెట్‌లో నిర్ణయం తీసుకుంటామని, అతి త్వరలో పార్లమెంటులో ప్రవేశపెట్టి ఆమోదిస్తామని తెలిపారు. అసాధారణంగా... ఆయన ఓ ప్రత్యేక వీడియో సందేశం విడుదల చేశారు. విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో 12 గంటల వ్యవధిలో ఈ అంశంపై ఇది ఆయన విడుదల చేసిన రెండో సందేశం కావడం విశేషం. 'స్నేహితులారా.. పేపర్ లీక్ అనేది సాధారణ అంశం కాదని నాకు తెలుసు. నిందితులను ఇప్పటికే అరెస్టు చేసి జైలుకు పంపాం. మా అత్యంత ప్రాధాన్యాంశం విద్యార్థులు విద్యా సంవత్సరాన్ని నష్టపోకూడదు. వెంటనే పరీక్షలు నిర్వహించాం. అంతటితో మా పని అయిపోలేదు. పేపర్ లీక్ అనేది సాధారణ అంశం కాదు. లక్షల మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులను తీవ్రంగా బాధించింది. అందుకే గత రెండున్నర నెలల్లో పలు చర్యలు తీసుకున్నాం. మరిన్ని చర్యలు తీసుకోబోతున్నాం. అందుకే ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయాలని ఆదేశించా. జరిగే క్యాబినెట్ భేటీలో బిల్లుపై చర్చిస్తాం. త్వరలో పార్లమెంటులో బిల్లు పెడతాం' అని వీడియో సందేశంలో ప్రధాని వివరించారు.

భూ రికార్డుల శాశ్వత భద్రతకు 'మీ భూమి - బ్లాక్ చెయిన్'

-ఏ ఇబ్బందులూ లేకుండా భూముల క్రయవిక్రయాలు -7 జిల్లాల్లోని 89 రీసర్వే గ్రామాల్లో అమలు -పైలట్ ప్రాజెక్టును ప్రారంభించిన సీఎం చంద్రబాబు



అమరావతి: 'మీ భూమి – బ్లాక్ చెయిన్' విధానం ద్వారా భూరికార్డులకు శాశ్వత భద్రత లభిస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఈ వ్యవస్థ ద్వారా రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ విభాగాలు ఒకే వేదికపైకి వస్తాయని, ఇబ్బందుల్లేకుండా క్రయవిక్రయాలు చేసుకోవచ్చని వివరించారు. "ప్రక్షాళన-విముక్తి-భద్రత"కు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని, భూసమస్యలు లేని రాష్ట్రంగా ఏపీని తయారుచేస్తామని తెలిపారు. రాష్ట్ర సచివాలయంలో ఆయన 'మీ భూమి – బ్లాక్ చెయిన్' పైలట్ ప్రాజెక్టును వర్చువల్‌గా ప్రారంభించారు. ఏడు జిల్లాల్లోని 89 రీసర్వే గ్రామాల్లో 1,37,763 ల్యాండ్ పార్సిళ్ల పరిధిలో ఇది అమలవుతుంది. ఎన్ఐసీ ఆంధ్రప్రదేశ్, ఎన్ఐసీ బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఇన్ బ్లాక్ చెయిన్ టెక్నాలజీ సంస్థలు సంయుక్తంగా హైపర్ లెడ్జర్ ఫ్యాబ్రిక్ టెక్నాలజీతో ఈ వ్యవస్థను అభివృద్ధి చేశాయి. 'భూరికార్డులు సరిగా లేకపోవడంతో భూముల విషయంలో మోసాలు జరుగుతున్నాయి. అందుకే ట్యాంపర్ ప్రూఫ్ వ్యవస్థ తెస్తున్నాం. పటిష్ఠ భద్రత కల్పిస్తున్నాం' అని చంద్రబాబు తెలిపారు. 'గత ప్రభుత్వ విధానం వల్ల రాష్ట్రంలో భూవివాదాలు పెరిగాయి. కక్షసాధింపు చర్యల్లో భాగంగా గిట్టనివారి భూముల్ని 22ఏ జాబితాలో చేర్చారు' అని విమర్శించారు. సీఎస్, రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ పాల్గొన్నారు. నవంబరు నుంచి రాష్ట్రవ్యాప్తంగా.... రెండు నెలల పాటు పైలట్ ప్రాజెక్టును అమలుపరిచి పూర్తిస్థాయిలో అధ్యయనం చేయాలని చంద్రబాబు సూచించారు. 'అమల్లో లోటుపాట్ల నమోదుకు ఫిర్యాదుల విభాగాన్ని అందుబాటులో ఉంచాలి. ఫిర్యాదులు, సూచనలకు అనుగుణంగా బ్లాక్ చెయిన్ వ్యవస్థలో మార్పులు, చేర్పులు చేసుకోవాలి. సర్వే పూర్తయిన గ్రామాలన్నీ ఇక నుంచి బ్లాక్ చెయిన్ విధానంలోకి వెళ్తాయి. నవంబరు నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఈ వ్యవస్థను అందుబాటులోకి తేవాలి. రికార్డులను ప్రక్షాళన చేస్తున్నాం. రాజముద్రతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాలిస్తున్నాం. ప్రజల సమస్యలకు పరిష్కారం చూపితే ఫిర్యాదుల సంఖ్య తగ్గుతుంది' అని సీఎం పేర్కొన్నారు.

భూవివరాల సంరక్షణకే బ్లాక్ చెయిన్... భూముల వివరాలు డిజిటల్ చెయిన్‌గా ఇందులో ఉంటాయి. – భూ యజమాని, విక్రయాలు, అధికారిక లావాదేవీలు శాశ్వతంగా నమోదవుతాయి. ఒకసారి బ్లాక్ చెయిన్‌లో నమోదైతే తారుమారు చేయడం, తొలగించడం కుదరదు. – కబ్జాదారుల నుంచి భూమిని కాపాడేందుకు దోహదపడుతుంది. భూ లావాదేవీల్లో జరిగే ప్రతి చిన్న మార్పు పారదర్శకంగా, ధ్రువీకరణకు అనుకూలంగా ఉంటుంది. ప్రతి ఒక్కరి భూమిపై వాటి అసలైన హక్కుదారుల వివరాలుంటాయి. – భూ యజమానుల చట్టబద్ధ హక్కులను సమర్థంగా కాపాడుతుంది.

డబుల్ రిజిస్ట్రేషన్లకు చెక్..... ప్రతి ల్యాండ్ పార్సిల్‌కూ ప్రత్యేక డిజిటల్ ఐడీ ఇచ్చి ట్యాంపర్ ప్రూఫ్, సెక్యూరిటీతో లావాదేవీలు జరుగుతాయి. – భూసమస్యలకు ప్రధాన కారణం డబుల్ రిజిస్ట్రేషన్లు. వీటిని నివారించేలా బ్లాక్ చెయిన్ వ్యవస్థ పనిచేస్తుంది.

ఎర్రచందనం మాఫియా మూలాలు సమూలంగా నిర్మూలించాలి

-అందుకు డ్రోన్, ఆధునిక సాంకేతికతతో నిఘా పెంచాలి -అటవీశాఖ సమీక్షలో ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశం



అమరావతి: 'రాష్ట్రంలో ఎర్రచందనం అక్రమ రవాణాను పూర్తిగా తుడిచిపెట్టేందుకు డ్రోన్ పరిజ్ఞానం, అత్యాధునిక సాంకేతికత నిఘాను పటిష్ఠం చేయాలి. స్మగ్లింగ్ ముఠాల నెట్‌వర్క్‌ను మూలాలతో సహా నిర్మూలించేందుకు చర్యలు తీసుకోవాలి. అక్రమ రవాణాకు అవకాశం లేకుండా జీరో టాలరెన్స్ విధానాన్ని కఠినంగా అమలు చేయాలి' అని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అటవీశాఖ అధికారులను ఆదేశించారు. ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధం, రెండేళ్లలో ఏ మేరకు స్మగ్లింగ్ నిరోధించారు, భవిష్యత్ కార్యాచరణ తదితర అంశాలపై మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో పవన్‌కల్యాణ్ సమీక్ష నిర్వహించారు. పవన్ మాట్లాడుతూ.. 'అటవీ సంపద, ఎర్ర చందనాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత. స్మగ్లింగ్‌పై కఠినంగా వ్యవహరిస్తున్నాం. ప్రభుత్వం అవలంబిస్తున్న జీరో టాలరెన్స్ విధానాన్ని క్షేత్రస్థాయిలో మరింత పటిష్ఠంగా అమలు చేయాలి. దేశంలో ఎక్కడ ఎర్రచందనం అక్రమ నిల్వలు ఉన్నా.. ఆ రాష్ట్రాల అధికారులతో సమన్వయం చేసుకుని స్వాధీనం చేసుకోవాలి. స్మగ్లింగ్ ముఠాల వెనుక ఉన్న కింగ్ పిన్‌లు, వారి ఆర్థిక మూలాలపైనా దృష్టి సారించాలి. బాధ్యులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలి' అని సూచించారు.

రెండేళ్లలో 1,239 మంది అరెస్టు.....'గత రెండేళ్లలో ఎర్రచందనం అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకున్నాం. 506 కేసుల్లో 1,239 మందిని అరెస్టు చేసి, 372 వాహనాలను స్వాధీనం చేసుకున్నాం. 12 మంది ప్రధాన స్మగ్లర్లపై పీడీ చట్టం కింద చర్యలు తీసుకున్నాం. గుజరాత్, దిల్లీ, కర్ణాటక, తమిళనాడులలో అక్రమంగా నిల్వ చేసిన ఎర్రచందనాన్ని గుర్తించి.. ఆ ప్రాంత పోలీసు, అటవీశాఖల సమన్వయంతో ప్రత్యేక ఆపరేషన్లు నిర్వహించి 35.6 మెట్రిక్ టన్నులు స్వాధీనం చేసుకున్నాం. ఎర్రచందనం అక్రమ రవాణా కేసుల్లో గతంలో జైలు శిక్షల రేటు 3% కంటే తక్కువగా ఉండేది. ఇప్పుడు 95 శాతం కేసుల్లో నిందితులకు శిక్షలు పడుతున్నాయి' అని అటవీశాఖ ఉన్నతాధికారులు పవన్‌కల్యాణ్‌కు వివరించారు.

స్థానిక ఎన్నికల్లో గెలవాలి

-ఆగస్టు 15 నుంచి 4 నెలలపాటు గ్రామాలకు వెళ్లాలి -కోనసీమ జిల్లా వైకాపా ముఖ్యనేతలతో మాజీ సీఎం జగన్



అమరావతి: స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడొచ్చినా ప్రతిచోటా పోటీ చేయాలి, గెలవాలని అని వైకాపా నేతలకు ఆ పార్టీ అధ్యక్షుడు జగన్ స్పష్టం చేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు చెందిన పార్టీ నాయకులతో జగన్ క్యాంపు కార్యాలయంలో సమావేశమయ్యారు. 'ఆగస్టు 15 నుంచి 4 నెలలపాటు నియోజకవర్గ సమన్వయకర్తలు అన్ని గ్రామాలు, వార్డుల్లో పర్యటించాలి. పర్యటనల్లో ఎక్కడికక్కడ పార్టీ కమిటీలను ఏర్పాటు చేసి, స్థానిక ఎన్నికలకు పార్టీని సమాయత్తం చేయాలి. ప్రజా సమస్యలపై గళం విప్పాలి' అని సూచించారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రాంతీయ సమన్వయకర్త బొత్స సత్యనారాయణ, మాజీ మంత్రులు సుభాష్ చంద్రబోస్, కన్నబాబు, విశ్వరూప్, వేణుగోపాలకృష్ణ, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, కోనసీమ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి, జిల్లా నేతలు పాల్గొన్నారు. వైకాపా ఆధ్వర్యంలో ఆగస్టు 9న విజయవాడలో బీసీ గర్జన సభ నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నాయకులు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, విడదల రజిని, జోగి రమేష్, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ ప్రకటించారు.

చిన్న పరిశ్రమలకు ఆటోమేటిక్‌గా ప్రోత్సాహకాల చెల్లింపు వ్యవస్థ



-మంత్రుల సమావేశంలో లోకేశ్

అమరావతి: సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ)కు ప్రోత్సాహకాలు చెల్లించేందుకు ఆటోమేటిక్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని మంత్రి లోకేశ్ అధికారులకు సూచించారు. ఈ విధానాన్ని నిర్దేశిత వ్యవధిలో గ్రౌండింగ్ చేసిన ఎంఎస్ఎంఈలకు వర్తింపజేయాలని కోరారు. యువతకు ఎక్కువ ఉద్యోగావకాశాలు కల్పించే ఎంఎస్ఎంఈల రంగంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని పేర్కొన్నారు. యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పనపై ఏర్పాటైన మంత్రుల బృందం ఉండవల్లిలో మంత్రి లోకేశ్ అధ్యక్షతన సమావేశమైంది. ఆయన మాట్లాడుతూ.. 'కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటి వరకు రూ.29.30 లక్షల కోట్ల పెట్టుబడులతో 1,037 పరిశ్రమల ఏర్పాటుకు వివిధ సంస్థలు ముందుకు వచ్చాయి. వాటి ద్వారా 24.66 లక్షల మందికి ఉపాధి లభించే అవకాశం ఉంది. ప్రతి ప్రాజెక్టునూ ఎప్పటికప్పుడు ట్రాక్ చేస్తూ త్వరితగతిన గ్రౌండ్ చేసేలా చర్యలు తీసుకోవాలి' అని అన్నారు. సమావేశంలో మంత్రులు పొంగూరి నారాయణ, కందుల దుర్గేష్, గొట్టిపాటి రవికుమార్, కొండపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

వరికి ప్రత్యామ్నాయ పంటలపై

రైతులు ఆలోచించాలి

-వైకాపా కంటే కూటమి హయాంలోనే ఎక్కువ సంక్షేమ సాయం -మంత్రివర్గ సమావేశంలో చర్చ -వివరాలు వెల్లడించిన మంత్రి పార్థసారథి



అమరావతి: ఎల్‌నినో ప్రభావంతో ఎదురయ్యే సమస్యలపై రాష్ట్ర మంత్రివర్గం చర్చించింది. వర్షాభావం నేపథ్యంలో పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని మంత్రులకు ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. సాగునీటి సమస్యను దృష్టిలో పెట్టుకుని అందుకు అనుగుణంగా ఆరుతడి పంటలు సాగుచేయాల్సిందిగా రైతన్నలను కోరాలని తెలిపారు. సచివాలయంలో నిర్వహించిన మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు, చర్చించిన అంశాలను సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పార్థసారథి మీడియాకు వివరించారు. "రాష్ట్రంలో ఇప్పటికే 51%లోటు వర్షపాతం నమోదైంది. భూగర్భజలాలు తగ్గనున్నాయి. పోలవరం వద్ద గోదావరిలో ఈ సమయానికి 90వేల నుంచి లక్ష క్యూసెక్కులు ప్రవాహం ఉండాల్సి ఉండగా.. ప్రస్తుతం 35-38వేల క్యూసెక్కులే ఉంది. కృష్ణాడెల్టాకు వస్తున్న గోదావరి నీరు సైతం తగ్గుతోంది. ఇప్పటికే ఉభయగోదావరి, కృష్ణా జిల్లాల్లో 50%-70% వరినాట్లు వేశారు. ఇకముందు వరి వేసే రైతులు కొంచెం ఆలోచించాలి. ప్రభుత్వం ప్రత్యామ్నాయ పంటలు, ఆరుతడి పంటల సాగుకు విత్తనాలు పంపిణీ చేయనుంది" అని తెలిపారు.

కూటమి ప్రభుత్వంలోనే అధికంగా ఆర్థికసాయం...."కొందరు బోర్లు వేసి, పంటలు సాగుచేయాలని భావిస్తారు. దయచేసి బోర్లు వేయొద్దని కోరుతున్నాం. భూగర్భ జలాలు తగ్గిపోతే తాగునీటి సమస్య ఏర్పడుతుంది. దీర్ఘకాలంలో కరవును ఎదుర్కొనేందుకు గోదావరి-కావేరి అనుసంధానానికి సీఎం చంద్రబాబు కృషిచేస్తున్నారు" అని మంత్రి పేర్కొన్నారు. "వైకాపా అన్నీ అబద్ధాలే ప్రచారం చేస్తోంది. వైకాపా హయాంలో సంక్షేమం ఎక్కువ చేశామని ప్రచారం చేస్తున్నారు. కానీ, కూటమి ప్రభుత్వంలోనే పేదలకు ఎక్కువ ఆర్థికసాయం అందుతోంది కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సీఎం సూచించారు" అని పార్థసారథి తెలిపారు.

చరిత్రలో నిలిచిపోయేలా 'భోగాపురం' ప్రారంభోత్సవం

-అన్ని శాఖల సమన్వయంతో విజయవంతానికి చర్యలు -ఉత్తరాంధ్ర జిల్లాల అధికారులతో మంత్రుల సమీక్ష



అమరావతి: భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని చరిత్రలో నిలిచిపోయేలా నిర్వహించేందుకు కూటమి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఈ కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్ఠాతక్మంగా తీసుకుంది. కార్యక్రమ నిర్వహణపై శ్రీకాకుళం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాల యంత్రాంగంతో సచివాలయంలో మంత్రులు, ఉన్నతాధికారులు సమీక్ష నిర్వహించారు. జనసమీకరణ, ఆహారం, పార్కింగ్, రవాణా సదుపాయం, తదితర ఏర్పాట్లపై చర్చించారు.

13వేల మంది గిరిజనులతో థింసా నృత్యం....గిరిజన సంప్రదాయం ప్రతిబింబించేలా 13వేల మంది గిరిజనులు థింసా నృత్య ప్రదర్శన చేయనున్నారు. భోజనాలు, వాహనాల పార్కింగ్, తదితర వాటిలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నారు.

మానవ నైపుణ్యాలకు ప్రపంచస్థాయి అవకాశాలు



విశాఖపట్నం: కృత్రిమ మేధ (ఏఐ) యుగంలో మానవ నైపుణ్యాలకు ప్రపంచస్థాయిలో అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ నార్త్ కరోలినా విల్మింగ్టన్ ఛాన్స్‌లర్ డాక్టర్ అశ్వని కె.వోలేటి పేర్కొన్నారు. గీతం డీమ్డ్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చారు. ఏఐ రాకతో పరిశ్రమలు వేగంగా మారుతున్నప్పటికీ సృజనాత్మకత, నైతిక నిర్ణయాలు తీసుకోవడం, నాయకత్వ లక్షణాలు, సంబంధాలను మెరుగుపర్చుకోవడం వంటి మానవ సహజ గుణాలను అది భర్తీ చేయలేదన్నారు. అమెరికా వర్సిటీ డీన్ డాక్టర్ క్రిస్టోఫర్ ఫినెల్లి మాట్లాడుతూ ఏఐని మానవ సామర్థ్యాన్ని పెంచే ఓ శక్తిమంతమైన సాధనంగా చూడాలన్నారు. అది మానవశ్రమకు ప్రత్యామ్నాయం కాదని తెలిపారు. అనంతరం గీతం డీన్ ప్రొఫెసర్ రాజాఫణి మాట్లాడుతూ.. విద్యార్థులు ఏఐని బాధ్యతాయుతంగా ఉపయోగిస్తూనే తమ సమస్యలకు పరిష్కారాలు, సృజనాత్మకతను పెంపొందించుకోవాలని సూచించారు. వృత్తి నైపుణ్యాలను పెంచుకునే దిశగా యువత పాటించాల్సిన విధానాలను వివరించారు. విద్యార్థుల సందేహాలను విదేశీ ప్రతినిధులు నివృత్తి చేశారు.


27 నుంచి అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరిస్తాం



కమలానగర్(అనంతపురం): తెదేపా చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటిప్రసాద్ అన్నారు. తెదేపా అర్బన్ కార్యాలయంలో ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఈ నెల 27వ తేదీ నుంచి కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తామని తెలిపారు. ఆర్థిక సంక్షోభంలో ఉన్న రాష్ట్రాన్ని సీఎం చంద్రబాబు తన అనుభవంతో గాడిన పెట్టారన్నారు. రాష్ట్రాన్ని స్కాముల ఏపీగా మార్చిన ఘనత వైకాపా అధినేత జగన్‌కే దక్కుతుందని విమర్శించారు.

కస్టడీలో అసహజ మరణంపై ప్రాథమిక విచారణ జరపాల్సిందే

-గుజరాత్ ఘటనపై సిట్ ఏర్పాటుకు ఆదేశిస్తూ సుప్రీం వెల్లడి



దిల్లీ: పోలీస్ కస్టడీలో అసహజ మరణం సంభవిస్తే దానిపై ప్రాథమిక విచారణ జరపాల్సిందేనని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. నేరారోపణకు ఆధారాలు లభిస్తే ఎఫ్ఐఆర్ దాఖలు చేయాలని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, జస్టిస్ వి.మోహన ధర్మాసనం పేర్కొంది. గుజరాత్‌లో జహిరుద్దీన్ గయాసుద్దీన్ షేక్ కస్టడీ మరణంపై ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) ఏర్పాటుకు ఆదేశిస్తూ ఈ వ్యాఖ్యలు చేసింది. మూడు నెలల్లోగా తుది నివేదికను గుజరాత్‌లోని జ్యుడీషియల్ మేజిస్ట్రేట్‌కు సమర్పించాలని తెలిపింది. వేజల్‌పుర్ పోలీస్‌స్టేషన్‌లో మే 18న తన తండ్రి మృతిచెందడంపై ఎఫ్ఐఆర్ దాఖలు చేసి దర్యాప్తు జరిపించాలన్న అభ్యర్థనను గుజరాత్ హైకోర్టు తిరస్కరించడంతో తోఫిక్ షేక్ సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.

తాగునీటి సరఫరాపై జిల్లా కలెక్టర్ సమీక్ష

-ప్రతి ఆవాసానికి సురక్షితమైన తాగునీరు అందించడమే లక్ష్యం - జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్



అనకాపల్లి: జిల్లాలోని ప్రతి ఆవాసానికి సురక్షితమైన తాగునీరు అందించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, నీటి కలుషితం లేదా నిర్లక్ష్యం వల్ల ప్రజారోగ్యానికి ఇబ్బందులు తలెత్తితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ హెచ్చరించారు. కలెక్టరేట్‌లో గ్రామీణ నీటి సరఫరా (ఆర్‌డబ్ల్యూఎస్) శాఖ అధికారులు, ఇంజనీర్లతో తాగునీటి సరఫరా, జల్ జీవన్ మిషన్, సీపీడబ్ల్యూఎస్, ఎస్‌వీఎస్ పథకాల పురోగతిపై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. తాగునీటి వనరులు, పైప్‌లైన్లను క్షేత్రస్థాయిలో నిరంతరం పరిశీలించాలని, లీకేజీలను వెంటనే అరికట్టి నీటి కలుషితాన్ని నివారించాలని ఆదేశించారు. కలరా, డయేరియా వంటి నీటి ద్వారా వ్యాపించే వ్యాధులు రాకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సంపత్తిపురం, బుద్ధండ్లపురం తదితర ప్రాంతాల్లోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను పూర్తిస్థాయిలో నింపి ఎక్కడా తాగునీటి కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. జల్ జీవన్ మిషన్ పనులు, పెండింగ్ బిల్లుల పరిష్కారం, కొత్త డీపీఆర్‌లు, టెండర్ల ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. నీసీ రోడ్ల నిర్మాణంతో నిలిచిపోయిన పైప్‌లైన్ పనులను సంబంధిత శాఖలతో సమన్వయం చేసి వెంటనే పూర్తి చేయాలని సూచించారు. ప్రజలకు అందించే ప్రతి బొట్టు నీరు సురక్షితంగా ఉండాలని, అధికారులు జవాబుదారీతనంతో పనిచేసి అన్ని పనులను గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ, డీఈలు, ఏఈలు మరియు ఇతర ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

605 పాఠశాలలు, కళాశాలల్లో మెగా పీటీఎం 4.0

-పిల్లల కోసం తల్లిదండ్రులు ఒక రోజు కేటాయించాలి.. ప్రగతిని తెలుసుకోవాలి
-మెగా పేరెంట్స్ - టీచర్స్ సమావేశం వివరాలు వెల్లడించిన కలెక్టర్ అభిషిక్త్ కిశోర్
-తల్లికి వందనం కింద జిల్లాలో 2.32 లక్షల మంది విద్యార్థులకు రూ.345 కోట్ల నిధులు



విశాఖపట్నం: విద్యార్థుల విద్యాభ్యాసంతో పాటు ఇతర కార్యకలాపాల్లోనూ వారి ప్రతిభ, ప్రగతిని తల్లిదండ్రులతో చర్చించి, వారికి అందుబాటులో ఉన్న అవకాశాలపై అవగాహన కల్పించేందుకు మెగా పీటీఎం 4.0 సమావేశం మంచి వేదికగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ అన్నారు. ప్రతి తల్లీ, తండ్రి ఈ కార్యక్రమంలో తప్పనిసరిగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు కలెక్టరేట్ వీసీ హాలులో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. పిల్లల కోసం కనీసం సగం రోజును కేటాయించి, వారి చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఇతర కార్యకలాపాల్లో ప్రగతిని తెలుసుకోవాలని సూచించారు. విద్యార్థులను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు ఉన్న అవకాశాలు, మార్గాలపై తల్లిదండ్రులతో చర్చించేందుకు మెగా పీటీఏ సమావేశం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. తల్లిదండ్రుల భాగస్వామ్యం ప్రభుత్వంతో పాటు జిల్లా యంత్రాంగం కూడా కోరుకుంటోందని పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 9.00 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జిల్లాలోని 594 పాఠశాలల్లో, 11 కళాశాలల్లో మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ జరుగుతుందని వివరించారు. వీటిలో 71,360 పాఠశాల విద్యార్థులు, 7,166 మంది కళాశాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు భాగస్వామ్యం కానున్నారని పేర్కొన్నారు.

2.32 లక్షల మంది విద్యార్థులకు రూ.345 కోట్ల తల్లికి వందనం....జిల్లాలో సుమారు 2.32 లక్షల మంది విద్యార్థులకు తల్లికి వందనం పథకం కింద రూ.345 కోట్లను ప్రభుత్వం విడుదల చేసిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ మొత్తాన్ని డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ ద్వారా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తున్నామని చెప్పారు. ఎవరైనా లబ్ధిదారులకు నగదు జమ కాకపోతే స్వర్ణగ్రామం, స్వర్ణవార్డుల్లోని డిజిటల్ అసిస్టెంట్ల ద్వారా సమస్యలను నమోదు చేసి పరిష్కరించే విధంగా ప్రత్యేక మాడ్యూల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. అలాగే తల్లిదండ్రులు లీప్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని తమ వివరాలను నమోదు చేస్తే తల్లికి వందనం పథకం చెల్లింపు స్థితిని తెలుసుకోవచ్చని సూచించారు. చెల్లింపు విఫలమైతే సమీపంలోని స్వర్ణగ్రామం లేదా స్వర్ణవార్డును సంప్రదించి బ్యాంకు ఖాతా వివరాలు, ఆధార్ వివరాల్లో అవసరమైన సవరణలు చేసుకోవచ్చన్నారు. మెగా పీటీఏ సమావేశం నాటికి ప్రతి అర్హత కలిగిన విద్యార్థికి తల్లికి వందనం పథకం నగదు జమ చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. రాష్ట్రంలోనే అతిపెద్ద డీబీటీ పథకాలలో తల్లికి వందనం ఒకటని, విద్యా శాఖ ద్వారా వివిధ పథకాల కింద సుమారు రూ.10 వేల కోట్ల వరకు ప్రత్యక్ష ప్రయోజన బదిలీ జరుగుతోందని తెలిపారు. విద్యా రంగానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను తల్లిదండ్రులు గుర్తించి, మెగా పీటీఏ సమావేశంలో పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో డీఈవో ప్రేమ కుమార్, ఏపీసీ చంద్రశేఖర్, డీవీఈవో ఉమారాణి పాల్గొన్నారు.

నీటిపారుదల కాలువల నిర్మాణం, పూడిక తీత పనులను ఆగస్టు 14 లోగా పూర్తి చేయాలి

-జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్



అనకాపల్లి: నీటిపారుదల కాలువల నిర్మాణం, పూడిక తీత పనులను ఆగస్టు 14 లోగా పూర్తి చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఇరిగేషన్ అధికారులతో భూ నిర్వహణ / నీటిపారుదల ప్రాజెక్టులపై జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కాలువల నిర్మాణం, లైనింగ్, పూడిక తీత మరియు స్ట్రక్చర్ల పురోగతి వివిధ ప్యాకేజీల వారీగా జరుగుతున్న పనుల పురోగతిని క్షేత్రస్థాయి గణాంకాలతో పరిశీలించి, అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.ఎర్త్‌వర్క్ / కాలువ తవ్వకం పనులు ?ప్రతిపాదించిన 30.93 లక్షల క్యూబిక్ మీటర్ల తవ్వకం పనుల్లో మెజారిటీ పనులు పూర్తయినందున, మిగిలిన ఎంబ్యాంక్మెంట్ మరియు క్లియరెన్స్ పనులన్నింటినీ ఆగస్టు 10వ తేదీ నాటికి పూర్తిగా ముగించాలన్నారు. ప్యాకేజీల వారీగా మంజూరైన స్ట్రక్చర్లలో (కల్వర్టులు, అప్రోచ్ రోడ్లు, సీలింగ్ వర్క్స్) పురోగతి వేగవంతం చేయాలని, ప్రాధాన్యత కలిగిన స్ట్రక్చర్ల పనులను వచ్చే గురువారం నాటికి పూర్తి చేసి నివేదించాలని.వై.ఎల్.ఎం.సి కాలువ పూడిక తీత అనకాపల్లి జిల్లా పరిధిలోని 31 కిలోమీటర్ల వై.ఎల్.ఎం.సి కాలువ పరిధిలో పూడిక తీత మరియు సిల్ట్ తొలగింపు పనులను వేగవంతం చేయాలన్నారు. నీటి విడుదల సమయానికి ఎలాంటి అడ్డంకులు లేకుండా నీరు సజావుగా ప్రవహించేలా కాలువను సిద్ధం చేయాలని, ఆగస్టు 14 నాటికి లక్ష్యాల పూర్తిచేసి ప్రాజెక్ట్ సిద్ధం చేయాలని ఆదేశించారు. పాత/ఉన్నత స్ట్రక్చర్లలో ఏవైనా మరమ్మతులు ఉంటే వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. నాణ్యతా ప్రమాణాల్లో ఎలాంటి రాజీ పడకూడదని, గడువులోగా పనులు పూర్తి పూర్తిచేయాలని ఆదేశించారు.

జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై అధికారులకు దిశా నిర్దేశం

-జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్



అనకాపల్లి: అసిస్టెంట్ ఇంజనీర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు సాధారణ అంచనాలు చెప్పకుండా, సిమెంట్ లైనింగ్, కాలువల మరమ్మతులు, వాగుల మళ్లింపు వంటి ప్రతి పనికి స్పష్టమైన వారపు లక్ష్యాలు నిర్దేశించుకోవాలని జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో నీటిపారుదల శాఖ, ప్రాజెక్టుల పురోగతి, ఖరీఫ్ సీజన్ సాగునీరు, తాగునీటి అవసరాలు మరియు చిన్న/మధ్యతరహా నీటిపారుదల పనుల పురోగతిపై నీటిపారుదల శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తాండవ, రాయవాడ, కోనం, పెద్దేరు, వరాహ తదితర రిజర్వాయర్ల నీటి నిల్వలు మరియు కాలువల మరమ్మతులపై కలెక్టర్ సమగ్రంగా సమీక్షించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. తాండవ ప్రాజెక్ట్ లో ప్రస్తుతం 3.65 TMCల నీటి నిల్వ? ఉంది. సుమారు 32,000 ఎకరాల ఆయకట్టుకు ఆగస్టు మధ్య నాటికి నీటి విడుదల చేసేలా ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. రాయవాడ రిజర్వాయర్లో ప్రస్తుతం 1.16 TMCల నిల్వ ఉంది. 15,000 ఎకరాల సాగునీటితో పాటు, GVMC తాగునీటి అవసరాలకు (రోజుకు50 క్యూసెక్కులు) ఎటువంటి అంతరాయం లేకుండా చూడాలన్నారు. పెద్దేరు, వరాహ మరియు కోనం రిజర్వాయర్లు వరద నీటి ప్రవాహాలను నిరంపొలములకు కూడా సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎన్టీఆర్ సాగర్ ప్రాజెక్ట్ కింద సాగు నీరు అందుతున్నందున, తక్షణమే స్థానిక తహశీల్దార్ మరియు సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు సమన్వయం చేసుకుని నీటి పన్ను అంచనాలు రూపొందించాలని ఆదేశించారు. ఎస్. రాయవరం మండలంలో 89 మైనర్ ఇరిగేషన్ పనులు పూర్తికావడం పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన కలెక్టర్, నర్సీపట్నం, కోటవురట్ల, దేవరాపల్లి, కోటపాడు మండలాల్లో పనులు మందగించడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అన్ని మండలాల్లోని పెండింగ్ కాలువ మరమ్మతులు, ఎత్తిపోతల పథకాల పనులను ఈ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని స్పష్టం చేశారు. నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ సమావేశంలో నీటిపారుదల శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఇంజనీర్లు , ప్లానింగ్ అధికారులు మరియు ఇతర సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

తూర్పు తీరాన సౌర వెలుగులు

-ఈపీడీసీఎల్ పరిధిలో 88,561 రూఫ్‌టాప్ సోలార్ యూనిట్లు ఏర్పాటు -475 మెగావాట్లు గ్రిడ్‌కు అనుసంధానం -సీఎండీ పృథ్వీతేజ్ వెల్లడి



విశాఖపట్నం: ఆంధ్రప్రదేశ్ తూర్పు విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) పరిధిలో అత్యధికంగా రూఫ్‌టాప్ సోలార్ యూనిట్లు ఏర్పాటు చేశామని సీఎండీ పృథ్వీతేజ్ వెల్లడించారు. ఆయన విశాఖలో విలేకరులతో మాట్లాడుతూ, ఈ ఏడాది జూన్ 30 నాటికి సంస్థ పరిధిలో 88,561 మంది వినియోగదారులకు రూఫ్‌టాప్ సోలార్ యూనిట్లు ఏర్పాటు చేసి వాటి ద్వారా 475.33 మెగావాట్ల విద్యుత్‌ను గ్రిడ్‌తో అనుసంధానం చేశామన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలోనే 51,583 సోలార్ యూనిట్ల ద్వారా 197.09 మెగావాట్లను గ్రిడ్‌కు ఇచ్చి రికార్డు నెలకొల్పామని వెల్లడించారు. 2022-23లో 864 సోలార్ యూనిట్ల ద్వారా 17.39 మెగావాట్లు, 2023-24లో 980 యూనిట్ల ద్వారా 30 మెగావాట్లు, 2024-25లో 8,307 యూనిట్ల ద్వారా 70.25 మెగావాట్లు గ్రిడ్‌కు అనుసం?ధానం చేశామని వెల్లడించారు. పునరుత్పాదక ఇంధన వినియోగంపై ప్రజల్లో అవగాహన పెరగడంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రోత్సాహక పథకాలు దీనికి దోహదపడ్డాయన్నారు. రూఫ్‌టాప్ సోలార్ యూనిట్లు పెట్టుకునేవారికి సాంకేతిక సహకారం, గ్రిడ్ అనుసంధానం, నెట్ మీటరింగ్ ప్రక్రియను వేగంగా, పారదర్శకంగా అమలు చేస్తున్నామని తెలిపారు. పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన కింద ఒక కిలోవాట్‌కు రూ. 30 వేలు, రెండు కిలోవాట్లకు రూ. 60 వేలు, మూడు కిలోవాట్లకు రూ. 78 వేలు రాయితీ లభిస్తుందన్నారు. ఎస్సీ, ఎస్టీలలో అర్హులైన వారికి రెండు కిలోవాట్ల వరకు ఉచితంగా యూనిట్లు పెడుతున్నామని చెప్పారు. సంస్థ పరిధిలో శ్రీకాకుళం జిల్లా నుంచి ఏలూరు వరకు వినియోగదారులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవచ్చని అన్నారు.

సకాలంలో సర్ పెండింగ్ పనులు పూర్తి

-కలెక్టర్ టి.నిషాంతి - అధికారులకు కలెక్టర్ టి.విషాంతి ఆదేశం



పాడేరు: ఓటరు జాబితాల స్పెషల్ ఇన్‌టెన్సివ్ రివిజన్(సర్) ప్రక్రియకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న పనులను గడువు నాటికి ఎట్టి పరిస్థితుల్లో పూర్తి చేయాలని అధికారులను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ టి.నిషాంతి ఆదేశించారు. సర్‌కు సంబంధించిన ప్రక్రియలపై అధికారులతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. ముఖ్యంగా పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియ గడువు శుక్రవారంతో ముగిస్తుందని, ఈ క్రమంలో వాటికి సంబంధించిన పనులు పక్కాగా పూర్తి చేయాలన్నారు. అలాగే ప్రతిపాదనను క్షుణ్ణంగా పరిశీలించి, పెండింగ్‌లో ఉన్న అంశాలను తక్షణమే పరిష్కరించాలన్నారు. బూత్ స్థాయి అధికారులు ఎన్నికల సిబ్బంది సమన్వయంతో ఆయా పనులు చేపట్టాలని సూచించారు. అలాగే ప్రధానంగా ఓటర్లకు ఎటువంటి అసౌకర్యం లేకుండా పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ చేయాలని, ఈ ప్రక్రియ అత్యంత ప్రధానమైనదని, ఎటువంటి నిర్లక్ష్యానికి తావులేకుండా పూర్తి చేయాలన్నారు. సర్ ప్రక్రియలో జిల్లా అగ్రస్థానంలో ఉందని, అధికారులు, సిబ్బంది అత్యుత్తమ పని తీరుతోనే ఇది సాధ్యమైందన్నారు. జిల్లాలో మొత్తం 4 లక్షల 99 వేల 752 మంది ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పూర్తి చేశామన్నారు. మృతులు, డబుల్ ఓటింగ్ (అనామలీలు) వంటివి కేవలం 6,461 మాత్రమే ఉన్నాయని, రాష్ట్రంలో 28 జిల్లాల్లో అత్యల్పంగా కేవలం 1.29 శాతం అనామలీ కేసులు మన జిల్లాలో మాత్రమే ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టి.శ్రీపూజ, ఐటీడీఏ పీవో ఆదిత్యవర్మ, జిల్లా రెవెన్యూ అధికారి ఎంవీఎస్ లోకేశ్వరరావు, రెవెన్యూ డివిజనల్ అధికారి ఎం.భుజంగరావు, జిల్లాలోని మండల ప్రత్యేకాధికారులు, తహశీల్దార్లు, ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు, తదితరులు పాల్గొన్నారు.

గ్రావెల్ దోపిడీ ఆరోపణలు పూర్తిగా అవాస్తవం

- మాజీ సర్పంచ్ బొడ్డపు శ్రీను కాసులు



పరవాడ: దేవి కొండను కొల్లగొట్టి గ్రావెల్ దోపిడీ చేశానని దారుణమైన ఆరోపణలు చేస్తూ ఓ దినపత్రికలో రాసిన కథనాలు పూర్తి అవాస్తవం అని ఈ బోనంగి మాజీ సర్పంచ్, జనసేన పార్టీ మండలఅధ్యక్షుడు బొడ్డపు శ్రీనివాసరావు కాసులు ఖండించారు. అనకాపల్లి జిల్లా పరవాడ మండలం, ఈబోనింగి రెవెన్యూ పరిధిలో ఉన్నక్వారీలో తవ్వకాలు జరిపి దోచుకున్నట్లు వచ్చిన కథనం పూర్తిగా అబద్ధమని తెలిపారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ, "నేను గత 15 సంవత్సరాలుగా రాజకీయాల్లో మా నాన్న, నేను ఉన్నామనీ . ఇప్పటివరకు ఎటువంటి అక్రమ సంపాదనకు పాల్పడలేదు, భవిష్యత్తులోనూ అలాంటి పనులు చేయను. అది నా స్వభావం కాదు. మా నాన్న నుంచి నేర్చుకున్న మార్గం కష్టపడి వ్యాపారం చేసుకొని నిజాయితీగా బతకడమే తప్ప, ప్రజల సొమ్ము దోచుకోవడం కాదు. మా కుటుంబ సంప్రదాయం కూడా అదే" అని స్పష్టం చేశారు. తన ఫోటోలతో పాటు కథనంలో చూపించిన క్వారీ ఫోటోపై ఆయన వివరణ ఇచ్చారు. "ఆ క్వారీ 2024 సంవత్సరానికి ముందు 'బుడి ముత్యాలు కుమారుడు బుడి వెంకటేష్' మైనింగ్ ప్రారంభించడం జరిగింది. ఏపీ ఐఐసీ వారు సైట్ లెవలింగ్ కోసం ఆయనకు కాంట్రాక్ట్ ఇవ్వగా, ఆయన మైనింగ్ పర్మిషన్ తెచ్చుకుని 2024-25లో కూడా సగం వరకు తవ్వకాలు కొనసాగించారు. ఆ తవ్వకాలకు, ఆయన వ్యవహారాలకు నాకు ఎటువంటి సంబంధం లేదు. నేనా క్వారీని తవ్వలేదు" అని ఆయన వివరించారు. ఈ కథనాన్ని రాసిన వారు సరైన విచారణ చేసి ఉండాలని, తన గురించి ఎక్కడి నుండి, ఎవరి ద్వారా సమాచారం సమాచారం సేకరించారో పునరాలోచించాలని శ్రీనివాసరావు కోరారు. నా వ్యక్తిత్వం తెలిసినవారికి ఇది నమ్మశక్యం కాని విషయమని విచారణ వ్యక్తం చేశారు. దయచేసి మరోసారి ఆలోచించి వాస్తవాలు తెలుసుకోండన్నారు. ఇలాంటి అసత్య కథనాలు నా కుటుంబ గౌరవాన్ని, ప్రజల్లో నా పైన నమ్మకాన్ని దెబ్బతీయాలని ఉద్దేశంతో వచ్చాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కథనం తనను, తన కుటుంబాన్ని మానసింగా కలచి వేసిందని అసత్య ప్రచారాన్ని ఎదిరించి న్యాయపరంగా చర్యలు తీసుకున్నందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి రూరల్ జిల్లా కార్యదర్శి బుగిడి రామ గోవిందరావు, తదితరులు పాల్గొన్నారు.

పల్లె పండుగతో గ్రామాల్లో మారనున్న రూపురేఖలు

-పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ శాఖ అభివృద్ధి పనులపై జిల్లా కలెక్టర్ సమీక్ష -గ్రామీణ అభివృద్ధి పనులను గడువులోగా, నాణ్యతతో పూర్తి చేయాలి - జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్



అనకాపల్లి: పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో చేపడుతున్న గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్న సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, డ్రైయిన్ నిర్మాణం తదితర అభివృద్ధి పనుల పురోగతిపై జిల్లా కలెక్టర్ సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఎలమంచిలి నియోజకవర్గంలో పనుల పురోగతి మందగించడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. 13 నుంచి 14 నెలలు గడిచినా పనులు పూర్తికాకపోవడాన్ని తీవ్రంగా పరిగణిస్తూ, సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న పనులు, ఆక్రమణలు లేదా స్థల వివాదాల కారణంగా నిలిచిపోయిన పనులను ఐదు నుంచి పది రోజుల్లోగా పూర్తి చేసేందుకు కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. నిర్మాణ వ్యయం లేదా కాంట్రాక్టర్ల సమస్యలతో ఆలస్యమవుతున్న బీటీ రోడ్లను అవసరమైన చోట సీసీ రోడ్లుగా మార్చి త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. పెండింగ్ బిల్లుల సమస్యలను కూడా వెంటనే పరిష్కరించి, పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన మౌలిక సదుపాయాలు అందించడమే లక్ష్యంగా ప్రతి పనిని బాధ్యతతో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ శాఖ అధికారులు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఇంజనీర్లు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రి రవ్‌నీత్ సింగ్ రాజీనామా




రాజ్యసభకు నామినేట్ అయిన బిట్టూ పదవీకాలం పూర్తి కావడంతో తన మంత్రి పదవికి రాజీనామా చేశారు.

డెస్క్: కేంద్ర సహాయ మంత్రి రవ్‌నీత్ సింగ్ బిట్టు రాజీనామా చేశారు. ఆయన రాజీనామాను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదించారు. ఆహారశుద్ధి పరిశ్రమలు, రైల్వేశాఖ సహాయ మంత్రిగా ఉన్న రవ్‌నీత్ సింగ్.. రాజ్యసభ ఎంపీగా పదవీకాలం జూన్‌లోనే పూర్తి కావడంతో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. వచ్చే ఏడాది పంజాబ్‌లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన పోటీ చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే ఆ రాష్ట్రంలో భాజపా బలోపేతానికి రవ్‌నీత్ సింగ్ కృషి చేస్తున్నారు. పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి బియాంత్ సింగ్ మనవడే రవ్‌నీత్ సింగ్. గత లోక్‌సభ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీని వీడి భాజపాలో చేరిన ఆయన.. లుధియానా నుంచి పోటీ చేసి ఓడిపోయారు. అనంతరం రాజస్థాన్ నుంచి

సద్గురు సేవలు దేశానికి స్ఫూర్తి

- సీఎం విష్ణుదేవ్ సాయి



చిక్కబళ్లాపురం: విలువల ఆధారిత విద్యను ప్రపంచవ్యాప్తంగా విస్తరింపజేస్తూ సద్గురు శ్రీ మధుసూదన సాయి చేస్తోన్న సేవలు దేశానికే ఆదర్శమని ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణు దేవ్ సాయి అన్నారు. సత్యసాయి గ్రామంలోని ప్రేమామృతం సభాభవనంలో నిర్వహించిన 'ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ వాల్యూస్ ఎడ్యుకేషన్' ముగింపు వేడుకల్లో పాల్గొన్న ఆయన.. విద్య, వైద్య రంగాల్లో సద్గురు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. సద్గురు మధుసూదన సాయి నిర్వహిస్తున్న విలువల విద్యా సదస్సులు ప్రపంచానికి భారతీయ విద్యా తత్వాన్ని పరిచయం చేస్తున్నాయని సీఎం అన్నారు. ఛత్తీస్‌గఢ్‌తో పాటు దేశంలోని పలు ప్రాంతాల్లో విద్య, ఆరోగ్య రంగాల్లో ఆయన చేస్తున్న సేవలు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. భగవాన్ శ్రీ సత్యసాయి ప్రేమ, కరుణ, సేవా సంప్రదాయాన్ని సద్గురు ముందుకు తీసుకెళ్తున్నారని, భారతీయ సంస్కృతిలో గురు-శిష్య పరంపరకు ఉన్న విశిష్టతను ప్రపంచానికి చాటుతున్నారని అన్నారు. పుస్తకాలు జ్ఞానాన్ని అందిస్తాయని, కానీ ప్రేమతో బోధించేది గురువు మాత్రమేనని శ్రీ మధుసూదన సాయి అన్నారు. సత్యసాయి గ్రామానికి ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి తొలిసారిగా రావడం ఆనందంగా ఉందన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో ఆసుపత్రి, నర్సింగ్ కళాశాలతో పాటు ఇతర సేవా కార్యక్రమాలకు అక్కడి ప్రభుత్వం అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే 'ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ వాల్యూస్ ఎడ్యుకేషన్' వెబ్‌సైట్‌ను ప్రారంభించారు.

భారత్‌పై పదిశాతం సుంకాలు!

-అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తాజా ఆదేశాలు
-ముగిసిన తాత్కాలిక సుంకాల గడువు
-అరవై భాగస్వామ్య దేశాలపైనా కొత్త టారిఫ్‌లు



జపాన్‌లతోపాటు మొత్తం 43 దేశాలకు 12.5 శాతం, మిగిలిన దేశాలపై 10 శాతం టారిఫ్‌లు వర్తిస్తాయని వాణిజ్య సంస్థల ప్రతినిధి జేమిస్ గ్రీర్ తెలిపారు. కొత్త టారిఫ్‌లు అమెరికా కాలమానం ప్రకారం శుక్రవారం అర్ధరాత్రి తరువాత అమల్లోకి రానున్నాయి.

వాషింగ్టన్/న్యూఢిల్లీ: అగ్రరాజ్యం అమెరికా మరోసారి భారత్‌పై టారిఫ్‌ల కొరడా ఝళిపించింది. బలవంతపు చాకిరితో వచ్చిన ఉత్పత్తులను నియంత్రించే లక్ష్యంతోనే ఈ టారిఫ్‌లు విధిస్తున్నట్లు ప్రకటించింది. తాజా ఆదేశాలతో అమెరికా విదేశాల నుంచి దిగుమతి చేసుకునే 99 శాతం వస్తువులపై పది నుంచి 12.5 శాతం టారిఫ్ వర్తిస్తుంది. బలవంతపు చాకిరి ద్వారా వచ్చిన ఉత్పత్తుల ఎగుమతులపై నిషేధం విధిస్తూ చట్టసవరణలు చేసిన కారణంగా భారత్‌పై పది శాతం పన్ను మాత్రమే విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. వాణిజ్య సంస్థల ప్రతినిధులతో ఆయన మాట్లాడుతూ భారత్ లాంటి దేశాలను మరింత ప్రోత్సహించేందుకు పది శాతం టారిఫ్ విధించాలని వాణిజ్య సంస్థల ప్రతినిధులు సూచించారని తెలిపారు. కొత్త టారిఫ్‌లు మొత్తం అరవై దేశాల దిగుమతులకు వర్తిస్తాయని, బలవంతపు చాకిరితో ఉత్పత్తి అయిన వస్తువుల ఎగుమతులపై నిషేధం లేని చైనా, యునైటెడ్ కింగ్‌డమ్,

కల్తీ నెయ్యి అక్రమార్కులపై.. విచారణాధికారుల నియామకం

-ఫ్యాక్టరీస్, బాయిలర్స్ విభాగంపై శాఖాపరమైన విచారణ



అమరావతి: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీకి కల్తీ నెయ్యి సరఫరా చేసిన వ్యవహారంలో ఫ్యాక్టరీస్, బాయిలర్స్ విభాగానికి చెందిన అధికారులపై శాఖాపరమైన చర్యలకు ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులు సమర్పించిన లిఖితపూర్వక సమాధానాలపై విచారించడానికి విచారణ అధికారిగా ఏపీ బాయిలర్ల డైరెక్టర్ బి.ఉమామహేశ్వరరావును నియమించింది. ప్రజెంటింగ్ అధికారిగా ఫ్యాక్టరీస్ డైరెక్టర్ కార్యాలయం జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ మోహనరావు పేరును ప్రకటించింది. వీరు మూడు నెలల్లోగా విచారణ పూర్తిచేసి, తదుపరి చర్యలకు నివేదిక సమర్పించాలని సూచించింది. తిరుపతి జిల్లా పునబాకలోని శ్రీవైష్ణవి డెయిరీ స్పెషాలిటీస్ ప్రైవేట్ లిమిటెడ్ నుంచి లంచాలు తీసుకున్నారనే ఆరోపణలపై ఫ్యాక్టరీస్, బాయిలర్స్ విభాగానికి చెందిన ప్రస్తుత విశ్రాంత డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కర్రి పరమేశ్వరరావు సహా ఏడుగురు అధికారులపై క్రమశిక్షణ చర్యలకు గత మేలో ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. 10 రోజుల్లోగా సంజాయిషీ ఇవ్వాలని ఆదేశించగా, వారంతా లిఖితపూర్వక సమాధానాలిచ్చారు. వీటిని పరిశీలించిన ప్రభుత్వం తాజాగా విచారణ, ప్రజెంటింగ్ అధికారులను నియమించింది. కల్తీ నెయ్యి వ్యవహారంపై సిట్ సిఫార్సు మేరకు ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టింది. వైష్ణవి డెయిరీకి లైసెన్సుల జారీ, నవీకరణ, ధ్రువపత్రాల పరిశీలనకు ఫ్యాక్టరీస్, బాయిలర్స్ అధికారులు.. డెయిరీ నుంచి మామూళ్లు తీసుకున్నట్లు ఆరోపణలొచ్చాయి. అప్పట్లో నెల్లూరు జిల్లా ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన కర్రి పరమేశ్వరరావు, ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్ ఎన్.శివశంకరరెడ్డి, విశ్రాంత ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ బి.రమేశ్‌బాబు, బాయిలర్స్ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ మేడిచెర్ల సత్యనారాయణ, బాయిలర్స్ ఇన్‌స్పెక్టర్లు ఎంవీఎల్ నరసింహరాజు, టి.సుష్మ, పి.రాంబాబుపై ప్రభుత్వం క్రమశిక్షణ చర్యలు చేపట్టింది. సిట్ అధికారుల సోదాల్లో శ్రీవైష్ణవి డెయిరీలో ఓ డైరీ దొరికింది. అందులో ఫ్యాక్టరీస్, బాయిలర్స్ విభాగం సహా వివిధ శాఖల్లోని ఏ అధికారికి ఎప్పుడెప్పుడు ఎంతెంత లంచాలిచ్చారు, నెలవారీ మామూళ్లు ఎంత సమర్పించుకున్నారో అందులో రాసి ఉంది.

టైటిల్ మార్చాల్సి వచ్చింది! 'స్పిరిట్'లో అతిథి పాత్ర?

సమైరా, సముద్రఖని, అభిరామి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'కర్మాఖ్య'. అభినయకృష్ణ దర్శకత్వంలో శ్రీవాణీనాథ్, యశ్వంత్‌రాజ్ నిర్మిస్తున్నారు. ఈ నెల 31న ప్రేక్షకుల ముందుకురానుంది. ట్రైలర్‌ను సీనియర్ నటి విజయశాంతి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'తొలుత ఈ సినిమాకు 'కామాఖ్య' అనే టైటిల్ పెట్టాం. అయితే కొన్ని కారణాల వల్ల టైటిల్ మార్చాల్సి వచ్చింది. అమ్మవారి అంశాలు కలిగిన క్రైమ్ థ్రిల్లర్ చిత్రమిది. ఆద్యంతం అనూహ్య మలుపులతో ఉత్కంఠను పంచుతుంది' అన్నారు. థియేటర్‌లో చూసి ఎక్స్‌పీరియన్స్ చేయాల్సిన సినిమా ఇదని నిర్మాత శ్రీవాణీనాథ్ తెలిపారు. ఆనంద్, శరణ్యప్రదీప్, వైష్ణవ్, ధనరాజ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: గ్యాని, కథ, దర్శకత్వం: అభినయకృష్ణ.



తెలుగులో 'మల్లీశ్వరి' వంటి హిట్ సినిమాలో నటించింది బాలీవుడ్ అగ్ర కథానాయిక కత్రినాకైఫ్. ఆ తర్వాత బాలీవుడ్‌లో సూపర్‌స్టార్‌డమ్‌ని సంపాదించుకుంది. వివాహానంతరం సినిమాలకు బ్రేక్‌నిచ్చి పూర్తిగా కుటుంబానికి పరిమితమైపోయింది. తాజా సమాచారం ప్రకారం ఆమె తెలుగులో రీఎంట్రీ ఇవ్వబోతున్నట్లు తెలిసింది. ప్రభాస్ 'స్పిరిట్'లో కీలకమైన అతిథి పాత్ర కోసం చిత్ర బృందం కత్రినాను సంప్రదించారని, ఆమె సుముఖత వ్యక్తం చేసిందని ఫిల్మ్‌నగర్ టాక్. 'స్పిరిట్' సినిమా ఇప్పటికే 40 శాతం షూటింగ్‌ని పూర్తిచేసుకుంది. సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాపై పాన్ ఇండియాస్థాయిలో భారీ అంచనాలున్నాయి. కెరీర్‌లో తొలిసారి ప్రభాస్ పోలీస్ పాత్రను పోషిస్తుండటంతో ఆయన అభిమానులు ఈ సినిమా కోసం ఆతృతగా ఎదురుచూస్తున్నారు.



రాజకీయాల్లోకి అల్లు అర్జున్.. క్లారిటీ ఇచ్చిన మేనేజర్

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ రాజకీయాల్లోకి రానున్నారంటూ గత కొంతకాలంగా సోషల్ మీడియాలో, సినీ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా ఆయన మామయ్య కాంగ్రెస్ పార్టీలో కీలక నేతగా ఉండటంతో ఈ వార్తలకు మరింత ఊతం లభించింది. అయితే ఈ ప్రచారంపై తాజాగా అల్లు అర్జున్ మేనేజర్ శరత్ చంద్ర నాయుడు స్పష్టత ఇచ్చారు. ఒక ఇంటర్వ్యూలో మాట్లాడిన శరత్ చంద్ర నాయుడు, అల్లు అర్జున్ రాజకీయాల్లోకి వస్తున్నారనే వార్తలను పూర్తిగా ఖండించారు. ఇలాంటి ప్రచారం అంతా ఫేక్ న్యూస్ మాత్రమేనని స్పష్టం చేశారు. ఈ వార్తలు సోషల్ మీడియాలో వచ్చిన వెంటనే నేను వాటికి నేరుగా స్పందించాను. అవన్నీ అవాస్తవ ప్రచారాలే. ప్రస్తుతం అల్లు అర్జున్ దృష్టి పూర్తిగా సినిమాలపైనే ఉంది. ఆయన భారతదేశంలోనే అత్యంత బిజీగా ఉన్న స్టార్ హీరోల్లో ఒకరు. ఇలాంటి సమయంలో ఆయన సినిమాలను పక్కన పెట్టి రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం ఏముంది? అని శరత్ చంద్ర నాయుడు అన్నారు. అలాగే, అల్లు అర్జున్ తన కెరీర్‌లో అత్యంత కీలకమైన దశలో ఉన్నారని, ఇప్పటికే పలు భారీ పాన్ ఇండియా ప్రాజెక్టులకు కమిట్ అయ్యారని తెలిపారు. రాబోయే దాదాపు పదేళ్ల పాటు ఆయన షెడ్యూల్ సినిమాలతోనే బిజీగా ఉంటుందని, అలాంటి పరిస్థితిలో రాజకీయాల గురించి ఆలోచించే అవకాశం లేదని వెల్లడించారు. అల్లు అర్జున్ మామయ్య ద్వారా రాజకీయాల్లోకి ఎంట్రీ ఇస్తారనే ప్రచారాన్ని కూడా ఆయన ఖండించారు. అలాంటి వార్తలకు ఎలాంటి ఆధారాలు లేవని,



కేవలం సోషల్ మీడియాలో జరుగుతున్న ఊహాగానాలేనని చెప్పారు. ప్రస్తుతం అల్లు అర్జున్ వరుస పాన్ ఇండియా చిత్రాలతో బిజీగా ఉన్నారు. దేశవ్యాప్తంగా భారీ అంచనాలు ఉన్న పలు ప్రాజెక్టులు ఆయన చేతిలో ఉండటంతో, పూర్తి దృష్టిని సినిమాలపైనే కేంద్రీకరించారని శరత్ చంద్ర నాయుడు తెలిపారు. దీంతో ఐకాన్ స్టార్ రాజకీయాల్లోకి వస్తున్నారనే ప్రచారానికి తాత్కాలికంగా తెరపడినట్టే అయింది. ప్రస్తుతం అల్లు అర్జున్ రాజకీయాల్లోకి వచ్చే ఆలోచన లేదని, ఆయన ప్రాధాన్యం పూర్తిగా సినీ కెరీర్‌కే పరిమితమైందని ఆయన మేనేజర్ స్పష్టం చేశారు.

రాధా రమణ రాగాలు మనసున మోగే వేళలో

అగ్ర దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా సమర్పణలో భద్రకాళి పిక్చర్స్ పతాకంపై నిర్మితమవుతున్న ప్రేమకథ 'రోమాంచకం'. సుమంత్ ప్రభాస్, అనంతిక సనిల్‌కుమార్ జంటగా నటిస్తున్న ఈ చిత్రం ద్వారా వేణుగోపాల్‌రెడ్డి దర్శకునిగా పరిచయం అవుతున్నారు. ప్రణయ్‌రెడ్డి వంగా నిర్మాత. సెప్టెంబర్ 3న సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్నది. ప్రచారంలో భాగంగా ఈసినిమాలోని తొలిపాటను మేకర్స్ విడుదల చేశారు. 'రాధా రమణ రాగాలు మనసున మోగే వేళలో.. ఏదో తపన తాగేసి వయసులు ఊగే వేళలో..' అంటూ సాగే ఈ పాటను చంద్రబోస్ రాయగా, వాసుకి వైభవ్ స్వరపరిచి, ఆలపించారు. హీరోహీరోయిన్ల మధ్య పొయెటిక్ రొమాంటిక్ ఫీల్‌తో ఈ పాటను చిత్రీకరించినట్టు మేకర్స్ తెలిపారు. ప్రేమ, హాస్యం, ఉత్కంఠ కలగలిసిన యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ ఇదని వారన్నారు. ఉపేంద్ర లిమాయె, వెంకటేశ్ కాకుమాను, నరేంద్ర రవి, మణి, సోహాన్ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: పవన్ పప్పుల.



"మౌనం కాదు.. గళం విప్పాలి".. దేశ సమస్యలపై మంచు లక్ష్మి ఎమోషనల్ కామెంట్స్

దేశంలో జరుగుతున్న సామాజిక, ప్రజా సమస్యలపై ప్రతి పౌరుడు బాధ్యతగా స్పందించాలని ప్రముఖ నటి, నిర్మాత మంచు లక్ష్మి పిలుపునిచ్చారు. మనకెందుకులే అనే నిర్లక్ష్య ధోరణిని విడిచిపెట్టి, సమాజంలో జరుగుతున్న అన్యాయాలపై ప్రతి ఒక్కరూ తమ స్వరం వినిపించాలని ఆమె కోరారు. తాజాగా రాజ్యాంగ హక్కుల కోసం ఆందోళన చేస్తున్న ప్రముఖ పర్యావరణవేత్త, సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్కు మద్దతుగా మంచు లక్ష్మి సోషల్ మీడియాలో ఓ వీడియోను విడుదల చేశారు. ఆ వీడియోలో దేశంలో జరుగుతున్న పరిణామాలపై తన అభిప్రాయాలను వ్యక్తం చేస్తూ, ప్రజల్లో సామాజిక బాధ్యత పెరగాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. మంచు లక్ష్మి మాట్లాడుతూ, దేశంలో కీలకమైన సమస్యలు ఎదురవుతున్నప్పుడు చాలామంది వాటిని తమకు సంబంధం లేని విషయాలుగా భావించి మౌనం పాటిస్తున్నారని అన్నారు. కానీ అలాంటి వైఖరి ప్రజాస్వామ్యానికి మంచిది కాదని ఆమె అభిప్రాయపడ్డారు. ప్రతి ఒక్కరూ ప్రత్యక్షంగా ఉద్యమాల్లో పాల్గొనాల్సిన అవసరం లేకపోయినా, కనీసం సమస్యలపై మాట్లాడటం, చర్చించడం, సోషల్ మీడియా ద్వారా స్పందించడం కూడా ఒక బాధ్యతాయుతమైన పౌరుడి కర్తవ్యమని పేర్కొన్నారు. సోనమ్ వాంగ్‌చుక్ వంటి వ్యక్తులు ప్రజల హక్కుల కోసం చేస్తున్న పోరాటానికి న్యాయం జరగాలని తాను కోరుకుంటున్నానని మంచు లక్ష్మి తెలిపారు. ఆయన ఆశయాలను తాను గౌరవిస్తున్నానని, సమాజ ప్రయోజనాల కోసం పోరాడే వ్యక్తులకు ప్రతి ఒక్కరూ మద్దతు ఇవ్వాల్సిన అవసరం ఉందని అన్నారు.



అలాగే రాజకీయాలపై విమర్శలు చేయడం కంటే, దేశ భవిష్యత్తు, రాబోయే తరాల సంక్షేమం కోసం బాధ్యతతో స్పందించడం ముఖ్యమని ఆమె పేర్కొన్నారు. దేశంలో జరుగుతున్న పరిణామాలను చూస్తూ నిశ్శబ్దంగా ఉండటం తనను బాధిస్తోందని, సమస్యల పరిష్కారం కోసం ప్రజలంతా చొరవ చూపాలని ఆమె విజ్ఞప్తి చేశారు. మంచు లక్ష్మి విడుదల చేసిన ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆమె సందేశానికి పలువురు నెటిజన్లు మద్దతు తెలుపుతూ, ప్రజా సమస్యలపై అవగాహన పెంచే ప్రయత్నాలను అభినందిస్తున్నారు. సమాజంలో జరుగుతున్న అంశాలపై స్పందించడం ప్రతి పౌరుడి బాధ్యత అని ఆమె చేసిన పిలుపు ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

ఇప్పటికీ సింగిలే.. పెళ్లి చేసుకోవాలని అనుకున్నవారు మెసేజ్ చేయండి..!

ఒకప్పుడు ఆనందం సినిమాతో తెలుగు ప్రేక్షకుల హృదయాలను గెలుచుకున్న హీరోయిన్ రేఖ వేదవ్యాస్ చాలా కాలంగా సినిమాలకు దూరంగా ఉన్నప్పటికీ, తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తన వ్యక్తిగత జీవితం, ప్రేమ, పెళ్లి గురించి చెప్పిన విషయాలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇంటర్వ్యూలో రేఖ వేదవ్యాస్ మాట్లాడుతూ.. తాను ఇప్పటికీ పెళ్లి చేసుకోలేదని వెల్లడించారు. సల్మాన్ ఖాన్‌లాగే నేనూ సింగిల్‌గానే ఉండిపోతానేమో అంటూ నవ్వేశారు. తాను ఇంకా సింగిల్‌గా ఉన్నానని చెప్పినా చాలామంది నమ్మరని,ఎవరో ఒకరు ఉంటారులే అని అనుకుంటారని అన్నారు. తనకు కాబోయే భర్త ఎలా ఉండాలని అడిగిన ప్రశ్నకు రేఖ ఎంతో పరిపక్వతతో సమాధానం ఇచ్చారు. యవ్వనంలో జీవిత భాగస్వామి గురించి ఎన్నో అంచనాలు, పెద్ద జాబితాలు ఉండేవని, కానీ ఇప్పుడు అలాంటివి ఏమీ లేవని చెప్పారు. పర్‌ఫెక్ట్ మనిషి ఎవరూ ఉండరు. నేనూ పర్‌ఫెక్ట్ కాదు. నన్ను నిజంగా ప్రేమించే మంచి మనసున్న వ్యక్తి దొరికితే చాలుఅని తెలిపారు. ఎత్తు, రంగు, రూపం వంటి విషయాలకు తాను ప్రాధాన్యం ఇవ్వనని, మంచి హృదయం ఉంటే అదే జీవితాంతం నిలిచే అందమని పేర్కొన్నారు. ఇంటర్వ్యూలో సరదాగా మాట్లాడుతూ.. నిజంగా పెళ్లి చేసుకోవాలనే ఉద్దేశం ఉన్నవారు తన ఇన్‌స్టాగ్రామ్ ఐడీ ఖఱుఅఱుఎబితీవఎష్ట్రకు మెసేజ్ చేయొచ్చని చెప్పారు. అయితే టైమ్‌పాస్ కోసం కాదు, జీవిత భాగస్వామిగా ఆలోచించే వారు మాత్రమే సంప్రదించాలని స్పష్టం చేశారు. ప్రేమ, క్రష్, ఇన్ఫ్యాచుయేషన్, అబ్సెషన్ మధ్య తేడాను కూడా రేఖ వివరించారు. ఇన్ఫ్యాచుయేషన్ అంటే వారితో



రిలేషన్‌లో ఉంటే బాగుంటుందని అనిపించడం.ఆబ్సెషన్ మాత్రం ప్రమాదకరమని, "వాళ్లు నాకే కావాలి" అనే స్వార్థ భావన అని చెప్పారు.ప్రేమలో మోసం చేసే వారికి కర్మ తప్పదని, ప్రతి చర్యకు ఫలితం ఉంటుందని తాను గట్టిగా నమ్ముతానని తెలిపారు. వన్‌సైడ్ లవ్ చాలా పవర్‌ఫుల్ అని అభిప్రాయపడిన రేఖ.. అయితే అది మనసులోనే దాచుకోకుండా, నిజంగా ప్రేమిస్తే సరైన సమయంలో ధైర్యంగా చెప్పాలని యువతకు సూచించారు. నిజమైన ప్రేమను గౌరవించి, కుటుంబ సభ్యుల అంగీకారంతో జీవితాన్ని ముందుకు తీసుకెళ్లాలని ఆమె సలహా ఇచ్చారు.

ప్రెగ్నెన్సీ కోసం 1000 ఇంజెక్షన్లు తీసుకున్నా.. ఐవీఎఫ్ చికిత్సపై నటి తేజస్వినీ కొల్హాపురి

సినీ నటి, మోడల్ తేజస్వినీ కోల్హాపురి.. తాజాగా ఓ పోడ్‌కాస్ట్‌కు ఇంటర్వ్యూ ఇచ్చింది. ప్రెగ్నెన్సీ కోసం ఐవీఎఫ్ చేయించుకున్న తీరు గురించి ఆమె హృదయవిదారకర పరిస్థితిని వివరించింది. సిద్ధార్థ కన్నన్‌తో జరిగిన పోడ్‌కాస్ట్‌లో ఆమె మాట్లాడుతూ.. ఐవీఎఫ్ పద్ధతిలో పిల్లలు కనేందుకు చాలా ఇబ్బందిపడినట్లు చెప్పింది. ఒకప్పటి సినీ నటి పద్మిని కొల్హాపురి సోదరియే తేజస్వినీ. బాలీవుడ్ నటులు శ్రద్ధా కపూర్, సిద్ధాంత్ కపూర్‌లకు వరుసకు మేనత్త అవుతుంది. అయితే ఐవీఎఫ్ విధానం వల్ల తీవ్రమైన మానసిక, శారీరక బాధను అనుభవించాల్సి వచ్చినట్లు చెప్పిందామె. తన జీవితంలో అదో సంక్లిష్టమైన దశ అని ఆమె తెలిపారు. అయిదు సార్లు ఐవీఎఫ్ చేయించుకున్నట్లు తేజస్వినీ చెప్పింది . దీని గురించి ఓపెన్‌గానే మాట్లాడుతాను. ఐవీఎఫ్ పద్ధతి చాలా కష్టమైందన్నారు. మొదటిసారి, రెండోసారి సమస్య తీవ్రంగా ఉంటుందని, ఇక ఆ తర్వాత మూడు, నాలుగు, అయిదోసారి పర్వాలేదనిపిస్తుందన్నారు. మానసికంగా చాలా ధైర్యంగా ఉండాలని, ఇంజెక్షన్ల కోసం ప్రతిసారి క్లినిక్‌లకు వెళ్లాల్సి వస్తుందన్నారు. చాలా నొప్పిని తట్టుకోవాల్సి వస్తుందన్నారు. చాలా ఆలస్యంగా పిల్లలు కనాలని అనుకున్నానని, కానీ 35 ఏళ్ల లోపే పిల్లల్ని కనాలని సలహా ఇస్తున్నట్లు ఆమె చెప్పారు. మానసికంగా తాను ధైర్యంగా ఉన్నానన్నారు. కానీ శారీరకంగా ఇబ్బంది పడాల్సి వచ్చినట్లు ఆమె చెప్పారు. ఐవీఎఫ్ చికిత్స వల్ల తన బాడీ షేప్ మారినట్లు ఆమె పేర్కొన్నది. వందల సంఖ్యలో ఇంజెక్షన్లు తీసుకోవడం వల్ల ఆ సమస్య వచ్చిందన్నారు. సుమారు వెయ్యికి

పైగా ఇంజెక్షన్లు తీసుకున్నట్లు తేజస్వినీ చెప్పింది. ప్రెగ్నెన్సీ ఓకే అయిన తర్వాతే ఇంజెక్షన్లను ఆపేస్తారని తేజస్వినీ పేర్కొన్నది. ప్రెగ్నెన్సీ కోసం చాలా ఇబ్బంది పడ్డానని, అయిదు సార్లు ఐవీఎఫ్‌కు వెళ్లాల్సి వచ్చిందన్నారు. అయిదోసారి లక్కీగా జరిగిందన్నారు. మధ్యలో రెండు సార్లు మిస్ క్యారేజ్ అయ్యిందన్నారు. ఫిల్మ్‌మేకర్, నటుడు పంకజ్ సరస్వత్‌ను తేజస్వినీ కొల్హాపురి పెళ్లి చేసుకున్నది. ఆ ఇద్దరికీ అమ్మాయి పుట్టింది. పెళ్లి అయిన 8 ఏళ్లకు వారికి సంతానం కలిగింది. 2015, జనవరి 30వ తేదీన కూతురు వేదిక పుట్టింది.

మహిళా ప్రధాన కథకు గ్రీన్‌సిగ్నల్?

కథ, పాత్ర సరిగ్గా లేకపోతే సినిమా అంగీకరించరు సాయిపల్లవి. సాధ్యమైనంత వరకూ ఆమె నటించే సినిమాల్లో బలమైన కథలే ఉంటాయి. పాత్రలు కూడా బరువుగానే ఉంటాయి. ప్రస్తుతం బాలీవుడ్ పాన్ ఇండియా మూవీ 'రామాయణ'లో సీతాగా సాయిపల్లవి నటిస్తున్న విషయం తెలిసిందే. ఇటీవలే మణిరత్నం సినిమాకు కూడా ఈ అందాలభామ ఓకే చెప్పింది. కాకపోతే 'తండేల్' తర్వాత తెలుగులో ఏ కథనూ సాయిపల్లవి ఓకే చెయ్యలేదు. తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం దర్శకుడు తిరుమల కిశోర్ ఇటీవలే సాయిపల్లవికి ఓ కథ వినిపించారట. మహిళా ప్రధానంగా సాగే ఈ కథలో.. దైవిక శక్తులు, పురాణాల టచ్ కూడా ఉందట. కథలోని భావోద్వేగాలు, పాత్ర ప్రాధాన్యత సాయిపల్లవిని ఆకట్టుకున్నాయని, ఈ ప్రాజెక్ట్‌పై ఆమె సానుకూలంగానే స్పందించినట్టు తెలుస్తున్నది. ఇక దీనిపై సాయిపల్లవి నుంచి అధికారికంగా గ్రీన్‌సిగ్నల్ వస్తే, ఇతర



నటీనటులు, నిర్మాతల వివరాలు ప్రకటించే అవకాశం ఉంది.

"PRAJA MUDRA" Telugu Monthly Printed, Published and owned by NAGIREDDY SIVAJI, Do.no.12-4-103/2, Pudimadakaroad, Anakapalli, Anakapalli district, Andhra Pradesh - 531001 Published at Do.no.12-4-103/2, Pudimadakaroad, Anakapalli, Anakapalli district, Andhra Pradesh - 531001. and Printed at Chaitanya Vaaradhi Printers, Do.No.2-99, Bharinikam, Paravada, Anakapalli, Visakhapatnam-531 021. Editor : NAGIREDDY SIVAJI, Do.no.12-4-103/2, Pudimadakaroad, Anakapalli, Anakapalli district, Andhra Pradesh - 531001. RNI.NO. APTEL/2023/87943, Cell : 91334 63346